
# వింధియా కథలు




అనువాదం:

కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్

**PARVATI (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya’s Tamil Short Stories)
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 2

First Edition, 2019
© KNS Family/Surviving Members

***Cover Design: Linae Erin Heck***

The cover illustration is from the ***Kalaimagal,***
Issue dated August 15, 1947.
Used with permission.

***Photo Credits:***

Back Cover:

G.K. Vale & Co., Chennai, India

**Printed at:**

The Copy World
2001 3rd Street,
San Francisco, CA 94107
Phone: 800.930.COPY

# పార్వతి

## (వింధియా కథలు)

మూలం: తమిళం

అనువాదం:

కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్

Published By

Kurinji Publications
10944 San Pablo Avenue # 610
El Cerrito, CA 94530, USA
Email:
rangan.sundaresan@gmail.com

# ఇందులో. . .

ముందు మాట

1. పార్వతి
2. నిలువుటద్దం
3 అపవాదం
4. ఊహ ఋజువైంది!
5. అపరాధ భావం
6. అంతర్బుద్ధి
7. భలే, స్నేహితురాలు!
8. పుట్టుమచ్చ సందేశం
9. ఆమె ఆకాంక్ష
10. పదం తప్పింది

# పార్వతి[1]

నేను అప్పుడే ఉదయాన్న చెయ్యవలసిన ఇంటిపనులు పూర్తి చేసుకొని కాస్త నడుం వాలుద్దాం అని అనుకుంటున్నాను. ఏదో వార్తాపత్రిక తిరగవేదామనుకుంటుండగా మీనా నన్ను పిలుస్తున్నట్లు వినబడింది; మా పొరుగింటి పదేళ్ళ పాప. "ఆంటీ, మా అమ్మ మిమ్మల్ని నిలుచున్న పాళానే రమ్మంటునారు," అని చెప్పింది. వెంటనే చేతులోని పత్రిక కింద పడేసి మా ఇంటికి నాలుగిళ్ళావతల ఉన్న వాళ్ళింటికి ఆమె వెంట బయలుదేరాను.

భయం, ఆతృత మిళితమైన గొంతుతో మీనా అమ్మగారు నన్ను వాళ్ళ వాకిట్లోనే ఆహ్వానించారు. "దయ చేసి లోపలికి రండి," అంటూ నన్ను ఆమె లోపలికి తీసుకొని వెళ్ళారు. "నాకేమిటో అంతా కంగారుగా ఉంది. నేనే మీతో సంప్రదించాలనుకున్నాను. క్షమించాలి. ఇంత ఎండలో మిమ్మల్ని ఇంత దూరం నడిపించాను. ఏం చెయ్యను? నాకేమీ పాలుపోలేదు!"

"మరేం పరవాలేదు, నేనేం మీ ఇంటికి ఆమెడ దూరంలో లేనుకదా," అని భరోసా ఇస్తూ వాళ్ళ ఇంట్లోకి ప్రవేశించాను. "నా సలహా ఏం కావాలో చెప్పండి."

ఆ ఇంటిలో గంభీరమైన నిశ్శబ్దం తాండవిస్తోంది. నేనెప్పుడు వాళ్ళింటికి వెళ్ళినా గుమ్మంలోనే నన్ను పలకరించే సరస్వతి ఆ నాడే కానరాకపోయేసరికి నాకు కొంచెం ఆశ్చర్యం కలిగింది. సరస్వతి  వాళ్ళ పెద్దమ్మాయి; ఎనిమిదో తరగతి పూర్తిచేసి, ఇంక ఆ ఊళ్ళో చదివే అవకాశంలేక, ఇప్పుడు ఇంట్లోనే ఉంటుంది. లోక పరిచయంకోసం అన్ని రకాల పుస్తకాలూ స్వయంగా చదువుతుంది. వయస్సు పదమూడే అయినా తన తల్లివద్ద పొందే శిక్షణ అమూల్యమైనది; చురుకైన అందమైన పిల్ల. ఇంటికి కావలసిన బట్టలన్నీ తనే కుట్టేది; శాస్త్రీయ సంగీతం చక్కగా అభ్యసించింది ఇంటి పనిలో తల్లికి తోడుజోడుగా ఉంటుంది. ఇక ఒక తల్లికి మరేం కావాలి? అమ్మాయికి సరైన భర్త దొరకాలని నేను భగవంతున్ని ప్రార్ధిస్తుంటాను. నాకు చాలా ఇష్టం, ఆ అమ్మాయంటే. కానరాకపోయేసరికి అమ్మని అడిగాను, "సరస్వతి ఎక్కడ?"

---

[1] ఇది కే.వి. శేషారావుగారి అనువాదం

"అదే, ఇప్పుడు సరస్వతిగురించే నా యాతనంతా," అన్న రాజం నాతో "నేనిప్పుడు పెద్ద సందిగ్ధలో పడ్డాను. దానిగురించే మీతో సంప్రదించుకోవాలి అనుకుంటున్నాను. అందుకే మీకు కబురు పెట్టాను."

ఆమె మనస్సులోని బాధ అంతా వెళ్ళగక్కి భారమైన ఒక నిట్టూర్పు విడిచింది.

సరస్వతి గురించి శుభవార్తే. ప్రక్రుతి మాత ఈమె మీద తన శక్తిని ప్రసరింపచేసింది. ఈ అమ్మాయి ఈడేరింది.

నిన్నటివరకూ ఈ అమ్మాయి ఒక లంగా, జాకెట్టు వేసుకొనే చిన్న పాపాయి; కానీ ఈనాడు వికసించిన ఒక యువతి.

పుష్పవతైనందుకు ఆనందించకుండా రాజం ఊరికే కంగారుపడిపోతునట్లు కనిపిస్తోంది. లోలోపుల సంతోషం; పట్టణం, పల్లె కాని సంప్రదాయం తెలియని ఈ ఊళ్ళో ఈ ప్రస్తుత యిబ్బందిని ఎలా ఎదుర్కోడమా అనే సందిగ్ధంలో రాజం ఇక్కట్లు పడుతోంది. ఆమెకు కూతురు పుష్పవతైన విషయాన్ని దాచిపెట్టాలనే కోరిక లేదు; కాని వెల్లడించానికి ధైర్యం లేదు. నా పట్ల ఆమెకు ప్రత్యేకమైన గురి, గౌరవం ఉండడంవలన నా సలహా కోరింది. నేను ఎటువంటి అరమరిక లేకుండా, అక్కడికక్కడే నిష్కర్ష గా ఇవ్వవలసిన సలహా ఇచ్చేసాను. స్వేచ్ఛమైనది నా స్పందన.

"మామీ, సాహసాపేతమైన మీ సలహా నాకు ఆశ్చర్యం కల్గించింది," అన్నది రాజం. "సరిగ్గా మీ ఆలోచనలాంటిదే నా ఆలోచనకూడా. ఐనా నా భావాన్ని అమలుపరిచే ధైర్యం నాకు లేదు. నాకు అసలు అరమరికలంటూ ఏమీ లేవు."

"నిజమే, నాకలాంటిదేమీ లేదు. నువ్వుకూడా అనవసరమైన ఆందోళనలు చెందకూడదు. నేను చెప్పినట్లు చెయ్యి. నిజాన్ని మనం ఎప్పుడూ దాచకూడదు. దాని పరిమాణాలెలా ఉంటాయో మనకి తెయదు. ఈ రోజు చాలా పవిత్రమైన శుక్రవారం. ధైర్యంగా వెల్లడి చేసేయి; ధైర్యంగా నా సలహా అమలు చెయ్యి,"

"నిజమే, నేనూ అదే అనుకుంటున్నాను," అని బదులు చెప్పింది రాజం."నా మనస్సు చెప్పినదానికీ, మీ సలహాకీ ఎదురు చెప్పను. ఇతర కార్యక్రమాలలకి

నేను ముందడుగేస్తాను. మీరు మాత్రం ఈ మూడు రోజులూ మా ఇంటి దగ్గర కార్యక్రమాలికి నాకు సహకరించాలి."

నేను ఇంటికి  నెమ్మదిగా తిరిగి వచ్చేసాను. ఆ తరువాత మూడు రోజులూ వాళ్ళ ఇంటిలో అన్ని సంస్కారాలు క్రమంగా జరిగాయి. విందులతోపాటు సరస్వతికి చాలా బహుమతులుకూడ వచ్చాయి. ఆ నాలుగవ రోజు రాజం మా ఇంటికి వచ్చింది. ఆ నాడు నేను ఆమె మొహంలో చూసిన యాతన పోయి ఇప్పుడు ఒక మెరుగు కనిపించిం ంది.

"మామీ, మీరు ఆ రోజు నాకు చూపిన ధైర్యం వలనే మీ సలహాకి నేను సమ్మతించాను. ఇప్పుడు నాకెంత సంతోషమో తెలుసా? కాని, నాకు ఒకే ఒక సంగతి తెలియాలు. మీరెలాగ ఆ రోజు నాకు ఎటువంటి సంకోచమూ లేకుండా సలాహ్ ఇచ్చారు? మీకు చాలా ఉదారమైన మనస్సు!"

"అవును, నేను  ఇందకు ముందు  ఇలాంటి సంఘటనలో చేసిన పొరబాటు వలన ఒక మంచి పాఠం నేర్చుకున్నాను. నా చెల్లెలు - అమాయకురాలు, సంతతులేని స్త్రీ - ఒక దురభిప్రాయానికి గురియై చాలా బాధపడింది.  దాని అనుభవం నా కళ్ళు తెరిపించడానికి కారణం."

"మీరేమంటున్నారు? నేను ఆరు నెలలముందు మీ ఇంటిలో పార్వతిని ఆమె భర్తతో చూసాను! ఆమె జీవితంలో కష్టాలా?"

"అవును, నేను చెప్పేది పార్వతి గురించే. చాలా కాలం అది భర్తతో కాపురం చెయ్యగలదా అని మేం కలవరపడ్డాం. పెళ్ళైన తరువాత రెండున్నర సంవత్సరాలవరకు వాళ్ళు  పార్వతిని అత్తగారింటికి రానివ్వలేదు."

"అలాగా? పార్వతిని ఆమె భర్త మొదట తోసిపెట్టారన్న మాట! వాళ్ళిద్దరినీ చూస్తే నాకు ఆదర్శ దంపతులుగా కనిపించారు. వాళ్ళ మధ్య అతృప్తి అంటే ఎవరూ నమ్మరు!"

"నిజమే, ఎవరూ నమ్మరు. ఇప్పుడు పార్వతి భర్తతో సుఖంగా కాపురం చేస్తుంది కాపట్టి వెనకటి కష్టాలూ, ఆందోళనలూ ఇప్పుడు స్వప్నంలాగ కనిపిస్తాయి. ఆ భగవంతుని కృపవల్లనే ఇప్పటికి వాళ్ళ బాధలన్నీ తీరాయి."

"వీటన్నిటికీ కారణమేమిటి, మామీ? మీరేమో ఏదో పెద్ద పొరబాటు చేసేనన్నారు; అసలేం జరిగింది?"

రాజం కోరికని తృప్తి పరచడమేకాకుండా నా మనస్సు భారం తగ్గించుకోవాలనుకున్నాను. అందువలనే అన్ని వివరాలూ ఆమెకు చెప్పడం ఆరంభించాను.

"మేం ఇక్కడికి రావడానికి పూర్వం తిరుచ్చి జిల్లాలో ఆరు సంవస్తరాలున్న విషయం నీకు గుర్తుందా? ఆ ఆరు సంవత్సరాల్లోనే ఇదంతా జరిగిపోయింది: పార్వతి మాతో ఉండడానికి రావడం, చివరికి భర్తతో కలిసి హాయిగా కాపురం చేయడం, మొదలైనవన్నీ. ఆమెకి ఇంకా పదేళ్ళు నిండకుండానే ఆమె తల్లితండ్రులు పోయారు. అందువల్ల ఆమె మా ఇంట్లోనే పెరిగింది.

ఇప్పుడు సరస్వతిలాగే, అప్పుడు ఆమెకూడా ఈడేరింది. అప్పుడు నేను నా పరిస్తితిని ఎదుర్కొన్న విధం ఇప్పుడు నీకిచ్చిన సలహాకి పూర్తి విరుద్ధమైనది. అప్పుడు ఆమె స్తితిని నేను పూర్తిగా రహస్యంగా ఉంచేను. సహజంగా తనకు మించిన శరీరాకృతి సరస్వతికి. ఇంకా పూర్తిగా  పదమూడేళ్ళుకూడా నిండలేదు. మొహంలో చిన్నపిల్ల అమాయకత్వం జలజలలాడేది. ఆమెది పుష్టమైన, సహజమైన శరీరాకృతివల్ల నేనే ఆమెను చీర కట్టుకోమని ప్రోత్సాహించాను అని ఇరుగుపొరుగున ఆమె స్నేహితులకి చెప్పేదాన్ని. నేను చెప్పిన తీరునిబట్టి ఎవరికీ ఏ విధమైన అనుమానం కలగలేదు; అందువలన ఎవరుకూడా అనుమానం లేకుండా పూర్తిగా నమ్మేసావారు.

నేను చేసేదంతా ఆమె మంచికోసం అని నేనెప్పుడూ భావించేదాన్ని. పార్వతి తల్లిలేని పిల్ల ఆవడం వలన ఆమె సుఖ సంతోష బాధ్యత నా మీద వేసుకున్నాను. ఆమె మీద అపవాదమో, చెవులు కొరుక్కోనే పదాలు కూడా ఊడకూడదన్నదే నా కోరిక. ఎవ్వరివలనా ఆమెకు ఇంకా ఎందుకు పెళ్ళి కాలేదు అని యధాలాపంగానైనా అనే మాటలు విని ఆమె మనస్సు కలత చెందకూడదు అని నా ఆరాటం. మనమొకటి తలుస్తే భగవంతుడు మరొకటి తలుస్తాడు,' అనే సామెత వర్తిస్తుందన్న విషయం నేనప్పుడు గుర్తించలేదు. ఆ తరువాత సంభవించిన పరిమాణాలన్నీ కూడ నేనూహించినదానికి విరుద్ధంగా సంభవించాయి.

పార్వతికి పద్నాలుగేళ్ళు నిండేసరికి ఆమెకు ఒక భర్తని వెదికి పెళ్ళిచేసాం. ఆ భర్త సదాచారపరాయుణుడులాగ ఉన్నాడు. అందువలన పార్వతికి రాబోయే అత్తగారికీ, బంధువులకీ నా పెద్దకొద్దీ చెప్పుకుబోయేను. "ఈ రోజుల్లో, చాలా కుటుంబాలలో పిల్ల ఈడేరిందన విషయం మరుగున పెట్టి అమ్మాయిల పెళ్ళులు చేస్తున్నారు. అటువంటి భయాలున్నవారు తప్పక వాటి దుష్ఫలితాలు అనుభవింక తప్పరు. నా విషయంలో మాత్రం ఆమె ఈడేరిందన్న సంగతి నిశ్చయంగా చెప్పదలచుకున్నాను. నేను ధైర్యవంతురాలిని కాబట్టి, దేముడి దయవలన పార్వతికి ప్రస్తుతానికి అటువంటి యిబ్బందులు ఏవీ లేవు. ఆమె పెళ్ళి మాత్రం మన హిందూ ధర్మ సిద్ధాంతల ప్రకారంగానూ, శారాదా చట్టాన్ని అతిక్రమించకుండానే జరుగుతోంది." నేను పూర్తిగా యధార్ధంగా మాట్లాడుతున్నాను అనే ధీమాతో చెప్పేసాను. వాళ్ళందరూ నా మాటలు పూర్తి విశ్వాసంతో నమ్మేసినందుకు నా తెలెవితేటలకు నన్ను నేనే అభినందించుకున్నాను.

మా ఊరికి అట్టేదూరంకాని ఒక పల్లెటూరిలో నివసిస్తున్నారు పార్వతి అత్తగారు. అందువలన భినాల పండుగకి ఆమె అత్తగారూ, వదినగారూ, మరో ఇద్దరు పిల్లలతోసహం ఆమె భర్త వెంట వచ్చేసారు. ఈ రోజుల్లోని ఆచారాన్నే కనుక వాళ్ళు తు.చ. తప్పకుండా పాటించి ఉంటే, తెలివిగా, భర్తనొక్కణ్ణే పంపించి ఉండేవారు. ఐతేనేం, వాళ్ళది మధ్య తరగతి పల్లె కుటుంబం. చుట్టాలందరూ ఇరుగు పొరుగువారే. అందరూ ఒక శుభోదయాన మా ఇంటిపై దండెత్తారు. అప్పుడే పార్వతికి ఆమె జీవితంలో - మనస్సు చెదిరిపోయినట్టు - ఒక అఘాతమైన సంఘటన జరిగింది.

ఆ సమయంలో పార్వతి ఋతుమతి అయింది; అది నాకు రహస్యంగా చెప్పింది. అంతవరకూ నేను ఆమె పరిస్తితిని ఎవరికీ తెలియకుండా దాచాను. ఐనా కూడా ఆ మూడు రోజులూ పార్వతి గృహపరిభ్రమ కాలంగానే అనుసరించింది. ఇది మేం తు.చ. తప్పకుండా మా ఇంటిలో అనుష్టించే ఆచారం. అందువలనే ఈ విషయంలో ఇప్పుడు రాజీ పడాలని నాకు తోచలేదు. ఇప్పుడు పార్వతి నలుగురి మధ్య కలిసి మెలగడం జరగవద్దని నేను బహిరంగా పార్వతి ఆనాడు పెద్ద పిల్ల

అయిందని చెప్పదలచుకున్నాను. దానికి పెళ్ళై మూడు మాసాలు నిండాయి; ఆమె భర్త, అతని బంధువులూ ఇప్పుడు మాతో ఉన్నారు. అంతేకాదు, ఇప్పుడు నా కోరిక అమలుపరిచితే అదనపు ఖర్చులు తగ్గించవచ్చు. బంధువులెవ్వరికీ ప్రయాణకోసం ఏమీ ఇవ్వనక్కరలేదు. ఇదే మంచి తరుణం, మరెందుకు ఆలస్యం? అని నన్ను నేనే మెచ్చుకున్నాను.

మరేం సంశయం లేకుండా ఆ రోజే పార్వతి రజస్వరాలయిందని ప్రకటన చేసి ఇక నేను చెయ్యవలసిన ఆగమాలు ఆరంభించాను.

ఒక అర్ధ గంట తరువాత ఇంటి వసారాలో ఏదో పుస్తకంలో పూర్తిగా మునిగి ఉన్న పార్వతి భర్త తటాలున లేచి ఇంటిలోకి ప్రవేశించారు.

అతని గర్జన ఉరుములాగ ఉంది; మాటలు పిడుగుల్లా అదరగొట్టాయి.

"మీ అమ్మాయి మొహం చూస్తే చాలు, మహా పాపం చుట్టుకుంటుంది," అని అతను కేకలు పెట్టాడు. "ఇక మాకు మీతో ఏం సంబధమూ వొద్దు!"

"ఏం, ఏం జరిగింది? " మాకందరికీ విభ్రాంతి. అతని అమ్మగారు అడిగారు: "వాసూ, ఏమిటి సంగతి?"

"ఏమిటా? నువ్వే ఇది చదివిచూడు," అని బొబ్బలు పెడుతూ అతను చేతిలోని పంచాంగం నేలమీద విసిరాడు. "నీ కోడలుగురించి నక్షత్రాలు ఏమంటున్నాయో తెలుసా?"

అతని మొహం కోపంతో రగిలిపోతోంది. దాన్ని చూడడానికి కూడా నాకు ధైర్యం రాలేదు. అయినా కొద్ది మాటలు అతనికి సాహసించాను.

"మీరన్నది అర్థమైంది; ఏమైనా దోషాలుంటే వాటి నివారణకి మనం శాంతి చేయించుకో వచ్చు . . . కావాలంటే మీరు ఇంకెవరినైనా సంప్రదించవచ్చు. శాంతి చేయించడంలో ఎటువంటి తప్పు లేదే."

"ఓహో, శాంతి హోమంతో ఆమె స్తితిని మార్చుకోవచ్చని అనుకుంటున్నారా? అసలు సమస్యంతా, శుద్ధ కార్యక్రమాల శాంతి హోమాలకి అతీతులైన ఆడదాన్ని నేను పెళ్ళాడాను. ఆమె జాతకంగాని, నక్షత్రం గాని పరిశీలిస్తే పంచాంగాన్నిపట్టి ఆమె నిష్కృతికి తావే లేదు. ఈ ఇంట్లో ఇంకా ఒక క్షణం కూడా నేను నిలబడలేను!," అని అంటూ అతను అదే ధోరణిలో వాళ్ళ అమ్మగారిని, "అమ్మా,

నువ్వు నాతో వస్తున్నావా, లేదా?" అని అడిగి గబ గబ మని గుమ్మం దాటుకుంటూ వెళ్ళిపోయాడు.

"కాస్తా ఆగు," అని వాళ్ళ అమ్మ బతిమాలింది. "నువ్వు వెళ్ళిపోయాక ఇంకా మేమెందుకు ఉండాలిరా నాయనా? మేం ఇక్కడ మరేం వెలగబెట్టాలి? ఒక నిమిషం ఆగు! మా మూటా మెల్లెలు ఇంట్లోపల ఉన్నాయి; నువ్వే జాగర్త పరచాలి."

"నా జన్మలో మళ్ళీ ఈ గడప దాటను!" అని రంకెలేస్తున్నాడు ఆ చిన్నవాడు. "అవేమో మీరే తెచ్చుకోండి, లేకపోతే ఇంట్లోనే వదిలేయండి. అప్పుడే ఇంకొకరితో పెళ్ళైందిని గుర్తు చేస్తూ అవి ఉండనీ!"

రాజం, అతను ఆ మాటలన్నీ నిజంగానే అన్నాడని మీరు నమ్మగలరా? అప్పటి మా పరిస్తితిని మీరు ఊహించగలరా? అతని కేకలతో మేం అప్పటికే గజగజాలాడిపోతున్నాం. కత్తివాటుకు నెత్తురు చచ్చిన పీనుగు ముఖాన్ని ముసుగేసుకొని ఒక గోడ మూల విచారంగా నిలబడే పార్వతిని నేను అకస్మాత్తుగా చూసాను. అతని మాటలు పదునైన ఈటెల్లా నా గుండెకు గుచ్చుకున్నాయి. "అయ్యో, ఏమంటునాడితను?" అని అంటూ నమ్మశక్యం కాని ఆ మాటలతో నిశ్చేష్టురాలై నేల జరిగిపోయాను.

"అయ్యో! అమ్మా!," అంటూ పార్వతి వేసిన కేక నా చెవుల్లో సూదిలా గుచ్చుకుంది. ఈ నాటిక్కూడా ఆమె నన్ను అమ్మా అనే పిలవడం నన్ను వెంటాడుతునే ఉంది. ఆ సమయంలో సహాయానికి అమ్మా అని కేక వెయ్యడం ఎమిటి? ఆమె అక్క నేనే కదా దీనంతటికీ కారణం? ఆమె అమ్మే ఉండి ఉంటే ఈ విషాదం జరిగి ఉండేదికాదని ఆమె భావిస్తుండ వచ్చునా? ఆ ఆలోచన బాధిస్తూంటుంది.

ఆమె రజస్వరాలైంది ఒక సోమవారం. ఆ శుభముహూర్తాన్న మన ఆచారంబట్టి ఆమె మూర్తీభవించిన, నమ్మతగినదానిగా, రూఢిగా ప్రపంచంలో ఉత్తమ గుణాలు కలిగి భవిష్యత్తులో రత్నంలాంటి పిల్లలకి తల్లిగా రూపొందిస్తుంది అని గర్వపడవచ్చు. కాని నేను అమె కన్యగా మారిన విషయం ప్రపంచానికి ప్రకటించిన సమయం బట్టి మన పంచాంగం ఆమెకు వైధవ్యం రాసిపెట్టి వుందనీ,

గోడ్రాలవుతుందనీ తెలియజేసింది. ఏం ఘోరం! ఇదంతా తెలివితక్కువతనం వల్ల, దూరదృష్టి లేకుండా చేసిన పనికి ఫలితంగా విధి పన్నిన కుట్ర.

ఎవరేం చెప్పినా వినే పరిస్థితిలో లేదు పార్వతి భర్త. మొట్టి పట్టుదలతో ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు. మరో ఏడాదివరకూ ఆయనలో ఎటువంటి మార్పూ మాకు కానరాలేదు.

రోజు రోజుకూ పార్వతి మనోవ్యాధితో శరీరం సృచించి పోయింది. ఏ ఆడదైనా ఎలా తట్టుకోగలదు అలాంటి పరిస్థితిని - పూర్తిగా తన భర్త భవిష్కరణ?

ఆమె ఒకనాడు తనకు తోచిన ఆలోచన నాకు చెప్పింది: "మా ఆయనకి శాస్త్రాలమీద పూర్తి విశ్వాసం. నిజంగా ఒక సోమవారం అనేక భవిష్యత్తు శుభ శూచనలతో నేను రజస్వలైన విషయం ఆయన తెలుసుకుంటే ఆయన ఎంత ఆనందించేవారో కదా? దానివలన మనకు కూడా సంతోషమే కదా?"

ఆమె మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. ఉన్నట్టుండి ఆమె చేసిన ప్రస్తావన నన్ను నిశ్చేష్టురాలురాలిని చేసింది; చాలా రోజులవరకూ ఆ మాటలు నా చెవిలో రింగురింగమంటూండేవి. "ఐతే మనం అబద్ధమాడేం, ఉన్న నిజం నీ భర్తకి తెలియజేసేద్దామా?"

"అలా చెయ్యొద్దు, అక్కా! మనం అబద్ధమాడేమని తెలుసుకుంటే ఆయన పిచ్చి ఎక్కువ కావచ్చు. సందార్భన్ని బట్టి మనం విషయాన్ని తికమకపరుస్తున్నామని అతను అనుకోవచ్చు. మా ఆయన ఏదైనా అనేడప్పుడుకాని, ఏ పనైనా చేసేడప్పుడు కాని ఒకటి రెండు సారులు గట్టిగా ఆలోచిస్తారనుకోను; ఆ రోజు ఆయన ఎంత మొండిగా, తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళన్న ధోరణిలో ఎలా ప్రవర్తించారో నీకు గుర్తుందా అక్కా? ఎప్పటికైనా ఆయనలో మార్పు రాక తప్పదు - మన ప్రమేయం లేకుండానే, నా అదృష్టమే కలిసివస్తే. ఒకవేళ నా దురదృష్టం వలన, మనం అబద్ధాలాడేవాళ్ళమని అనే అబిప్రాయమేకనుక అతని మనస్సులో ముద్రపడిపోతే, ఆయన ఎప్పటికీ మారకపోవచ్చు. అందువలన ఆ విషయాన్ని నా కర్మకి వదలిపెట్టేద్దాం. ఎలా జరగవరసింది అలా జరుగుతుంది."

ఆమె అభిప్రాయంలో పార్వతి ధృఢ సంకల్పంతో ఉంది. కాని నా మనస్సు ఊరికే ఆరాటపడిపోతోంది. ఆమె పరిస్థితి తీర్చిదిద్దడానికి ఏదో ఒకటి చెయ్యక తప్పదని అలొచించకుండా నేను ఉండలేకపోయాను.

పార్వతి భర్తకి  ఒక ఉత్తరం రాయమని మా ఆయనకి సూచించాను. పార్వతితో కొంతకాలం గడిపి ఆమె ఎటువంటిదో తెలుసుకునే ప్రయత్నం చేసి అప్పుడు ఆమె పట్ల తానొక అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవాలని ఆ ఉత్తరంలో ప్రాధేయ పూర్వంగా సూచించబడింది.  ఆమె భర్తకు పార్వతి ఒక అనుకూలవతి అన్న విషయాన్ని తెలుసుకోడానికి ఒక అవకాశం ఇవ్వమని కోరబడింది.

దానికి సమాధానం క్లుప్తంగా, తిరుగ టపాల్లో వచ్చేసింది.

"మీ పార్వతిని తెలుసుకునేందుకు నేనామెతో గడపడం అసంభవం," అని ఆమె భర్త బదులిచ్చాడు. "మన గ్రంధాలపట్ల నా అభిప్రాయం ఎప్పటకీ మారదు!"

ఈలోగా పార్వతిలో మాకు ఒక మార్పు కానవచ్చింది. జీవ శవంలా రొజులు దొర్లిస్తున్న అమెలో ఒక్క సారిగా చైతన్యం కాన వచ్చింది. చాలా చురుగ్గానూ, ఉత్సాహంగానూ కనబడింది. రోజు రోజుకీ ఆమె ఏదో కొత్త పనికి పూనుకున్నట్లు మాకు తోచింది.

ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టుగా కానవచ్చిన కళ చూసి నాకు చాలా సంతోషం కలిగింది. "పాపం, పార్వతిని చూడండి, తన విచారాన్ని దిగమింగుకొని ఎలా జీవితాన్ని కొనసాగిస్తుందో," అని అన్నాను మా ఆయనతో విచారంగా.

“ఎన్నేళ్ళని నా మీద జాలిపడగలను?” అని పార్వతి మా సంభాషణలో కల్పించుకొని అడిగింది. “నా జీవితాన్ని వృధా చేసుకోలేను. నేను బాగానే చదువుకున్నానుకదా? ఏదో మంచి ఉద్యోగం చేసుకొని జీవించాలి,”

“ఏమిటి నువ్వంటున్నావ్? నీ జీవితం నువ్వే పోషించుకోవాలా?నిన్ను చూసుకోడానికి  సంపద, డబ్బు మా దగ్గర లేదా? నువ్వేమంటున్నావో నాకు అర్థం కావడంలేదు. నా శరీరంలో ప్రాణం ఉండాలంటే ఈ ఇంట్లో నీ ఉనికి అవసరం. ఒకవేళ నీవేదైనా ఉద్యోగం చేసుకొని ఈ ఇంటినుండి వెళ్ళిపోయిన నాడే నీ అక్కని మరిచిపోవాలి! ఒకవేళ జీవితంలో చూసినాకూడా అదొక జీవ శవమే!” మాటలు మింగకుండా ఆమెను బెదరగొట్టేను.

పార్వతి నన్ను ఊరడించడానికి ప్రయత్నించింది. "అక్కా, అక్కా, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దుసుమా! నాకు నా జీవితం నిలబెట్టుకోవాలన్నదే నా మొదటి ఆశయం. కథలూ, వ్యాసాలూ రాయాలని ఉంది నాకు. నా తలలో బోలెడన్ని భావాలు పేరుకుబడి ఉన్నాయి. అవన్నీ బహిర్గతం చేస్తేనే నాకు మనశ్శాంతి కల్గుతుంది. రచన, ప్రసంగాల్లో పడిపోయాయనుకో, నా బాధలన్నీ మర్చిపోగలను."

"నీకు బాగుందనిపిస్తే అదే చెయ్యమ్మా. చిక్కూ, చింతా లేకుండా, నీ రచన, ప్రసంగాన్ని ఈ ఇంట్లో కొనసాగించడమే మేం కోరేది." ఆమె భవిష్యత్తు కార్యక్రమాలకి మా ఆదరణ ఉంటుందని రూఢిగా మాట ఇచ్చాను.

వెంటనే పార్వతి రచనా ప్రసంగాల్లో నిమగ్నమైపోయింది. ఆమె ఏం రాస్తుందో, ఎంత రాస్తుందో ఆమెకే తెలుసు. ఆ విషయంలో ఆమె మాకెప్పుడూ వివరాలు చెప్పేదికాదు; మేమూ అడగలేదు.

పార్వతికి బోలెడు టపా వస్తూండేది. మా ఇంటికి పోస్ట్ మెన్ అడుగుపెట్టగానే పార్వతి ఆయన్ని ముందుగా పలకరించేది; ఆమె పేర వచ్చిన ఉత్తరాలన్నీ ఆమె ఉంచుకునేది; తనకి ఉత్తరాలు వస్తున్నాయి అని మాత్రం మాకు చెప్పేది. ఇంకోసారి ఉత్సాహంగా "నా కథ స్వీకరించారు" అని ప్రకటించేది.

"ఎప్పుడు ప్రచురిస్తారంటావ్?"

"కొంత సమయం పడుతుంది; వెంటనే మాత్రం కాదు," అనేది. నేనెప్పుడైనా "నీ కథ మేం చదవకూడదా?" అని అడిగితే "నా కథలు ప్రచురణ కాకుండా, ముందుగా, ఎవరికీ చూపించను. పత్రికలో నా కలంపేరున ప్రచురిస్తారు. అప్పుడు మీరనుకున్నది నేను తెలుసుకోగలుగుతాను. మీకు ముందుగానే తెలిసిపోయిందనుకో, అది గొప్పగా ఉందనేస్తారు. అది ఎలాగున్నా సరే, నాకు నిజమైన అభిప్రాయం కావాలి!"

ఇలా దిగులు దిగమింగుకొని గడిపే పార్వతి జీవితంలో మరో ఏడాది గడిచిపోయింది. ఇలా ఉంటూంటగా ఒకనాడు హఠాత్తుగా స్వర్గంనుంచి ఊడిపడినట్టు పార్వతి భర్త దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది.

“ఏమాశ్చర్యం!” అని అనుకున్నాం మేమంతా; కాని అందులోని విషయం మమ్మల్ని ఇంకా ఆశ్చర్యంలో ముంచేసింది.

“పార్వతిని తీసుకురండి,” అని పొడి మూడే మాటలు కవరులో ఉన్న ఒక కాగితం మధ్య రాసివున్నాయి.

“ఏమిటీ హఠాత్తు మనస్సు మార్పు? ఇందులో పార్వతి ప్రమేయం ఏమైనా ఉందా?” అనే ఆలోచన నాలో మెరుపులు మెరిసింది.

“అమ్మా, పార్వతి. మీ ఆయనదగ్గరనుంచి ఒక ఉత్తరం!” అని ఆనందంతో, గట్టిగా అరిచాను.

“ఆ ఇంటికి నన్ను ఆహ్వానిస్తున్నట్టుందా?” అని సీదాసాదాగా చిరునవ్వుతో నా దగ్గరకి వస్తూ అడిగింది పార్వతి.

“అరే, అదెలా నీకు తెలుసమ్మా?” అని అడిగాను, ఆశ్చర్యంతో.

“గతవారం మా అత్తగారు రాసారు - అందుకే నాకు తెలుసు. తన కొడుకు మనసు మారవచ్చునని అందులో సూచించారు. అయితే ఇప్పుడు ఆవిడ అనుమానం నివృత్తి ఐందన్నమాట.”

“మీ అత్తగారు నీకు రాసారా? ఏమిటే, మేం వింత వింత కథలు వింటున్నాం!” నా ఓర్మి మాయమపుతుండగా “ఇక అన్ని వివరాలూ చెప్పవే, అమ్మా,” అని మందలించాను.

“నాకేమో పిసరంత ఆశ, మా అత్తగారు నా తరపున నిలబడతారని,” అని అంటూ పార్వతి ఆరంభించింది. “సర్వసాధారణంగా మగవాళ్ళు వాళ్ళ భార్యలపట్ల మొట్ఛమొదట్లోనే ప్రేమాభిమానాలు చూపిస్తే, సహజంగానే వాళ్ళ తల్లులు ఈర్షతో కోడళ్ళని చిత్రహింస చేస్తారు. కాని నా పరిస్థితి వేరు. నా భర్త నన్ను అసహ్యించుకున్నారు కాబట్టి మా అత్తగారుకూడా నన్ను ద్వేషించాలని ఉందా? ఆవిడకి నా మీద జాలి కలుగకూడదా? కొందరు అత్తగార్లు వాళ్ళ కొడుకుల పక్షం వహిస్తారు, కాని నా సంగతి వేరుగా?నా మొదటి ధ్యేయం మా అత్తగారికి ఆనకట్ట కావడమే.

నాకు కనిపించేదేమంటే ఏ అత్తగారైనా తన కోడలి దైవభక్తి, పట్టుదలపట్ల ఆకర్షపడతారు. సహజంగానే ఆమె కోడలి ప్రేమానురాగాన్ని ఆశీస్సుందనింపిచింది

నాకు. ఏదో దైవకృపవలన ఈ గొప్ప సత్యం నాకు తెలియవచ్చింది. ఇదో, నేననుకున్నది ఇప్పుడు నిజమైంది.

మా అత్తగారు నా మొదటి ఉత్తరానికి ఆనందకరమైన సమాధానం రాసారు. అది చాలా ఆలశ్యంగా, ఒక నెల తరువాత నాకు అందినాకూడా నేనెంతో సంతోషించాను. తరువాత నాలుగైదు ఉత్తరాల్లో నా పరిస్థితిపట్ల ఆవిడ సానుభూతి చూపించారుకాని తన కొడుకు ప్రవర్తన మార్చడానికి ఏ విధంగానైనా ప్రయత్నిస్తానని ఎక్కడా ప్రస్తావించలేదు. ఆ తరువాత ఆవిడ మరో రెండు ఉత్తరాలు రాసారు, అందులో తన తనయుడి ప్రవర్తన ఇలా వివరించారు: 'వాడు చాలా మొండి ఘటం, మరి మారడు!' ఇలా రోజులు దొర్లుతుండగా ఆవిడ ధోరణిలో మార్పు కానవచ్చింది. నన్ను ఆ కుటుంబంలోకి ఆహ్వానించే విషయాల్లో ఆయనమీద ఒత్తిడి చేస్తున్నట్టు కనిపించింది; ఆవిడ మరో విషయంకూడా, విచారంగా, ప్రస్తావించారు. ఎప్పుడైనా నాగురించిగానీ, నా పేరుగానీ ఉచ్చరిస్తే ఆయన మండిపడతారని తెలియజేసారు. ఆ పైన, మరి కొన్నాళ్ళు తరువాత, కారణం లేకుండానే చికాకుపడే మనస్తత్వంలో ఉన్న తన కొడుకులో కానవస్తున్న చిరు మార్పు - అంటే, ఏదైనా సంబాషణలో నా ప్రస్తావన వచ్చినప్పుడు అతనంట అతనే యధాలాపంగా నా పేరు ఉచ్చరిస్సున్నారని తెలియపరచారు. కాబట్టి మా ఆయనలో క్రమేపి హృదయపరివర్తనవచ్చి ఇప్పుడు నేను వాళ్ళ ఇంటికి రావాలని కోరుతున్నారు."

మేమంతా నోళ్ళు వెళ్ళబెట్టుకొని పార్వతి చెప్పేదంతా వింటున్నాం.

"పార్వతీ, నీకీ ఆలోచనా, తెలివితేటలూ ఎలా వచ్చాయమ్మా?" అని మా వారు అడిగారు.

"నీ ఉత్తరాలతోనే మీ అత్తగారిని ఆనకట్టుకున్నావంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉందమ్మా," అని నేనన్నాను. "ఇప్పుడు చెప్పు అసలు నీవేం రాసావో?"

అది ఆశ్చర్యమా, ఆనందమా, లేక గర్వమా ఇటువంటి సమయంలో మమ్మల్ని ఆకట్టుకున్నది? అది కేవలం గర్వం మాత్రమే!

"అక్కా, ఒక నిమిషం ఆగు! నా ఉత్తరాలకి, ప్రత్యుత్తరాలన్నింటికి, నకలు ఉంచేను. మా అత్తగారి ఉత్తరాలుకూడా ఉన్నాయి. ఉండు, నేను వెళ్ళి తీసుకొస్తాను," అని చెప్పి పార్వతి ఆ ఫైలుని తీసుకువచ్చింది.

తన మొట్టమొదటి ఉత్తరంలోనే పార్వతి ఇలా రాసింది: "నాకు నిజంగా మీవంటి అత్తగారు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. కాని ఏం లాభం? మీకు సేవ చేసి తత్ఫలితంగా మీ అప్యాయమైన ఆశీస్సులు పొందలేక పోయినందుకు విచారిస్తున్నాను."

మరో ఉత్తరంలో ఇలా రాసింది:

"ఏ అమ్మాయికైనా అప్యాయనురాగాలతో చూసుకునే భర్త లభించడం సహజమే. ఆ అప్యాయాన్ని అందించే అత్తగారు లభించడం ఆమె చేసుకున్న పూర్వజన్మ ఫలమే. నా పూర్వజన్మ ఋణంవలనే మీవంటి అత్తగారిని నేను పొందేను. కాని మీ బంగారు జీవితంలో నేను మీకు చెయ్యవలసిన సేవలూ, నేను మిమ్మల్ని పువ్వులో పెట్టి చూసుకునే భాగ్యమూ నాకు దక్కకుండా పోయింది.

నా చిన్నతనంలో అమ్మా అని పిలవడానికి ఎవ్వరూ లేరనే చింతతో కుమిలిపోయేదాన్ని. కాని నాకు పెళ్ళైన తరువాత అమ్మా అని నోరూర పిలుచుకోడానికి మీరున్నారని సంబరపడిపోయాను. ఈ ఉత్తరంలో మాత్రమే ఆ పిలుపుతో మిమ్మల్ని సంభోదిస్తున్నాను. స్వయంగా, ముఖాముఖిగా అమ్మా అని మిమ్మల్ని ఎప్పుడు పిలవగలనా అని నాకు తెలియదు."

"మీరు చూపే అప్యాయనురాగాలతోనే ప్రస్తుతానికి నేను తృప్తి పడుతున్నాను. మీ ప్రేమాశీర్వాదాలే నా దుస్థితిని మార్చగలవు అని నమ్ముతున్నాను," అని ఇంకో ఉత్తరంలో పార్వతి ప్రస్తావించింది.

"నా సమస్యపట్ల మీరు చూపే గాఢమైన అభిమానంవలనే ఎప్పటికైనా నా భర్త మనసు క్రమేపి మారే అవకాశం ఉంది. మీకు నా సేవలు స్వయంగా అందించి మీ ఆశీస్సులు పొందే రోజుకోసం ఎదురుచూస్తూ, ఎప్పటికైనా నా భవిష్యత్తు భారరహితంగా ఉండుందనే ఆశతో ఉన్నాను."

నా భావాలని ఆఖరికి మా అక్కతోగాని, బావగారితోగాని పంచుకోవడం నాకిష్టం లేదు. కాని మీతో పరివర్తన చేసుకోడం నాకు సంతోషంగా ఉంది."

ఈ విధంగా తను రాసిన ఉత్తరాల్లో పార్వతి తన అభిప్రాయాలని వివరించింది.

దాని ఫలితమే తన అత్తగారు తన పక్షం వహించి, తన కొడుకుతో నిరంతరం వాదించి, అతన్ని బతిమాలి, ఆయన తన మొండితనం విడిచేడట్లు చెయ్యగలిగింది."

నేను చెప్పేకథ సావధానంగా వింటున్న రాజం మధ్యలో నన్ను ఆపింది.

"అంటే పార్వతి భర్త పవిత్ర గ్రంధాలమీద తనకున్న నమ్మకం విడిచిపెట్టారన్నమాట!"

"అబ్బే, అలాగేంకాదు. తన భార్య ఒక శుభకరమైన సోమవారం రజస్వలయిందన్న యధార్థం బైటపడింది. పంచాంగం ప్రకారం ఆమె పరిశుద్ధాంత అని పేరు పొందింది. ఆ విషయాన్ని వారి నిత్యదిన వ్యవహారాల్లో పార్వతి పలికిన ప్రతీ పదం, ప్రతీ చర్య, యధార్థమే అన్న సంగతి వాళ్ళు ప్రత్యక్షంగా కనుగొంటున్నారు. ఆయనకి పార్వతిపై క్రమేపి ఆసక్తి కలిగి, ఇంత కాలం తరువాత అది తీవ్రమైంది."

ఈ సమయంలో ఆమె భర్త హృదయం పార్వతిని స్వీకరించే పరిపక్వం చెందలేదు. వాళ్ళమ్మగారు పదే పదే ఒత్తిడి చెయ్యడంవలన ఆయన తన తప్పు తెలుసుకోగలిగాడు. తన భార్య దైవభక్తి ఆరాధించే స్త్రీ అనే విషయం క్రమేపి తెలుసుకున్నప్పటికీ ఆమెపట్ల ఆయన సదభిప్రాయం పెంపొందించుకోలేదు. ఒక్కొక్కసారి ఆమెపట్ల అణుగుణమైన భావం కలిగినవెంటనే ఆయన మనసు 'అది నటిస్తోంది!' అనిపించి యధాస్తానం పొంది తధా కఠిన హృదయమైపోతుంది. ఐనాకూడా, అతని తల్లిగారి రేపగలు చివాట్లు భరించలేకపోతుంటే పార్వతిని తెలుసుకోడానికి తను ఆమెకి ఒక అవకాశం ఇవ్వాలనే అభ్యర్థం కూడా గుర్తుకి వచ్చింది. అందువలన తన అమ్మగారిని తృప్తి పరిచేందుకూ, తన భార్య దగ్గఱగా ఉంటే ఆమెను బాగా తెలుసుకోవచ్చు అనే భావంతో పార్వతిని తమ ఇంటికి ఆహ్వానించడం యోగ్యమైన విషయం అనే అభిప్రాయానికి అతను వచ్చాడు. "పార్వతి రానీ; అది నీకు నచ్చినట్టు సేవ చెయ్యనీ; నేనెటువంటి ఆటంకమూ కల్పించను!" అని చెప్పి అది పూర్తిగా పార్వతీకీ, ఆమె అత్తగారికీ మధ్య ఒక

ఒప్పందం అని ఆ ముసలావిడకి గుర్తు చేస్తూ, పళ్ళు బిగపెట్టిన ధోరణిలో, నీ కోడల్లా నువ్వు చూసుకో, నా తరం కాదు! వినబడిందా అని అన్నాడు. ఈ విషయాన్ని ఆ తల్లి పార్వతికి తెలియజేయగా, ఆమె ఇలా రాసింది: "మీ అబ్బాయి భార్యగా నాకు స్వాగతం లభించకపోయినాకూడా మీ కోసమే నాను రాదలచుకున్నాను." భర్త ఇంట్లోకి ఒకసారి అడుగుపెడితే ఆయన మనస్సు మార్చగలనని పార్వతి నమ్మకం.

పార్వతి భర్త ఇంటికి వెళ్లేముందు మా ఆయన చేతికి 1940, 1941, 1942 సంవత్సరాల తన సొంత డైరీలు ఇస్తూ, "మీరు నాకొక ఉపకారం చెయ్యాలి," అని అంది. "1940 డైరి కవరుమీద 'పార్వతి జీవితంలో ముఖ్య ఘట్టాలు - మే నుంచి ఆగస్టు వరకు' - అని రాయండి. అదేలాగ 1941, 1942 డైరీలమీద కూడాను. 1942 డైరీలో 'పార్వతి జీవితంలో ముఖ్య ఘట్టాలు - అక్టోబర్' అని రాయండి." ఈ మూడు డైరీల కవర్లమీద ఆమె కోరినట్టే మా ఆయన రాసినతరువాత పార్వతి వాటిని అందుకుంది. పార్వతి మా ఇంటిలోఅడుగుపెట్టిన నాటినుంచి ఈ రోజు వెళ్ళిపోతున్నంతవరకూ అన్ని విషయాలూ చాలా విపులంగా రాయడం అవసరం అని పార్వతి భావించింది.

వాటిని తన సూట్ కేసులో భద్రంగా పెట్టుకుంది. ఆమె మనస్సులో ఏదో ఆలోచన - భర్త మనసు మార్చేందుకు - అని మాకు తోచింది. అందువలన దానిగురించి మేం పట్టించుకోలేదు.

ఆ ఇంటిలో అడుగుపెట్టిన మొదటి రెండు మాసాలవరకూ పార్వతి భర్త మనసు మారలేదని మాకు వెంటనే తెలిసింది. పార్వతి తన అత్తగారి సేవలోనే తన కాలమంతా గడుపుతూ వచ్చింది; భవిష్యత్తులో తన సంతోషమంతా అత్తగారిమీదే ఆధారపడి ఉందని ఆమె నమ్ముకుంది. తన భర్త ప్రవర్తనలో ఎటువంటి మార్పూ రానందుకు ఒక వంక విచారిస్తూ, తన అత్తగారు తనపట్ల చూపించే అప్యానురాగాలతోనే ధైర్యం పుంజుకుంది. పార్వతి తన సహజమైన అణకువ, భక్తి శ్రద్ధలతో అత్తగారి మనసు జయించింది.

ఒక రోజు పార్వతి అలమారులో తలకి రాసుకున్న నూనె, దువ్వెన, తిలకం, మొదలైనవి ఉండే చోటుకి దగ్గఱగా భర్తకి కొట్టవచ్చినట్టు కనిపించేలాగ ఈ మూడు

డైరీలు పెట్టింది. భర్త తలకి రాసుకునేందుకు  నూనె తీసుకుంటూ ఒక డైరీని తీసి ఉత్సుకతో దానిమీద ఏం రాసున్నాదో చదివి అందులోని వివరాలు చదవనారంభించాడు.

మొట్టమొదట 1942 డైరీ తీసి 'ఏమిటో ఆమె జీవితంలో ముఖ్య ఘట్టాలు?' అని ఆశ్చర్యపోయాడు. 'ఆ కుటుంబంలో తగువుపడి 1941లో వాళ్ళనుంచి దూరమయ్యాను,' అని అనుకుంటూ పేదీలు తిరగేస్తూ అక్టోబర్ నెలలో ఏముందో చదివాడు. 20వ తేదీన పార్వతి ఇలా రాసింది: 'పార్వతి కధలు రాయడం మొదలుబెట్టింది. భగవంతుడు ఆమెకు మనశ్శాంతి కల్పించుకాక!' ఈ విషయాలు చదివి, చకితుడై, 1941 డైరీ పేజీలు తిరగవేస్తూ, మే నె 7వ తేదీ పేజీ చూసాడు. అందులో రాసివున్నది చదివాడు: 'పార్వతి జీవితంలో అతి శుభదినం. ఆమె పెళ్ళిరోజు'. తరువాత ఆగస్టు నెల 14 వ పేజీలో ఇలా చదివాడు. పార్వతి జీవితంలో దుర్దినమిది. ఆమె భర్త ఆమెను తృణీకరించాడు. సాంఘికంగా కాబోయే మచ్చనుండి కాపాడడానికి, సదుద్దేశంతో ఆమె బదులు మేం తీసుకున్న ఒక నిర్ణయం ఆమె జీవితంలో ఒక విషాద ఘట్టంలో ఆమెను పడేసింది. 1940లో ఆమె జీవితంలో సంభవించిన ఒక ముఖ్య ఘట్టాన్ని 1941లో జరిగినట్టు అబద్ధమాడిన ఫలితంగా తల్లిలేని ఒక అమాయిక బాలికని ఆమె భర్త తిరస్కరించాడు.' తను చదువుతున్నదేమో తన్నే ఆశ్చర్యంలో ముంచేస్తుంటే పార్వతి భర్త ఇప్పుడు 1940 డైరీ తీసి జూన్ నెల పేజీలో, సోమవారం 10 వ తేదీ ఇలా చదివాడు: 'ఈ రోజు పార్వతి దజస్వల అయింది. ఆమె జీవితంలో ఒక గొప్ప శుభదినం.' సంతోషసంభ్రమాశ్చర్యాలతో ఒక నిమిషం ఆలోచనలో పడి, డైరీని పడేసి, వరాండాలో అతను పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు. అది ఆశ్చర్యమా, ఆనందమా, కోపమా, లేక జాలియా? అల్లకల్లోలమైన మనస్సుని తనే నిర్ణయించులేక పోతున్నాడు.

ఆ రాత్రి యధావిధంగా భోజనాలు వడ్డించుతున్న సమయంలో వాళ్ళమ్మ మళ్ళీ తన పాత పల్లవి అందుకుంది: "నీ మనసెప్పుడు మారుతుందో నాకు తెలిసిరావటంలేదు నాయనా! ఈ ఇంటిలో నేను చేసే పనంటూ ఏమానా ఉందంటే అది నేను నీకు వడ్డన చెయ్యడం ఒకటే అనుకో. ఇక ఇంటి పనులు మొత్తంగా ఆ

పిచ్చిపిల్లే చేస్తోంది. నిజంగా ఆమె గురించి నువ్వు ఏమనుకుంటున్నావురా బాబు? అది ఈ ఇంటిలో కేవలం ఒక వంటగత్తె మాత్రమేనా? ఇంటి పనులు చెయ్యడంతప్ప దానికి ఈ ఇంటిలో వేరే హక్కూ అంటూ ఏమీ లేదా? నిన్ను పెళ్ళి చేసుకునేందుకు ఫలితంగా కేవలం ఈ బాధ్యతనే అది నిర్వహించాలా? హక్కులైతే ఉన్నాయికాని జీవితంలో ఆనందం ఎక్కడ? రాత్రీ, పగలూ బానిసగా పని చెయ్యడానికా అది జన్మించింది?"

కొడుకు సరిగ్గా ఆ సమయంకోసమే ఎదురుచూస్తున్నట్టుగా మాట్లాడడం మొదలుబెట్టాడు: "అమ్మా, నేనింక భరించలేను! నా జీవితం దుర్భరంగా చేస్తున్నావే అమ్మా! సంసార జీవితంలో నేను మునిగిపోవాలి, అదకదా నీ ఆశయం? అది నిజమేనా? అలాగైతే నీ సలహా పాటిస్తాను. పార్వతి ఈ రోజునుంచి నా భార్య, సరేనా?' పార్వతిని తన జీవితంలో ఆహ్వానిస్తూకూడా అతను చిన్న చిరుకోపం అభినయించాడు.

రాజం మళ్ళీ నన్ను అడ్డుకుంది; ఆమెకి ఇది బాగా హత్తుకుంది.

"పార్వతి భర్త మనసు మారిందని విని నాకు చాలా ఆనందంగా ఉంది. మరేం, పరవాలేదు. అబ్బాయి చక్కని, చిన్నవాడే అనచ్చు. ఆ దంపతులు ఒకరినొకరు అర్థం చేసుకొని సంతోషంగా జీవితం గడుపుతున్నారని వినడం మనసుకి ఎంతో ఇంపుగా ఉంది. అదేకదా మనం కోరుకునేది?" అని అంది.

"నీవన్నది నిజమే. వాళ్ళు చాలా సంతోషంగా జీవితం గడుపుతున్నారు. వెనకటికి మేం పడిన భారమంతా నేను మరిచిపోయాను. ఒకరోజు పార్వతిని అడిగాను: 'ఈ నిజం ఇక కొంచెం ముందుగానే చెప్పివుంటే ఎలా ఉండేదని? అప్పుడతను నిన్ను చేరదీసేవాడా?'

"'ఏమో, చెప్పలేం అక్కయ్యా!'" అంటూ పార్వతి మొదలుబెట్టింది. "మా ఆయన చాలా మొండిఘటమే కాకుండా మొదటి అహంభావి. మనమంటేనే మండిపోయే గుణం. అతను ఎన్నటికీ మన మాటలు నమ్మివుండేవారు కాదు. నాగురించి నిజమేమిటో ఆయన వాళ్ళింటిలోనే తెలుసుకోగలగడం ఒక విధంగా మంచిదే ఐంది. సరిగ్గా అదే సమయంలో ఆయన మెత్తబడడం ప్రారంభమైంది. మొండిగా ఉన్నప్పటికీ ఆయనలో అప్పటికే మనపట్ల మెత్తబడిన మార్పు

కనిపించినందువలనే నేను అత్తగారితో కలిసివుండాలని నిశ్చయించుకొని వెళ్ళడానికి కారణం. ఒకసారి నిజమేమిటో తెలుసుకున్న తరువాత అసలు విషయం మనం దాచిపెట్టినందుకు అతను కోపగించుకోలేదు. తొందరపడి నిజాన్ని మనం ఇంకా కొంచెం ముందుగా చెప్పకపోవడం మంచిదైంది. నేనది అప్పుడే గ్రహించాను. అందుకనే మనం ముందుగా చెప్పవద్దని నేను పట్టుపట్టేను. డైరీల ద్వారానే నిజమేమిటో తెలియాలని నేను భావించాను."

********

**(మూలం ప్రచురణ: కలైమగళ్, ఆగస్టు 15, 1947)**

# నిలువుటద్దం

కొన్నిరోజులముందు కిటికీ గాజు పలక ముక్కలయి నా మణికట్టుకి గాయం కలిగింది; కొన్నివారాలు బాధపడ్డాను. 'ఆహ్, ఇదే గాజు వేరే వేరే సమయాల్లో వేరే వేరే రూపాల్లో మనల్ని ఎలా ఆకర్షించుతోంది! మన మొహం చూసుకుంటాం, ఎన్నిరకాల గాజు పాత్రలూ, గిన్నెలూ రోజూ వాడుతున్నాం! మరి ఇప్పుడు పడుతున్న బాధగురించి ఏమనాలి?' అని ఆలోచించాను.

కాని ఆ అనుభవం తరువాత ఇంకొక అనుభవం ఏర్పడినప్పుడు నా మానసిక వ్యధని ఎలా వర్ణించడం?

అది మొహం చూసుకునే అద్దం కాదు. సమగ్రంగా మన ఆకారాన్ని చూపే నిలుపుటద్దం. అది నా స్నేహితురాలు జాను జీవితం గందరగోళం చేసిందని తెలిసినప్పుడు నేనెలా బాధపడ్డాను!

ఒకటి కాదు, రెండు కాదు; పెళ్ళయి, ఆరు సంవత్సరాలు కాపురం చేసిన తరువాత, మా ఆయనతో నేను నా పుట్టినిల్లు - తమిళ దేశంకి - వచ్చాను; పెళ్ళయిన తరువాత ఇక్కడకి రావడం ఇదే మొదటిసారి.

'మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో?' అని ఎవరిగురించి నేను చాలా సార్లు తపతపలాడానో - అదే జాను - నేను వెళ్ళిన ఆ సమయంలో తన పుట్టిల్లుకి వస్తుందని నేను ఏదురుచూడనేలేదు! ఆమె భర్తతో ఎక్కడ కాపురం చేస్తోంది, ఎలావుంది, అనే వివరాలేవీ నాకు తెలియవు.

'జాను కూడా ఈ ఊరులో ఉంది!'

వినగానే అమెను చూడాలని పరుగెత్తుకొని వెళ్ళాను; చూడగానే "జానూ!" అని సంతోషంతో అరిచాను.

"ఓ, సుశీ! . . . రా!" అని జానూ స్వాగతం చెప్పింది. అందులో సానుభూతి, మర్యాద కనిపించినా, ఉన్నచోటునుంచే ఎటువంటి ఉత్సాహమూ లేకుండా ఆమె పిలిచిన ధోరణి చూసి నాకెలాగో అనిపించింది.

ఇది జానువా? నేను నమ్మలేకున్నాను! ఆమెలో నిత్యమూ కనిపించే చురుకుదనం ఏమైంది? ఇన్ని సంవత్సరాల తరువాత నన్ను చూస్తోంది, ఎందుకు ఆమె ఇలా మొహం మకమకలాడుతోంది? మొహంలో కాంతిలేదంటే మనసులో ఏదో ఆందోళన ఉండి తీరాలని ఊహించుకున్నాను.

ఒక క్షణం నాకలాగే తోచింది. కాని సర్దకుని "అవును, నేనే! నిన్ను చూడాలని వచ్చేసాను! అబ్బా, ఎంతకాలమైంది మనం కలుసుకొని!" అని ఆవేశంతో అన్నాను.

"అవును!" అని జానూ నిదానంగా నాతో ఏకీభవించింది. తరువాత రెప్పవాల్చకుండా "ఆరేడు సంవత్సరాలు గడచిపోయాయి!" అని అంది.

ఆ తరువాతనే మా సంభాషణ ఆరంభమైంది. జానూ నిదానంగా నన్ను చాలా ప్రశ్నలడిగింది. కాని ఆమె హృదయంలో సంతోషం లేదు, మాటల్లో సారం లేదు. ఆకులులేని చెట్టులాగ కనపించింది. 'నువ్వెందుకు ఇలాగున్నావ్?' అని ఆమెని అడగాలని నేను బాధ పడ్డాను, కాని జంకాను; నాకు ధైర్యం రాలేదు.

ఆఖరికి నేను చెప్పవలసినవన్నీ వివరించిన తరువాత నేను అడిగితెలుసుకోడానికి బాకీ ఉన్నాయని గుర్తించడంతో నాకూ ధైర్యం వచ్చేసింది; అడిగేసాను.

జానూ ఏమీ దాచలేదు. మనసు విప్పి మాటాడింది. అందువలన ఆమె మనసులో కొంచెం భారం తగ్గిందేమో ఎవరికి తెలుసు? ఆమె ఉన్న పరిస్థితిలో ఆమె మనోవ్యధ ఓదార్చడమంటే ఎవరికి సాధ్యం?

నన్ను కలుసుకోడంలో తనకి చాలా సంతోషమని జానూ చెప్పింది. కాని "సుశీ, మనం ఇటువంటి సమయంలోనే కలుసుకోవాలా?" అని బాధపడింది.

"నీలాగే నేనూ పుట్టిల్లుకి వచ్చి మనమిద్దరం కలుసుకుంటే ఎంత బాగున్ను? అదొక అదృష్టంగా, దేవుని వరప్రసాదంగా మనం ఆనందిస్తాం. కాని నేనిప్పుడు పుట్టిల్లులో

శాశ్వతంగా నిలిచిపోయాను. నన్ను కలుసుకోడంలో ఏమైనా విశేషం ఉందా చెప్పు? నీకు బాధ, నాకూ అవమానం!" అని వాపోయింది.

"జానూ, అసలు ఏమైందో చెప్పు!" అని ఆమెను పురికొల్పాను.

"అతను నన్ను భార్య అనే స్థానంలో నిలుపుకున్నారు. అంతవరకూ నేను అదృష్టవంతురాలే. కాని ఈ విశాల ప్రపంచంలో ఎంత చిన్న జాగాలోనైనా సరే మేం దంపతులుగా కలిసివుండక అతనొక మూలా, నేనొక మూలా అని ఉంటున్నాం!" అని అంటూ జానూ కళ్ళు తడబెట్టుకుంది.

"అంటే . . . అతనేదో యుద్ధంలో కలుపుకొని తిరిగిరాలేదా? . . . లేకపోతే, జానూ . . ."

"సుశీ, నీకు నిజంగానే బోధపడలేదా, లేక నన్ను అడగడానికి మోమాటపడుతున్నావా? ఇక అతనితో జీవించే భాగ్యం నాకు లేదు! అతను నన్ను త్యజించారు; ఇది నాకు ఆరు మాసాలముందే తెలిసింది, కాని అది యుగయుగాలుగా అనిపిస్తోంది. నువ్వూ, నేనూ ఇన్ని సంవత్సరాలు కలుసుకోలేదు, కాని అదేమో పెద్ద ఎడబాటుగా అనిపించడం లేదు. నేనూ అతనూ అన్యోన్యంగానే కాపురం చేసాం; నా గతి ఇలా అవడానికి మా మధ్య ఏ పెద్ద సణుగులూ లేవు. అందుకే నేను భరించలేకున్నాను!" అని జానూ ఏడ్చింది.

"ఎందుకి నీకీ శిక్ష అనికూడ నీకు తెలియదా? అతనూ చెప్పలేదా? . . . జానూ, అందుకేనా ఈ బాధ?"

"తెలుసు . . . కొంచెం . . . అదే కారణమనుకుంటాను . . ." అని అంటూ జానూ మళ్ళీ ఒకసారి వెక్కుతూ ఏడ్చింది.

"తెలుసా? కొంచెం తెలుసా? అదేదో చెప్పు, వింటాను."

"నీకు తప్పకుండా చెప్పాలి. సుశీ, నువ్వే చెప్పు, ఎవరు తప్పు చేసారు, అది ఎటువంటి తప్పు అని. నన్నడిగితే నాకు చిన్నప్పటినుంచి అద్దం అంటే పిచ్చి. అదే కారణమని అంటాను."

“అద్దం పిచ్చా?” నేను అదిరిపోయాను.

“అవును.” జానూ నాకు అసలు సంగతేమిటో విపులంగా చెప్పేసింది.

కాలం చేసిన కుట్రవలన జానూ జీవితం ధ్వంసమైంది. ఆమెకి నిలువుటద్దం అంటే చాలా ఇష్టం. ఆ వ్యామోహం జానూ కుటుంబంలో ఒక అపనిందలాగ రేకెత్తించడంవలనే ఆఖరికి అది ఆమె సంసారంకి మంగళం చెప్పింది.

మేం స్కూల్లో చదువుకున్న రోజుల్లో . . .

ఒకరోజు జరిగిన ఆ ఘటన . . . అదీ ఒక అద్దం గురించే . . .

మేం, ఐదారుగురు పిల్లలం, స్కూలు వసారాలో హడావిడిగా మాటాడుకుంటున్నాం.

‘గోమతి అనే పిల్ల ఆశతో కళ్ళద్దాలు తొడుక్కుని కళ్ళు చెడగొట్టుకుంది!’ అని విన్నతరువాత మా సంభాషణ సాగింది. అందువలనేకాబోలు జానూకి ఈ గతి ఏర్పడింది!

“నాకు కళ్ళద్దాలంటే ఏ ఆశా లేదు! మొహం చూసుకునే అద్దమే ఇష్టం! బాల్యంనుంచే అద్దంముందు నిలబడి గంటలకొలదీ మొహం చూసుకోడమంటే నాకు విసుగు పుట్టదు! మా మామయ్య ఇంటిలో రెండు నిలువుటద్దాలున్నాయి; అందువలనే ఆ అలవాటు వచ్చిందనుకుంటాను; ఇప్పుడు అదొక పిచ్చిగా నన్ను పట్టుకుంది. రెండు నిలువుటద్దాంలని - ఒకటికి ఎదుటగా ఇంకొకటి అమర్చి వాటి మధ్య మనం నిలబడితే - లేక ఏదైనా వస్తువును పెట్టి చూస్తే - ఎన్ని ఆకారాలు కనబడతాయో తెలుసా? చూడడానికి బలేజోరుగా ఉంటుంది!” అంది జాను.

“ఓహో, అలాగా? మీ ఇంట్లో నిన్ను అద్దంముందు నిల్చోబెట్టి అన్ని ఆటలూ నేర్పించారన్నమాట! బాగుంది! నీకు తెలుసా? ‘అద్దంముందు బిడ్డలని నిలిపితే, వాళ్ళకి మాటలు రావు’ అని అనేవారు. కాని నువ్వేమో ఇప్పుడే ఒక వాగుడుకాయగా తయారయ్యావ్. అద్దం ముందు నిలబడకపోతే మరెలాగ కనిపిస్తావో?” అని నేను ఎగతాళి చేసాను.

పక్కనే ఉన్న సుధా “అవును! ఇప్పుడు జానూ నోరు మూయగానే మనకి వర్షం కురిసి ఆగినట్టుంది. అప్పుడు గాలివాన వచ్చి ధ్వంసం చేసినట్టు ఉంటుంది!” అని అనగానే మేమందరం - జానూతో సహా - నవ్వేసాం.

జానూకి అద్దమంటే పిచ్చి అని తెలుసుకున్నతరువాత మేం ఆమెను అభినందించే విధంగా “నీకు నీ పెళ్ళిలో ఒక జత నిలువుటద్దాలు బహుమానంగా రావాలని మా ఆశ! నువ్వూ, మీ ఆయనా ఆ రెండు అద్దాలమధ్య నిలబడి, ‘మనలాగ ఎంతమంది దంపతులు ఉన్నారు!’ అని గుర్తు చేసుకొని సంతోషించాలి, గర్వపడాలి!” అని దీవించాం.

ఆ రోజు మేం సరదాగా మాటాడుకున్న అద్దం పిచ్చితనం ఒక సుపరిచితమైన దర్పణంలాగ. ఇప్పుడో? అది పలరకాల భూతాల రూపాలు చూపి మనకే, భయమూ, జుగుప్స నొక్కి చెప్పే ఒక వింత అద్దంలాక కనపిస్తోంది!

ఆమె దాంపత్యంలో ఆ అద్దం పిచ్చివలన ఏర్పడిన సమస్య ఎంత భయంకరమైనదని ఇప్పుడేకదా నాకు బోధపడింది? అవును మరి; నేను ఆశ్చర్యపడకుండా ఎలా ఉండగలను?

ఆ తరువాత . . . జానుకి సంసారం ఆరంభమైంది . . .

‘నేను కోరినవన్నీ నా భర్త కొని తెస్తారు; కావలసినవన్నీ నాన్నగారు ఇవ్వడమైంది” అని జానూ తన్ను ఓదార్చుకొని అత్తవారింటికి వెళ్ళింది.

పెళ్ళయి, అత్తవారింటికి వెళ్ళినప్పుడు తనకి తప్పకుండా నిలువుటద్దం బహుమానంగా దొరుకుతుందని జానూ నమ్మింది, కాని అది సఫలమవలేదు. అసలు వియ్యంకులు ఎదురుచూసిన మౌలిక పెళ్ళి కానుకలు ఇవ్వడానికే ఆమె తండ్రి – అతను ఆ సమయం అనారోగ్యంతో బాధపడుతున్నారు - శ్రమ పడ్డారట. నిలువుటద్దం కొనడం జరగలేదు; జానూ మరేం అనక ఊరుకుంది.

భర్తకి చెన్నపట్ణంలో ఉద్యోగం దొరికి కాపురం ఆరంభించి, స్వేచ్ఛగా రోజులు సాగుతున్నప్పుడే ఆ నిలువుటద్దం మోహం అప్పుడప్పుడు లేచి జాను మనసుని అల్లరి చేసిందట.

ఏదో Exhibition లో దాన్ని చూసిందట. నివ్వెరపోయి అక్కడే భర్తకి దాని గురించి చెప్పిందట. ఇంటికి వచ్చిన తరువాత అది తనకి కావాలని చెప్పింది. ఆ రాత్రంతా ఆమె మనసంతా ఆ నిలువుటద్దం గురించే.

మనిషి ఎత్తుకి తగినట్టుగా తళతళలాడే అద్దం. దానితోబాటు, అద్దంకి ముందు అలంకార వస్తువులు, దుస్తులు సవరించడానికి అరలు; రెండు పక్కలా ఉన్న గొట్టాల్లో పుష్పాలని ఒక గుత్తిగా అలంకరించవచ్చు; కావాలంటే ఒక పక్క పుష్ప గుచ్ఛం, ఇంకొక పక్క పెళ్ళి ఫోటో అని సింగారించవచ్చు. అద్దం ముందు కూర్చోడానికి ఒక ముక్కాలి పీట. తను అద్దంముందు ఆ పీటమీద కూర్చుంటే సినిమాలో చూసే రాజకుమార్తెని మించినట్టే అని జాను ఆహ్లాదపడింది.

మరుదినం భర్తకి తన అభిలాష చెప్పింది. అతను “డబ్బు కావాలిగా? రెండు వందలు!” అని అన్నారు.

జాను “నేను పెళ్ళి పుట్టిల్లులో రెండు మూడు మాసాలు ఉంటాను. ఆలోపల మనం రెండువందలు కూడబెట్టవచ్చుకదా!” అని సలహా ఇచ్చింది.

తన ఆకాంక్ష ఎంత తీవ్రంగా ఉందని తెలియజేయాలని జాను అలా చెప్పింది; ఆమె కోరిక నిరవేరింది! భర్త చురుగ్గా ఆమెని ఒక చూపు చూసాడట. ఆ మొహంలో ఆమె మనసులో ఉన్న ఆసక్తి అతనికి బోధపడింది; నిలువుటద్దంకి ఆర్డరు ఇచ్చేసాడు.

నిలువుటద్దం స్థిరపఱచడానికి ఇంటిలో తగిన జాగా ఎక్కడ అని జానూ ఆలోచనలో పడింది. “నువ్వేం ఈ ఇల్లు కూలగొట్టి మళ్ళీ కట్టాలంటున్నావా?” అని అతను ఎగతాళి చేసాడట.

నిలువుటద్దం వచ్చింది; విభిన్న భాగాలతో వచ్చినదాన్ని సమకూర్చి జాను ముందు హాలులో అలంకరించింది.

“రెండువందలు ఖర్చుబెట్టినా చూడడానికి ఎంత చోద్యంగా ఉంది! ఇంటికి ఇదొకటి చాలు! మరేం సామాను వద్దు!” అని జానూ భర్తకి చెప్పింది.

"ఓ, అలాగా?" అని మాత్రం అతను అన్నాడట. జాను నిలువుటద్దం సింగారించినప్పుడుకూడా అతనేం అనలేదట.

బాల్యంలో ఆరంభించి, ఆ తరువాత మరుగైన మోహం - అద్దం పిచ్చితనం - జానుకి ఇప్పుడు మళ్ళీ తిరిగి వచ్చేసింది; పాత పసితనం ఆమెను ఆవరించేసింది. ఆ నిలువుటద్దం గురించే భర్త ఆమెని పరిహసించడం అలవాటైపోయింది. పిలిచినవెంటనే భార్య రాలేదంటే, లేక ఏదైనా పనిలో ఉంటే అతను " ఓ, ఇంత సేపూ రాణీగారు అద్దం ముందు నిలబడి ఉన్నారా?" అని అడిగేవారట.

జానూ కూడా "అవును, నాకెప్పుడూ అద్దంలో మొహం చూసుకోవాలని ఆశ. మా ఊరులో ఎవరినైనా అడగండి. కొత్త అద్దం అంటే రెండు మూడు సార్లు చూసుకోవాలనిపిస్తుంది!" అని నవ్వుతూ చెప్పేది. కాని క్రమేణ భర్త పరిహాసం నిష్టూరంగా మారుతూ వచ్చింది; ఇంతవరకూ చిరచిరలాడని భర్త గభీమని క్రూరంగా ఆమెని విమర్శించడం మొదలుబెట్టాడు.

"ఓ, అలాగా? అంటే ఇంటిలో ఎన్ని నిలువటద్దాలున్నాయో అంత గొప్ప అన్న మాట! అదా నీ ఉద్దేశం? దానికి నరకం అని పేరు! నిత్యమూ తనగురించే గుర్తుచేసుకోడం, మరెవరి తలపూ లేకుండా ఎక్కడ అద్దం కనిపించినా మొహం చూపాలని దూకడం - ఇవన్నీ మంచి గుణాలు, స్వర్గం అంటున్నావా? 'ఎక్కడ స్వార్థ్యం లేదో అదే స్వర్గం!' అని పెద్దలు మనకి చెప్పారు. నువ్వు చెప్పేది దానికి విరుద్ధం! నీకేం మతిపోయిందా?" అని కేకలు పెట్టాడు.

"ఇతరులు నీ అందాన్ని పొగడాలి, మెచ్చుకోవాలి, అదే నీకు కావాలి! నీ అందం నువ్వే చూసుకొని గర్వపడు! సౌందర్యవతి అంటే నువ్వే!" అని ఇంకొకసారి ఆమెను ఎత్తిపొడిచాడు.

ఒకరాత్రి జాను భర్తకి పాలు ఇవ్వడానికి వచ్చేటప్పుడు దారిలోవున్న అద్దంలో ఒకసారి మొహం చూసుకుంది. "రాత్రివేళ అద్దంలో మొహం చూసుకుంటే స్త్రీలు

ఏమౌతారో తెలుసా? ఇప్పుడు నీలో కనిపించే తళుకూ, బెళుకూ, వాళ్ళని పట్టుకుంటుంది!" అని మండిపడ్డాడట.

అతని వెటకారంకి భయపడి జాను జాగ్రత్తగా మెలగడం ఆరంభించింది. అద్దం ఎదుట నిలబడి చాలా సమయం జుత్తుని తీర్చిదిద్దుకొని, పువ్వు అలంకరించుకోడం ఆపుకుంది; అద్దంలో పదే పదే మొహం చూసుకోడం తగ్గించుకుంది. కాని భర్త ఎత్తిపొడుపులు, సయ్యాటలు తగ్గలేదు. "ఐయ్యో, ఇతనెందుకిలా నన్ను తప్పుపెడుతున్నారు! అసలు ముందు నాలోవున్న అద్దం పిచ్చితనం ఇప్పుడు లేదే? మరెందుకు నాకీ నింద?" అని జానూ వాపోయింది.

ఒక రోజు జాను భర్త ఆమెని పిలిచి "మీ మేనమామ కొడుకు పెళ్ళికి వెళ్ళి రా!" అని అన్నాడు. భార్యని బలవంతంగా ఊరుకి పంపించేయాలని అతని ఉపాయం.

'వెళ్ళివస్తే ఇప్పుడు నేను పడే బాధ తగ్గుతుందేమో?' అనే ఆశతో జాను వెంటనే సరేనంది.

అదేం ముహూర్తమో? ఆ తరువాత జాను భర్తని కలుసుకోలేదు.

"నువ్వంటేనే నీకు గొప్ప. ఇక నీ సంబంధం నాకు వద్దు!" అని ఒక ఉత్తరంతో భర్త ఆమెను తిరస్కరించాడు. పుట్టిల్లుకి వచ్చిన నాలుగురోజుల్లో అది ఆమెను తరుముతూ వచ్చింది.

"నాకు మీరంటేనే గొప్ప. మీరే నాకు కావాలి!" అని జాను అతన్ని బతిమాలింది. నాలుగైదు ఉత్తరాలు రాసింది; కాని ఏ జవాబు లేదు.

ఆ తరువాత "అతను ఉద్యోగం రాజీనామా చేసి వెళ్ళిపోయారు!" అని సహోద్యోగులూ, మరెవరో చెప్పారట.

"మాకూ ఏమీ తెలియదే?" అని జాను మెట్టినిల్లునుంచి కబురు వచ్చింది.

** ** **

"సుశీ, నువ్వే చెప్పు. ఇదెవరి తప్పు? నా బతుకు ఎందుకిలా తలకిందులైంది?"

నేనూ ఆలోచించాను. 'ఆమె భర్త - ఇదేం మనిషి! చాలారోజులు మెలగినతరువాత ఒక అల్పకారణంవలన భార్యని ఎలా త్యజించారు!' అని విస్తుపోయాను.

“సరే, ఆ నిలువుటద్దం, ఇంటి సామానులు ఏమయ్యాయి?” అని అడిగాను.

“ఆ అయోమయం గురించి ఏం చెప్పను!” అని జాను విసుగ్గుంది.

“నేను పుట్టిల్లుకి వచ్చిన ఒక వారంలోనే ఆ ఉత్తరం, ఇంకొక వారంలో నిలువుటద్దం, కొన్ని సామానులు వచ్చేసాయి. కొన్ని సామానులు మెట్టినిల్లుకి వచ్చాయట. అతనెక్కడికి వెళ్ళారని తెలియలేదు. సుశీ, నువ్వే చెప్పు! నన్ను మాత్రం కాదు, అతను తన తల్లిదండ్రులని ఎందుకు త్యజించాలి? అతనికి ఉద్యోగంలోకూడా ఎటువంటి చిక్కూ, అసంతృప్తి ఉన్నట్టు కనిపించలేదు . . . ”

“అదేంటో నాకూ వింతగా ఉంది . . . సరే, ఆ నిలువుటద్దం ఎక్కడ? నాకది చూడాలని ఉంది . . . ”

“దాన్ని అమ్మేసాను. ఇంకా నాకెందుకు అది? అది నాకు శత్రువుగా వచ్చి నా కొంప ముంచేసింది. అది నాకు వద్దు! పొద్దున్నే లేచి అద్దంలో మొహం చూసుకుంటే శుభం అంటారు. కాని, సుశీ, నాకు వచ్చిన దుర్దశ చూసావా? దాన్ని అమ్మేసాను, అదే నాకు విమోచనం!” అని విరక్తిగా ముగించింది.

“జానూ, ఎప్పుడు అమ్మావ్ దాన్ని? దానివలనే నీకు దురదృష్టం అంటే, అది పోయిన తరువాత, నీ కష్టాలు తొలగివుండాలే?”

“సుశీ, నాకూ అలాగే అనిపించింది - ఏ మార్పూ కనిపించలేదే అని. కాని ఆ నిలువుటద్దం లేదని నాకు బాధగా లేదు. అది నాకు వద్దేవద్దు!” అని దృఢంగా జాను ఆ నిలువుటద్దంమీదున్న తన ద్వేషం తెలియజేసింది.

ఆమె నిరుత్సాహం నాకు బోధపడింది. ఆమెలో కనిపించే విరక్తి, మనోవ్యధ ఎందువలన అని నేను ఊహించకలిగాను.

అంతేకాదు. దానితోబాటు నాలో ఉన్న ఇంకొక అనుమానంకి జవాబు దొరికింది.

‘జాను ఇలాగ ఉంది’ అని అమ్మ చెప్పకుండా “జానుకూడ ఇక్కడ ఉంది” అని ఎందుకు నాకు చెప్పాలి?

“‘ఎక్కడో ఉత్తరదేశంలో అల్లుడిగారికి ఉద్యోగం. ఇల్లేం సరిగా దొరకలేదు!’ అని అమ్మ అందరికీ చెప్తోంది; నేనూ, అమ్మా - ఇద్దరే ఉన్నాం. అందువలన నిజమేమిటే మరెవరికి తెలియదు!” అని జాను నాకు చెప్పింది.

“అమ్మతృప్తి కోసం నేనూ మరేం అనక ఈ కటువు మింగాను. కాని ఇది నాకు పెద్ద భారంగానే ఉంది” అని జాను ఒప్పుకుంది.

సాధారణ గాజు పలక చూడడానికి బాగానే ఉంటుంది. దానికి పాదరసం కలిపితే దాని ఘనత, ప్రతిష్ఠ ఇంకా బాగా మెరుగుపడుతాయి. కాని, ఆ తరువాత ఆ పూత ఉండీ ఉండవట్టు మాసిపోతే దాని గతి ఏమని వర్ణించడం? భర్త ఉన్నా జాను అనుభవించే గ్రహచారం అలాగేకదా?

జాను దగ్గఱ సెలవు పుచ్చుకున్నప్పుడు నేను చాలా బాధపడ్డాను. ఆ తరువాత, పదిరోజులై, ఆమె దగ్గఱా, ఆమె తల్లిదండ్రులు, ఇతరుల దగ్గఱా మళ్ళీ సెలవు పుచ్చుకున్నప్పుడు - ఎందుకో - నా మనసు కుదుటబడింది.

అవును మరి. మేం కాపురమున్న ఊరికి వెళ్ళి, మళ్ళీ సంసారం చేస్తాం అనే ఆతురతే కారణం! నాకు సందేహమే లేదు!

ఊరుకి వచ్చేటప్పుడు నా స్నేహితురాలు పడతున్న బాధ గురించి మా ఆయనకి చెప్పాను.

ఈ పదిరోజుల్లోనే నేనెప్పుడు తిరిగి ఊరుకి వెళ్తానని నాకనిపించిందే! మరి జానుకి ఎలా ఉంటుంది!

ఆ ఆలోచనతోనే జాను కథని మావారికి మనస్సు కరిగేటట్టు, వివరంగా చెప్పాను.

“ఎవరో దయలేని మనిషిలాగున్నాడు . . . అల్ప విషయాన్ని పెద్దదిగా చేసే బుద్ధి! ఆ మహానుభావుడి పేరు తెలుసా?” అని అతను నన్నడిగారు.

“ఐయ్యో!” అని అన్నాను నేను. ఆ మహానుభావుడి పేరు నేను అడిగి తెలుసుకోలేదు; ఇప్పుడు అదొక పెద్ద నేరంగా నాకనిపించింది. నా పుట్టిల్లులోనే ఇతను ఈ ప్రశ్న అడిగివుంటే, నేను జానుని అడిగివుంటాను. కాని అక్కడ దీనిగురించి

ఎవరికీ ఏమీ తెలియవద్దని నా ఉద్దేశం. నా మంచిమనసు గురించి ఇప్పుడు బాధ పడ్డాను.

"ఆహ్వాన పత్రికలో రామన్ అన్నపేరు చూసినట్టు గుర్తుంది. ఎవరికి తెలుసు? జానకిరామన్, కళ్యాణరామన్, పట్టాభిరామన్ - ఇలాగ ఎందరో రామన్లు - ఉన్నారు!"

"సాపాట్టు రామన్!"[1] అన్నారు అతను.

నాకూ నవ్వొచ్చినా, కోపంతో, "బాగుంది మీ వేళాకోళం!" అని చిరచిరలాడాను.

నేను చిరచిరలాడినా, నా కోపంలో బలం లేదని అతను గ్రహించారు. కాని బలం ఉన్నట్టు నాకు తెలియజేయాలని ఒక పని చేసారు.

మేం ఊరుచేరుకున్న ఒక వారంలో ఒక వార్త తీసుకొని వచ్చారు.

"ఈ బాలు ఉన్నాడే - వాడికి మర్యాద, సభ్యత, ఏమీ తెలియవు! Useless fellow!" అని అన్నారు దుస్తులు మార్చుకుంటూ.

బాలు మా ఆయన ఆఫీసు స్నేహితుడు. మాలాగే అతనికీ ఉత్తరదేశంలో, ఉద్యోగం, ఇలిలూ, వాకిలీ ఉంది.

'సరే, అతను చెప్పనీ' అని నేను వింటున్నాను.

"ఇవాళ ఆఫీసులో ఒకతన్ని బాలూ హింసపెట్టాలని తీసుకొనివచ్చాడు. అతనేమో ఒక నెలకిపైగా ఏదో నెపంమీద రాను, రాను అని చెప్పినా వీడు బలవంతంగా అతన్ని ఊడ్చుకొని వచ్చేసాడు. అలాగే కానీ, దానితో ఊరుకుంటే సరిపోను! అతన్ని ఇవాళ బాగా ఏడిపించాడు!" అని అన్నారు.

"ఏం, ఎందుకా పెంకెతనం? అతను ఎవరు?" అని అడిగాను.

"అతను ఇక్కడ ఏదో ఒక మోటారు కంపెనీలో మూడుమాసాలుగా పని చేస్తున్నారు. ఒక నెలముందు బాలుతో పరిచయం అయిందట. అప్పటినుంచే బాలు క్లబ్బుకి పిలిస్తే అతను రాలేదు. కొన్నిరోజులముందు "ఏమండీ, మీకు ఇల్లు ఉందికదా, మీ ఆవిడని పిలిచి కాపురం ఆరంభించవచ్చుకదా?" అని బాలు

[1] తమిళంలో దీనికి అర్థం: తిండిపోతు.

అన్నప్పుడు అతను ఒక జడ్డినవ్వు నవ్వి "ఊహూమ్ . . . అదేం వద్దు" అని గొణిగారట. "ఇల్లు దొరికితే భార్యని పిలవాలి, వస్తుంది" అని అన్న మనిషి ఇప్పుడిలా తికమకలు పడడంచూసి బాలుకి అనుమానం కలిగింది. అందుకే ఇవాళ అతన్ని క్లబ్బుకి ఈడ్చుకొనివచ్చి అతని పరువు తీసేసాడు! నాకు అతన్ని చూస్తే 'పాపం!' అనిపించింది" అని అన్నారు మావారు.

"అతను పేరు తెలుసా? మీకెందుకు అతన్ని చూస్తే అలా అనిపించింది?" అని నేను ఆతురతతో అడిగాను.

"మనిషి సాధువుగా కనిపించాడు; నిత్యమూ ఏదో దిగిలూ, హడలూ కప్పుకున్నట్టు ధోరణి . . . అందువలనే మొహం మొద్దుగా కనిపిస్తోంది."

"అతని పేరు తెలుసా?"

"ఊహూమ్, తెలీదు. ఇంతకీ నేను అతనితో మాటాడలేదు . . . " ఇప్పుడు అతను చమత్కారంగా తన చూపు నామీద విసిరారు. "నువ్వేమో ఇతను ఆ రామన్ అని అనుకుంటున్నావు కాబోలు! అతన్నిచూస్తే తిండిపోతుగా కనిపించలేదు. బాగా బక్కచిక్కిన దేహం. ఊదితే వెంటనే గాలిలో ఎగిరిపోతాడు!" అన్నారు.

"మీరు ఏమేమో చెప్తున్నారు. నాకూ ఎన్నో ఆలోచనలు, కాని ఏం లాభం? నేనింట్లో ఒంటరిగా ఉన్నాను. మీరుగాని కొంచెం మున్నెరుకతో అతని పేరు అడిగి తెలుసుకుంటే ఎంత బాగున్ను! మీకు స్నేహితులున్నారు, నలుగురితో కలిసిమెలిసి, చాలా సంగతులు తెలుసుకోడానికి అవకాశాలున్నాయి. మీకు శ్రద్ధవుంటే జాను భర్తని కనిపెట్టడం అంత కష్టమైన పనా? ఇప్పుడు తన భార్యగురించి తికమకలు పడుతున్న మనిషి అకస్మాత్తుగా మీదగ్గర చిక్కుకున్నాడుకదా, అతనిగురించి ఏమైనా అడగవచ్చుకదా? అడక్కూడదా? స్నేహాభావంతో ఇవన్నీ అడగడానికి మగవాళ్ళకి ఇదేం పెద్ద ప్రశ్నకాదు. ఏమో, ఇది నేను పడుతున్న బాధ . . . పనికిమాలిన బాధ!" అని అంగలార్చుకున్నాను.

"అబ్బో, నీ కోపం చూస్తే ఆ సేతురామన్ కోపాన్ని మించిపోతున్నట్టు కనిపిస్తుందే!" అని అతను నవ్వుతూ అన్న మాటలు విని నేను అదిరిపడ్డాను.

"ఏమిటి, ఏమన్నారు? సేతురామనా? ఆ ఆహ్వాన పత్రికలో ఆ పేరే చూసినట్టుంది!" అని ఆశ్చర్యంతో ఒక గెంతు గెంతాను.

"మరేం తెలుసు అతని గురించి? చెప్పండి, వింటాను!" అని బతిమాలాను.

కాని ఆ సమయంలో అతనికి మరేం సంగతులు తెలియలేదు.

రెండురోజుల తరువాత మావారు ఉత్సాహంతో వచ్చారు.

ఆరోజు బాలూ మళ్ళీ తన స్నేహితుడుతో క్లబ్బుకి వచ్చారు. ఇతను వాళ్ళిద్దరిని వేరువేరుగా కలుసుకొని తన పని మొదలుబెట్టారు.

"బాలూ, మా ఆవిడ నిలువుటద్దం కావాలంటోంది. కొనాలి. ఎప్పుడు షాప్పింగ్ వెళ్దాం?" అని అడిగారు; సేతురామన్ మావారిని సూక్ష్మంగా చూసి, సర్దుకొని, మరేం అనక నిలబడడం గమనించారు.

ఎప్పుడూ మా ఆయనకి తోడుండే మనిషి బాలు. ఆ కారణం వలన అతను "సరే, రేపే వెళ్దాం!" అని అన్నారు.

ఆ తరువాత "మీరూ మాతో రండి సార్!" అని మావారు సేతురామన్ని పిలిచారు.

"వద్దు సార్!', "నేను రాసేరాను సార్!", "నాకు నిలువుటద్దాలగురించి ఏమీ తెలియదు సార్!" అని అతను మూడు, నాలుగు సార్లు అన్న తరువాత మా ఆయన "అసలు మిమ్మల్ని చూస్తే మీకూ నిలువుటద్దానికి చాలా ఇఋకైన సంబంధం ఉన్నట్టు నాకనిపిస్తోంది . . . అందుకే మీరు రావాలంటున్నాను!" అని అన్నారు.

"అంటే? . . ." అని అతను మళ్ళీ అడిగారట.

"నా భార్య స్నేహితురాలు జాను నిలువుటద్దం తన జీవితం ధ్వంసం చేసిందని దాన్ని అమ్మేసింది . . . నిలువుటద్దం గురించి నోరెత్తితే ఆమెకి ఒకటే హడలు! . . . మీకూ అలాగే నిలువుటద్దం అంటే అసహ్యం కాబోలు! . . ." అని మావారు అన్నారు.

"సార్, మీకివన్నీ ఎలాగ తెలుసు?" అని అంటూ సేతురామన్ నివ్వెఱపడిపోయారట.

మా ఆయన ఎడతెగకుండా అతన్ని పురిగొల్పి నిజమేమిటో తెలుసుకున్నారు. అవును, సేతురామన్ జాను భర్త అని తెలిసింది!

"అవునుసార్, నిజం చెప్పండి! నిలువుటద్దం కొన్నతరువాత, దాన్ని నెపంగా పెట్టుకొని, అసలు రాములవారిలాగ 'పెళ్ళికి పుట్టిల్లు వెళ్ళు!' అని భార్యని నెమ్మదిగా పంపించేసి, ఆ తరువాత . . . " అని మావారు సూటిగా అడగ్గానే, సేతురామన్ ఏమీ దాచక అన్నీ చెప్పేసారు.

"'సార్, దానికి నాకంటే అద్దమే ముఖ్యమా?' అని అద్దం కొనడానికిముందే నాకు తోచింది! 'నేను పుట్టిల్లుకి వెళ్తాను, అద్దంకి డబ్బు కూడబెట్టవచ్చు!" అని అన్నప్పుడు 'మరి నేను ఒంటరిగా ఉంటానుకదా, నాగురించి దీనికి ఎటువంటి ఆలోచనా లేదే?" అని కొంచెం బాధ పడ్డాను. కాని 'పాపం, అద్దంకి ఆశపడుతోంది!" అని కొనేసాను. కాని ఆ తరువాత నాకు ఆ అద్దంమీద ద్వేషం తగ్గలేదు. అద్దం ఎందుకు సార్? జానుకి అద్దంమీద ఎందుకు అంత మోహం? తన స్వరూపం, తనంటే గొప్ప, అంత గర్వమన్నమాట! అలాంటి ఉద్దేశమే నాకు కటువుగా అనిపించింది, కోపం వచ్చింది. జాను ఆ వ్యామోహం నా ఎదుట చూపించకపోయినా ఇంతకుముందు ఇదే తలపు ఆమెలో ఉందని నేను గుర్తుచేసుకున్నాను. నాకోసం సవరించుకున్నా, దాని మనసులో ఆ పాత పిచ్చితనం, తనగురించీ, తన అందం గురించీ, గర్వమూ, పొగరుబోతుతనం ఉన్నాయేమో అని నాకు అనుమానం కలిగింది. అది తన వ్యామోహం పోగొట్టుకోవాలని నిశ్చయించాను. అందుకే దాన్ని పుట్టిల్లుకి పంపించేసి, ఆ ఉత్తరమూ రాసి, ఉద్యోగం రాజీనామాచేసి, కాపురమూ రద్దుచేసాను. నాకొక తెలుగు జిల్లాలో ఉద్యోగం దొరికినవెంటనే ఇవన్నీ చేసాను. కాని అక్కడా - తమిళదేశం సమీపంలో - ఉండడంవలన నాకు మనశ్శాంతి లేదు. అందుకే మూడుమాసాలముందు ఈ ప్రాంతాలకి వచ్చేసాను సార్! అదేంటో నా తల్లిదండ్రులకీ

ఏమీ తెలియకూడదని మొండిగా ఉండిపోయాను; ఇక్కడ దేశదిమ్మరిలాగ ఇలా అలా తిరుగుతున్నాను. ఇప్పుడే నా చేష్టలవలన ఎందరి మనసులు నొప్పించానో అని బాధ పడుతున్నాను. . . . బాలూ 'ఇల్లు దొరికింది!' అని అనగానే నాలో చాలా ఆలోచనలు . . . కాని ఇంతలో దాని మనసు మారి ఉంటుందా అని ఎవరికి తెలుసు సార్?"

సేతురామన్ ఇలా అనగానే "జాను ఆత్మహత్య చేసుకుంది!" అని అంటూ అతన్ని ఇంకా ఏడిపించాలని మావారికి తోచిందట. కాని అతని అసహాయత, శోకం చూసి జాలి పడి, ఒక ఏర్పాటు చేసివచ్చారు.

జానుని వెంటనే రమ్మని పిలిచి కాపురం పెట్టి, సేతురామన్ కోరినట్టు దాంపత్యం సాగించడానికి దోహదం చేసారు.

నేను వెంటనే చెయిలో కలమూ, పేపరు తీసుకొని, జానూకి ఉత్తరం రాయడానికి సిద్ధమైయ్యాను.

భర్త నిలువుటద్దం కొన్నవెంటనే సంతోషించి, ఆ తరువాత ఆలాపించిన జాను; తమిళదేశంలో, పుట్టినిల్లు చేరుకున్న తరువాత నేను అనుభవించిన నా బాధ; మా ఇద్దరి మనసూ ఎలా వర్ణించడం? పానకమో, కొబ్బరినీళ్ళో అని ఆతురతో తీసుకున్న గ్లాసులోనిది తాగితే అది చేదుగా ఉంటే, అది ఎటువంటి నిరాశ! కాని అదొక చేదుమందంటే మనకి మంచిదేకదా?

"'నా జన్మభూమి తమిళదేశం!' అని కొనియాడు, గర్వపడు!" అనే గేయం నేను నాలో గొణుక్కున్నాను; కాని నేను రాసినది వేరు.

"జానూ, విను! 'పుట్టిల్లు', 'పుట్టిల్లు', అని స్త్రీలకి ఎంత కాంక్ష ఉన్నా, వాళ్ళ హృదయం 'భర్త ఉన్న చోటే స్వర్గం!' అని ఘోషించుతోంది. రా, నువ్వూ నాలాగే ఇక్కడ కాపురం చెయ్యడానికి రా!" అని రాసాను. అదే నా హృదయం నాకు చెప్పింది.

ధూళిపోయి తళతళమని ప్రకాశించే అద్దంలాగ జాను ముఖం కాంతితో నాకు కనిపిస్తోంది. ఆ కాంతిలో మేమిద్దరం ఒకరినొకరు చూసుకుంటున్నాం.

కాని నా మనసుని ఆహ్లాదపరిచేది - ఆ దృశ్యమే అని చెప్పాలి.

నేను అక్కడికి వెళ్ళినప్పుడు . . .

ఒక కొత్త నిలువుటద్దంముందు జానుని నిల్చోబెట్టి, ఆమె తలలో తనే ఒక పువ్వు అలంకరించి, వొంగియున్న ఆమె ముఖాన్ని అద్దంలో చూసి సేతురామన్ ఆనందిస్తున్నారు . . .

ఇంతకు ముందు "నాకు కావాలి!" అని జాను కోరి అందుకున్న అద్దంవలన ఏర్పడిన ఫలంకి విరుద్ధంగా, ఇప్పుడు ఆమె "వద్దు!" అని అన్నా ఆమె భర్త కొనితెచ్చిన అద్దం వాళ్ళ దాంపత్యంకి దోహదం చేస్తోంది అని చెప్పాలా?

కావాలంటే 'చెయిలోని గాయంకి అద్దం కావాలి!' అని వాదించేవారు వెళ్ళి నేరుగా చూసి రావచ్చు.

కాని, తప్పకుండా, నాలాగ మరెవరూ గర్వపడరు!

అవును. నా చెయి గాయంకి నేను అద్దం వెదకలేదు; డాక్టరుగారిని కలుసుకున్నాను. కాని నా స్నేహితురాలు జాను జీవితంలో అద్దం చేసిన దుర్ఘటనని మావారి సహాయంతో జాడ తెలియకుండా తొలగించేసాను! ఇది ఎంత పెద్ద సాధన!

********

**(మూలం ప్రచురణ సుదేశమిత్రన్, మార్చ్ 27,** 1949**)**

# అపవాదం

ఏవో మాటల సందడి విని ధర్మాంబాళ్ వాకిలి పక్క తిరిగి చూసింది. ఆమె భర్త ఒక అమ్మాయితో మాటాడుతున్నారు. నిన్న అతను పిలిచినప్పుడు పరుగెత్తిన ఆ పాప ఇప్పుడు గడపదగ్గరకి వచ్చేసిందా? ఆశ్చర్యంతో ధర్మాంబాళ్ వాకిలికి త్వరగా నడిచింది. ఆవిడని చూడగానే పాప సిగ్గుతో వెనకాడింది.

"ఏం, ఎందుకు భయం? ఇలా రా!" అని ఆమెని ముద్దుగా ధర్మాంబాళ్ మందలించింది. "రామ్మా, నీ పేరేంటి?"

నవ్వుతూ, ఓరచూపు చూస్తూ, "నందిని!" అని ఆ ఆరేళ్ళ అమ్మాయి జవాబు చెప్పింది.

"ఓ, అలాగా? నంది[1] కాదుకదా?" అని శర్మ నవ్వుతూ అడిగారు.

అతను ఏదో హాస్యంగా మాటాడాలని అలా అడిగారు; పాపకి ఏం తెలుసు?

"బాగుంది మీ వేళాకోళం! దాని మొహం చూసారా? మీరేమన్నారో పాపకి తెలీదు! నువ్వు రావమ్మా, నేను నీకు అప్పుచ్చి[2] ఇస్తాను," అని ధర్మాంబాళ్ పిల్లని లోపలికి రమ్మంది.

"నాకు అప్పుచ్చి వద్దు! నేను భక్షణమే తింటాను!" అని రూఢిగా నందిని చెప్పింది.

భార్యాభర్తలు విస్తుపోయి ఒకరినొకరు చూసుకున్నారు. ధర్మాంబాళ్ చిరునవ్వు నవ్వింది; శర్మ నోరు విప్పి నవ్వారు.

"విన్నావా? మనిద్దరిలో ఎవరూ నందినితో సరిగ్గా పలకరించలేదు అని తెలిసిందా? 'నన్ను పాప అని పిలవకండి!' అని నందిని మనకి చెప్తోంది!"

"మీరేమన్నారో దానికి బోధపడలేదే? మరెలాగ మీతో దెబ్బలాడుతుంది? అసలు మనిద్దరం దాన్ని సరిగ్గా పేరుపెట్టి పిలవలేదు. 'నందిని కణ్ణు' అని ముద్దుగా పిలుద్దాం!

---

[1] నంది అన్న పదంకి ఎద్దు అనే అర్ధమూవుంది.

[2] పాపలకిచ్చే తినుబండారాలకి తమిళులు వాడే పదం.

ఏమ్మా, సరేనా?" అని నందిని జుత్తుని అతి వాత్సల్యముతో తడుముతూ ధర్మాంబాళ్ నందినితో ఇంట్లోకి వెళ్ళింది.

నందిని వాళ్ళ ఇద్దరి ప్రేమ అంగీకరించినట్టు, లోపలికి వెళ్ళి, ఉయ్యాలలో కూర్చుంది; ధర్మాంబాళ్ ఒక పళ్ళెంలో ఇచ్చిన భక్షణం అందుకుంది. శర్మ అక్కడికి వచ్చారు, ఆ దృశ్యం చూసి ఆనందించారు. "నిన్న నేను పిలిచినప్పుడు ఇది రాలేదు, పారిపోయింది. ఇవాళ ఎందుకు వచ్చిందో అడుగు!" అని భార్యకి చెప్పారు.

ధర్మాంబాళ్ నవ్వుతూ "చెప్పమ్మా మామీకి!" అని అడిగింది. వెంటనే నందిని నోడాబుడ్డి పగిలినట్టు "మామా నాకొక పెద్ద బొమ్మ ఇస్తానన్నారు!" అని చెప్పింది.

అది విని దంపతులు ఆనందించారు.

వచ్చిన నవ్వుని ఆపుకుంటూ ధర్మాంబాళ్ "ఏం, మీరు పిల్లకి బొమ్మ ఇవ్వకుండా మోసం చేసారా?" అని అడిగింది.

"బాగుంది, నేనెందుకు మోసం చేస్తాను?" అని తనలో తనే మాటాడుకుంటూ శర్మ పక్కనేవున్న గదికి వెళ్ళారు.

అక్కడ అల్మారాలో చిన్న, రకరకాల బొమ్మలమధ్య ఒక పాప బొమ్మ మంచి దుస్తులతో కనిపించింది. శర్మ దాన్ని చెయిలో అందుకున్నారు. ఆ దృశ్యం చూసి నందిని కళ్ళు నినిగలాడాయి.

గబగబమని పరుగెత్తుకొని వచ్చి నందిని శర్మని చేరుకుంది; అతను ఆ బొమ్మ పిల్లకి అందించేసారు.

"ఈ బొమ్మే ఇవ్వాలనుకున్నారా?" అని ధర్మాంబాళ్ నిరుత్సాహంగా అడిగింది.

"అవును," అని అన్నారు అతను.

"చంటిపాపలాగ దీన్ని మనం ఎన్ని సంవత్సరాలుగా కాపాడుతున్నాం! అది ఇచ్చేయడమా అని నాకు బాధగా ఉంది; లేకపోతే నందినికి ఇవ్వడానికి నాకెందుకు ఆక్షేపణ?"

శర్మ ఒక క్షణం ఆలోచించి భార్యకి సమాధానం చెప్పారు: "ఇప్పుడిది ఇచ్చామనుకో, నందిని ఆశతో పదేపదే మనింటికి వస్తుందే? ఈ బొమ్మ ఉత్తికే ఇక్కడ

ఉంటే ఎవరికి లాభం, చెప్పు! నందిని మనింటికి రోజూ వచ్చి కొంచెసేపు దీనితో ఆడుకుంటే మంచిదే కదా?"

"అవును. నాకూ మరో ఆలోచన తట్టింది. నందినికి మనతో దగ్గర పరిచయం కలిగేవరకు ఈ బొమ్మ మనింట్లో ఉండనీ; బొమ్మకోసమైనా అది ఇక్కడకి తప్పకుండా వస్తుంది. ఆ తరువాత ఆ బొమ్మ దానికే ఇచ్చేద్దాం!" అని అంది ధర్మాంబాళ్.

శర్మ భార్య సలహాకి ఎదిరించలేకపోయారు. ఆ బొమ్మనే చూస్తూ నిల్చున్న పిల్లని వొంగి చూసి "నందిని, నువ్వు మా ఇంటికి రోజూ రావాలి! వస్తే ఈ బొమ్మతో ఆడుకోవచ్చు!" అని అన్నారు.

"అది నాకు ఇస్తాను అని నువ్వు అనలేదూ?"

ఆ సూటీ ప్రశ్నతో దంపతులకి మరేం మార్గం కనిపించలేదు.

శర్మ భార్య మొహం చూసారు; ధర్మాంబాళ్ నందిని మొహం చూసింది.

"సరే, ఇదిగో, ఈ బొమ్మ నీకే. కాని నువ్వు రోజూవచ్చి మా ఉయ్యాలలో ఊగాలి! మా ఇంటి పూజ చూడాలి, ప్రసాదం తీసుకోవాలి! సరేనా?" అని ధర్మాంభాళ్ ఉత్సాహంతో చెప్పింది.

పిల్ల బొమ్మతో తనింటికి పరుగెత్తింది.

పిల్లకి ఆ బొమ్మ ఇవ్వడంలో ఆవిడకి చాలా సంతోషమూ, తృప్తి కూడా. తనకి సంతతి లేకపోవడంవలన మనః పూర్వకంగా ఇరుగుపొరుగులవారి పిల్లలకి తినుబండారాలూ, అటవస్తువులు ఇచ్చి ఆనందించడం ఆవిడకి బాగా అలవాటైపోయింది. కాని ఇంతవరకూ ఆ పెద్ద సెలులాయడ్ బొమ్మ ఎవరికైనా ఇవ్వాలనే ఉద్దేశం ఆవిడకి లేనేలేదు; పాత పదిహేను సంవత్సరాలుగా ఆ బొమ్మలోనే ఒక చంటిపాపని చూస్తున్న తృప్తి ఆవిడకి కలిగింది.

ఆ బొమ్మకి రకరకాల ఆడ, మగ దుస్తులు తొడిగిచూసి ఆవిడ ఆనందించేది; అందువలనే దాన్ని వదలుకోడానికి మనసు రాలేదు. కాని ఇప్పుడు నందినిలో కనిపించే ఆకర్షణ, సానుభూతి చూసినతరువాత ఆ పిల్లకి ఆ బొమ్మని స్వాధీనం చేసుకునే అర్హత ఉంది అనే నమ్మకం వచ్చేసిందన్నమాట! ఆ బొమ్మని త్యజించడానికి ధర్మాంబాళ్ బాధపడలేదు: ఆ పిల్ల నందిని రోజూ తమ ఇంటికి వచ్చి ముచ్చట్లాడితే,

తన మనసు తేరుకుంటుందని ఆవిడ నమ్మింది; నందినితో పరిచయం పెరుగుతుంది. బొమ్మ పోయిన తరువాత ఇటువంటి ఆలోచనలే ఆవిడ మనసుని ఆకట్టుకున్నాయి.

ఆ రోజు సాయంకాలం నందిని బొమ్మతో ఇంటికి రావడం ధర్మాంబాళ్ గమనించింది; తన తల్లితో వస్తున్నట్టు తెలిసింది. నందిని కుటుంబం ఇటీవల కొత్తగా ఆ ఊరుకి వచ్చినందువలన వాళ్ళతో పరిచయం లేదు; కాని నందిని తల్లి ఎవరని ధర్మాంబాళ్ కి బాగా తెలుసు.

నందిని తల్లి అధికారం ఉన్న ధోరణిలో మెట్లెక్కి ఇంటిలోకి వచ్చింది. "మీరు ఇంతపెద్ద బొమ్మని మా అమ్మాయికి ఇచ్చేసారు! ఈ రోజుల్లో ఇటువంటి బొమ్మలు అరుదు కదా! మరి మీ పిల్లలు ఆశపడరా?" అని రాగానే అడిగేసింది.

తెరలాగ శోకం వ్యాపించిన ధర్మాంబాళ్ ముఖంలో ఔదార్య రేఖ కనిపించింది.

"ఇక్కడ పిల్లలెవరూ లేరండి. మేం బొమ్మ నందినికే ఇచ్చాం. అది అనుభవించనీ. రోజూ ఒకసారి మా ఇంటికి పంపించండి, మాకు సంతోషంగా ఉంటుంది" అని చెప్పింది.

నందిని తల్లి జానకి ధర్మాంబాళ్ ని అనురాగంతో చూసింది. తరువాత మాటల వరుసలో ధర్మాంబాళ్ పిల్లలని కని పోగొట్టుకోలేదని, అసలు ఆమెకి పిల్లలే పుట్టలేదని తెలుసుకొని బాధపడింది. సొంత పిల్లలు లేకపోవడం వలన ఇతరుల పిల్లలని తిట్టిపోసే స్త్రీలలాగ కాకుండా ఆవిడకి అందరి పిల్లలని ప్రేమించే ఉదార గుణముందని తెలుసుకుంది.

పిల్లల్ని కొనియాడే ఇంటిలో నందినికి వేరే ప్రోత్సాహం కావాలా ఏమిటి? అది తనకి ఇష్టం వచ్చినట్టు శర్మ దంపతులని చూడడానికి వస్తుంది; కొన్నిసార్లు తన తోబుట్టువులతో లేక ఇరుగుపొరుగువారి పిల్లలతో వస్తుంది; చాలామట్టుకు తనే ఒంటరిగా వస్తుంది. ఇంటిలో తను అల్లరి చేస్తే, ఎవరైనా ఏమైనా అంటే "నేను మామీ ఇంటికి వెళ్తాను!" అని చెప్పి వచ్చేస్తుంది; ఇక్కడే భోజనం చేస్తుంది; ఇక్కడే ఉయ్యాలలో నిద్రపోతుంది. పండుగల్లో తల్లి కొత్తబట్టలు తొడిగిస్తే "మామీ, మామాకి చూపించి వస్తాను!" అని తొందరపడుతుంది. బయటికి, నాలుగు ఇళ్ళలమధ్య, వేరే వేరే కుటుంబాలుగా కనిపించినా, రెండూ ఒకే సంసారంలాగ మెలిగాయి.

ఆ ఇంటికి ఎంతమంది పిల్లలు రానీ, పోనీ, ఆరేళ్ళ నందిని మాత్రం తన మాటలతోనూ, చేష్టలతోనూ, శర్మ దంపతుల ఎండిపోయిన జీవితంలో కాంతి వికసింపజేసింది.

దసరా నవరాత్రుల పండుగుల సమయంలో జానకి తనే ధర్మాంబాళ్ ని కలుసుకొని తమ ఇంటిలో బొమ్మలకొలువు అమర్చడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, నందిని ఆశించడం వలన వాళ్ళ ఇంటిలో బొమ్మలకొలువుకి ఏర్పాటు చెయ్యడానికి వీలవుతుందా అని  అడిగింది; అమితమైన సంతోషంతో ధర్మాంబాళ్ సరే అని అనుమతి ఇచ్చేసింది.

ఆ తరువాత ధర్మాంబాళ్ మనసు ఎలా వర్ణించడం? 'మన ఇంటిలోనూ దసరా పండుగ సందడితో, పిల్లలతో, సాగుతోంది!' అనే అభిమానం చోటుచేసుకుంది. దానితోబాటు నందినికిచ్చిన మొట్టమొదటి సెలులాయిడ్ బొమ్మలో సొట్ట కనిపిస్తోందని ధర్మాంబాళ్ నందినిని చీవాట్లు పెట్టలేదూ? "ఎందుకమ్మా ఇలా చేసావ్?" అని కొంచెం అమ్మాయిని గట్టిగానే ఆమె కసురుకుంది; కాని వెంటనే బాధపడింది. ఆ బాధ తొలగించుకోవాలని  ధర్మాంబాళ్ ఇప్పుడు నందినికి బహుమానంగా కొన్న బొమ్మలు ముందుకొన్న బొమ్మలకి రెండింతలుగా పెరిగిపోయాయి; దీపావళి సమయంలో టపాకీలు, బాణసంచాలు కట్టలు కట్టలుగా గుమిగూడిపోయాయి.

మరొక ఊరు కోవిలలో జరిగే రెండు రోజుల ఉత్సవాలకి శర్మ దంపతులు వెళ్ళినప్పుడు నందిని "వాళ్ళు ఎప్పుడు తిరిగివస్తారు?" అని తన తల్లిదండ్రులని పదే పదే వేధించిందని విని శర్మ దంపతులకి సంతోషమూ, గర్వమూ కలిగాయి.

వేసవికాలం వచ్చింది. దానితోబాటు, వాడుకగా, ఆ వివాహ ఆహ్వాన పత్రిక వచ్చింది. "చూసారా, స్టాంపు అంటించడం మరిచిపోయారు, మీకు పావలా ఖర్చు!" అని టపాలావాడు నవ్వగానే శర్మ "అదేం పెద్ద ఖర్చు! పాపం, మర్యాద చూపాలని పత్రికతో  ఉత్తరమూ రాసి పంపారు . . . పెళ్ళి సందడిలో స్టాంపు అంటించడం మరిచిపోయారు . . . దానికేం? మేం వెళ్ళి పెళ్లి దంపతులని ఆశీర్వదించి వస్తాం!" అన్నారు.

"ఈ వీధి చివరలో ఉన్నారే అయ్యరు - అతనికి ఇటువంటి పత్రిక వచ్చివుంటే ఇక్కడనుంచే వాళ్ళకి ఆశీస్సులు పంపించేవారు!" అని అంటూ టపాలావాడు మళ్ళీ నవ్వాడు. శర్మ "అతనికి పెద్ద సంసారం, అతనొక పిసినిగొట్టు! నాకలా కాదు" అని వాడికి సమాధానం చెప్పారు. ఇంతలో నందిని పరుగెత్తుకొని రాగానే, "ఏవమ్మా, నువ్వూ మాతో పెళ్ళికి వస్తావా?" అని శర్మ అడుగుతూ ఆమెతో ఇంట్లోకి ప్రవేశించారు.

భార్యకి ఉత్తరం అందించి "మనం ఎప్పుడు వెళ్దాం?" అని అడిగారు. శర్మగారి అన్న బావమరది కూతురుకి పెళ్ళి; కాని ఆ కుటుంబంతో మంచి పరిచయముంది.

"పాపం, పెళ్ళికి ఒక వారం పదిరోజులుముందే వచ్చి పెళ్ళికి సాయం చెయ్యాలని మీ వదినగారి వదిన  నాకు చెప్పారు. మీ వదిన ఆడపడుచు అనే ధోరణిలో అలాగే కూర్చుంటుంది! నేను వెళ్ళి తప్పకుండా సాయం చేస్తాను!" అని ధర్మాంబాళ్ మనసు విప్పి చెప్పింది.

"మా వదినలాగే నువ్వూ ఒక తోటికోడలేకదా? మరి నువ్వుమాత్రం ఎందుకు పని చెయ్యాలి?" అని శర్మ అడిగారు.

"అవును, తోటికోడలే! కాని ఇద్దరం ఒకే చోట, ఒకేలాగున్నామా? మీ వదినకి నేను పూర్తిగా విరుద్ధం!" అని వంటగదిలో ఏదో పనిచేస్తూ ధర్మాంబాళ్ పలికింది; భర్తని నేరుగా చూసి ఆ మాటలు అనలేదు.

ఆ వదినగారికి చాలామంది పిల్లలు; ఒక సమయం ఒక పిల్లవాడిని శర్మ దంపతుల ఇంటిలో చదివించడానికి సలహా ఇచ్చినప్పుడు ఆవిడ కటువుగా తన తిరస్కారం తెలియజేసింది.

"మేం దత్తత అడగలేదే? పిల్లవాడిని మాకు ఇచ్చేయమని బలవంతం చేసామా? ఎటువంటి పొరబాటు చెయ్యలేదే?" అని అంగలార్చుకున్న ధర్మాంబాళ్ మనసులోని గాయం పూర్తిగా పోలేదని శర్మకి బోధపడింది.

మాట మార్చాలన్న నెపంతో అతను పనసపండు తొనలు తింటున్న నందినిని చూస్తూ "ఇదికూడ మనతో పెళ్ళికి వస్తానంటుందే?" అని అన్నారు.

ధర్మాంబాళ్ మనసులోనూ 'నందినికూడా మనతో వస్తే?' అనే ఆలోచన ఒక తోకచుక్కలాగ లేచింది; అది ఇంతవరకూ ఆవిడ ఎరుగని అనుభవం - తను పిల్లలతో వేరే ఊరుకి ప్రయాణం చెయ్యడం.

"ఎక్కడకి మామా? నేనూ వస్తాను!" అని నందిని ఉత్సాహంతో శర్మని అడిగి దూకింది.

ఆమె ఆతురత దంపతులు గుర్తు చేసుకున్నారు.

"అవును, నందిని మనతో రానీ. పది పదిహేను రోజులు దాన్ని చూడకుండా మనం ఉండగలమా?" అని శర్మ భార్యని అడిగి "నందిని, వెళ్ళు, నీ నాన్నగారికి చెప్పు!" అని పిల్లని తొందరపెట్టారు; నందిని పరుగెత్తడానికి సిద్ధమైంది.

కాని ధర్మాంబాళ్ అడ్డు చెప్పింది: "బాగుంది, మనం చెప్తే చాలా? వాళ్ళు మాత్రం పదిహేను రోజులు అమ్మాయిని చూడకుండా ఉండగలరా? పిల్లని మనతో పంపుతారా?" అని అడిగింది.

"వాళ్ళు వద్దన్నా నేను తప్పకుండా వస్తాను!" అని నందిని తన మొండిపట్టు తెలియజేసింది.

అది విని ధర్మాంబాళ్ ఒక చిన్న నవ్వు నవ్వింది.

"అమ్మాయీ, నువ్వు వస్తే మాకూ సరదాగా ఉంటుంది. సరే, నువ్వు మీ ఇంటికి వెళ్తావా? నేను సాయంకాలం వచ్చి మీ అమ్మగారిని కలుసుకుంటాను అని చెప్పు!"

"సరే, చెప్తాను!" అని నందిని పరుగెత్తింది.

"అమ్మాయి మనతో వస్తే దాని స్కూలు పాఠాలు ఏమౌతాయి?" అని శర్మ అడిగారు. "రేపే సెలవులు ఆరంభం కాబోలు!" అని ధర్మాంబాళ్ చెప్పింది. పిల్లలు ఎవరైనా ఇంట్లో ఉంటేనేకదా స్కూళ్ళ గురించి ఆ దంపతులకి ఆలోచన వస్తుంది! నందిని తమతో పెళ్లికి తప్పకుండా రావాలని ధర్మాంబాళ్ ఆశపడింది; తను నందినితో పెళ్ళిలో అక్కడ దర్శనమిచ్చే దృశ్యం కల్పన చేసుకుంది. చదువుకని తన పిల్లవాడిని అప్పగించని తన తోటికోడలు కూడా ఆ పెళ్ళికి వస్తుంది. 'ఆవిడ నా పెంపుడుకూతురు నందినిని చూడాలి, నన్ను నిర్లక్ష్యం చేసినది పొరబాటు అని గ్రహించాలి!' అనే ఆశకూడా లేచింది. పదిరోజులు నందినిని విడిచి ఉండనక్కరలేదనే ఊరడింపుకూడా

కలిగింది. జానకి తన కూతురుని తనతో తప్పకుండా పంపుతుందని అని నమ్మకం ఉన్నా మాటవరుసకి, ఆవిడని ఒకసారి కలుసుకొని అనుమతి కోరాలని అనుకుంది.

కాని అంతలోనే జానకి కూతురుతో వచ్చేసింది.

“మామీ, నా పెట్టెలో నా చొక్కాయి, పరికిణీ అన్నీ సర్దేసాను!” అని నందిని ఉత్సాహంతో తెలియజేసింది.

“మామీ, మా అమ్మాయి ఏమేమో అంటూందే? నిజమేనా? బట్టలన్నీ సర్దుకొని సిద్ధంగా ఉందే?” అని అడుగుతూ జానకి వచ్చింది.

ధర్మాంబాళ్ అన్నీ వివరించి చెప్పింది. జానకి ఆక్షేపణ చెప్పలేదు; కూతురుని ఆమెతో పంపించడానికి సరేనంది. వచ్చే వారంలో శర్మ దంపతులు నందినితో ప్రయాణమైయ్యారు. నందిని మనసులో ఉల్లాసమూ, సంతుష్టి కనిపించాయి; శర్మ దంపతులు ఇదొక ఇంపైన కొత్త అనుభవమని గర్వపడ్డారు.

పెళ్ళివైభవంలో నందిని పర్వతనందినిగా అందరికీ పరిచయమైంది. ఆమెలో కనిపించే ఈడుకి మించిన బుద్ధి, చురుకుతనం అందరూ పొగడారు. ఒకతను తను స్నానం చెయ్యడానికి వెళ్ళినప్పుడు తన వాచీని నందిని మణికట్టులో కట్టి “ ఇదిక్కడే ఉండనీ; భద్రంగా ఉంటుంది. నాకు మరేం భయం లేదు!” అని అందరికీ చెప్పివెళ్ళారు. ధర్మాంబాళ్ తోటికోడలికికూడా నందినిపై అభిమానం కలిగింది. “ఆడపిల్ల కదా, అందుకే మీ దగ్గఱ దాన్ని వదిలేసారు; మీరుగాని దాని పెళ్ళికి సాయం చేస్తే వాళ్ళకి సంతోషంగా ఉంటుంది!” అని నవ్వుతూ చులకనగా మాటాడినా ఆవిడకి నందినిమీద ఎటువంటి అలుకా లేదు.

పెళ్ళికి ఒక వారం ముందే రావడంవలన ధర్మాంబాళ్ సక్రమంగా అన్ని విధాలా పెళ్ళికి సాయం చేస్తూనే నందినిని చూసుకుంది. శర్మగారుకూడా నందిని విషయంలో భాధ్యత వహించారు. కాని వచ్చిన నాలుగవరోజు నందినికి జ్వరం వచ్చేసింది. ఏమైందని తెలియక బాధ పడుతున్న శర్మ దంపతులు పెళ్ళికి ముందురోజు జ్వరం పోయిందని సంతోషించారు; పెళ్లి జరిగిన రోజు జ్వరం లేదు. భోజనంకి కూర్చున్న ధర్మాంబాళ్ మనసు “పిల్లకింకా పథ్యం ఇవ్వలేదు, నాకెందుకు ఈ విందు?” అనే ఆలోచనలో పడింది; అప్పుడే ఒక అబ్బాయి పరుగెత్తుకొని వచ్చాడు.

మూర్ఛిల్లి నందినికి తెలివి తప్పిందని చెప్పాడు; ధర్మాంబాళ్ స్తంభంలాగ నిల్చుండిపోయింది.

"ఎంతసేపుగా ఈ మూర్ఛ?" అని ఎవరో అడిగారు. "పది నిమిషాలు గడిచిపోయాయి. మేలుకుంటుందని అనుకున్నాం, కాని లేవలేదు," అన్నాడు అబ్బాయి.

"ఎందుకురా ముందే చెప్పలేదు?" అని అడుగుతూ ధర్మాంబాళ్ పరుగు తీసింది.

జ్వరం రావడంతో నందినికి వేరే ఇంటిలో బస అమర్చడమైంది. అక్కడికి ధర్మాంబాళ్ వెళ్ళి చూసింది. నిద్రబోతున్న నందిని బల్లనుంచి దొర్లి నేలమీద పడిపోయిందని, ఆ అదురులో ఆమెకి తెలివి తప్పిందని, త్వరలో డాక్టరు వస్తున్నారని అక్కడున్నవారు చెప్పారు.

డాక్టరు వచ్చారు, శర్మగారిని కలుసుకొని ఆ రోజంతా నందినిని జాగ్రత్తగా చూసుకోవాలని, మరేం భయం లేదని అన్నారు. నందిని తల్లిదండ్రులకి తెలియజేయాలా, వద్దా అని శర్మ చిక్కులో పడ్డారు. ఒక రోజు ఆగి, ఏమౌతుందో చూసి తప్పకుండా వాళ్ళకి రాయాలని నిశ్చయించారు. ఆ మరుదినం జ్వరం తగ్గగానే, "ఇక నాలుగురోజుల్లో మనం ఊరికి వెళ్ళాలి, దానికి ముందురోజు రాసేద్దాం" అని ఆలశ్యం చేసారు. కాని మూడవరోజు జ్వరం మళ్ళీ తిరిగి వచ్చేసింది, మరుదినం తగ్గలేదు; శర్మగారి తిరుగు ప్రయాణంకి అడ్డం వచ్చేసింది.

అమ్మాయికి జ్వరం అని తెలియజేసి అది తగ్గగానే బయలుదేరి వస్తామని శర్మ రాసారు. బెంగపెట్టుకోవద్దని - తన అధైర్యం దాచుకొని - వాళ్ళకి ధైర్యం తెలిపారు.

కాని రెండురోజుల తరువాత ముత్యాలలాగ పొక్కులు నందిని దేహమంతా వ్యాపించడం చూసి శర్మ దంపతులు నిర్ఘాంతపోయారు; నందిని తమ సంతతికాదు, ఇతరుల పిల్ల అనే అవగాహన ఇప్పుడు వాళ్ళని ఎత్తిపొడిచింది.

అత్యవసర పరిస్థితి వచ్చేసిందని శర్మ నందిని తండ్రికి తెలియజేసారు; మరుదినం నందిని తల్లిదండ్రులు వచ్చిచేరారు. రాగానే "ఎందుకు మాకు ముందే చెప్పలేదు? మీరు చేసినది న్యాయమేనా?" అనే వాళ్ళ నిందారోపణ విని శర్మ దంపతులు మరేం

అనలేక తలవంచుకున్నారు. శర్మ మనః పూర్వకముగా, అమితంగా నందిని చికిత్సకి డబ్బు ఖర్చు చేసారు. కాని నందిని కళ్ళలో ఒకదానికి కాంతి పోయింది.

పెళ్ళి సందడిలో విందు భోజనంలో నందిని తెలివితప్పి పడిపోయిన ఘటన గురించి మాటాడుతూ ధర్మాంబాళ్ కన్నీరు కార్చింది.

"విన్నారా ఏమంటున్నాదో? చూసారా దాని సిగ్గుమాలినతనం? ఏ తల్లికైనా తన సొంత పిల్ల అలా మూర్ఛపడిపోతే భోజనం కావాలనిపిస్తుందా?" అని జానకి కూడా దుఃఖించిందని అందరూ చెప్పుకున్నారు.

"నిజంగానా?" అని అది విని ధర్మాంబాళ్ నోరాడక నిలబడిపోయింది. రూపవతిగా పెళ్ళికి వెళ్ళిన నందిని, అక్కడనుంచి బయలుదేరే సమయంలో పూర్తిగా మారిపోయింది; మనసూ మారిపోయిందేమో? ఒకరోజు "మామీ ఎక్కడ?" అని తల్లిని అడిగినప్పుడు జానకి "ఇక్కడ మామీ లేదు, గీమీ లేదు! నీకింకా బుద్ధి రాలేదా?" అని చివాట్లు పెట్టిందట; నందినికూడా మామీగురించి వెనకేసుకొని మారుమాటేం అనకుండా ఊరుకుందట.

ఆ రోజే శర్మ దంపతులు వేరే రైలు ప్రయాణంలో తిరిగివచ్చారు. ధర్మాంబాళ్ మనసు శోచనీయమైపోయింది. ఇంతకుముందే ఆవిడకి బయటకి వెళ్ళి నలుగురితో కలుసుకొని కబుర్లు చెప్పుకొనే అలవాటు తక్కువ. ఇప్పుడు వీధిలో తలవంగి నడవడానికికూడా మనసు రాలేదు. శని భగవంతుడు బాలగణపతిని తలెత్తి చూడలేదన్నట్టు[3] ధర్మాంబాళ్ పిల్లలని చూడడానికి వెనుకాడింది; పెద్దలని చూసి తిరుగుపడింది.

---

[3]పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు వినాయకుడు జన్మించాడు. అప్పుడు సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు మునులు కనులార చూసి దీవెనలు అందించి పార్వతీ దేవికి మోదం కలిగించారు. శనిభగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి ఆ బాలగణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శననీశ్వరుడి సదుద్దేశం తెలుసుకోలేక, పార్వతీ దేవి తనకుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది.

నందినికూడా - తన తల్లి ఆజ్ఞకి లొంగి కాబోలు - శర్మగారిల్లు రావడం ఆపుకుంది.

"'అక్కడకి వెళ్ళావంటే నీ కాళ్ళు విరగ్గొడతాను!' అని వాళ్ళ అమ్మ అన్నారేమో, ఎవరికి తెలుసు?భగవంతుడు నందినికి ఒక కన్ను పొగొట్టాడు, దానికి మనిద్దరమే కారణం! వాళ్లు తల్లిదండ్రులు - కొట్టినా, తిట్టినా, ఋుగ్రపగలగొట్టినా, ఎవరూ ఏమీ అనరు!" అని నవ్వుతూ శర్మ భార్యకి చెప్పారు.

నందిని అనుభవించిన కష్టాలకి - జ్వరం, మశూచికం, కన్ను పోవడం - వీటికి శర్మ దంపతులు బాధ్యతులా? అలాగైతే వాటి నివారణకూడా వాళ్ళకి సాధ్యమై ఉండాలే?

వాళ్ళు నేరం చేసారా? అలాగే కానీ! కాని అందుకోసం ధర్మాంబాళ్ ఎందుకు వ్యసనపడాలి? అసలు శర్మగారుకదా పెళ్ళికి నందినితో వెళ్ళాలనే ఆలోచన ఎదురుపెట్టారు?

ధర్మాంబాళ్, ఒక ఆడ జన్మ. ఆవిడకి సంతాన ప్రాప్తి లేదు, కాని మాతృ హృదయం ఉంది. ఒక రోజు నందిని అన్నయ్య క సెలులాయిడ్ బొమ్మని శర్మగారి ఇంటిలో వదిలేసి పారిపోయాడు. "ఆ రోజు దాని ముక్కు సొట్టపోయిందని నేను నందినిని నొచ్చుకున్నానే?" అని గుర్తుచేసుకొని ధర్మాంభాళ్ బాధపడింది. 'ఇప్పుడు నందినికి ఒక కన్ను పోయిందే, ఎంత ఘోరం!" అని అంగలార్చుకుంది.

ఇదే తలపులో తనే తప్పు చేసానన్న వ్యసనంలో ధర్మాంబాళ్ క్రమేణ రోజులు గడిపింది.

నందినితో పరిచయం కలిగేముందు ఆవిడ జీవితంలో రవంత మినుకు లేదు; ఇప్పుడు ఆ బంధం పోయిన తరువాత కూడా అదే గతి.

ధర్మాంబాళ్ నందినిని ఒక యువతిగా కల్పన చేసుకుంది.

నందినికి పెళ్ళికాలేదు. అందరూ ఆమెని శపించుతున్నారు. ఆ దృశ్యంలో ధర్మాంబాళ్ కూడా ఆమెను తిట్టుతోంది!

'ఆఖరికి అంతా శూన్యమయం!' అని వాపోతూ ధర్మాంబాళ్ కన్నుమూసింది.

ఆవిడ చేరుకున్నది స్వర్గమా?

---

శర్మ తన ఆస్తి, సంపదలన్నీ నందిని పేరుకి రాసిపెట్టారు. కాని తనకీ, తన భార్యకీ కలిగిన అపవాదం హిమాలయ పర్వతంలాగ శాశ్వతంగా నిలిచిపోయిందని అతను గ్రహించారు.

ప్రేమానురాగాలతో శర్మ దంపతులు నందినిని పోషించినా, ఆఖరికి ఆమెకు ఒక కన్ను పోయింది; ఇప్పుడు శర్మగారు తన జీవితంకి శోభా, మెఱుగూ ఇచ్చే భార్య ధర్మాంబాళ్ పోగొట్టుకున్నారు. మానసిక వ్యధ కదా ఆవిడని అకాలంలో మింగేసింది?

ఆ తపన శర్మగారి నిశ్చల హృదయంలో అలాగే నిలిచిపోయింది.

********

**(మూల రచన: స్వదేశమిత్రన్, అక్టోంబర్ 22, 1950)**

# ఊహ రుజువైంది!

"ఏమ్మా, బాగున్నావా?" అని ఆ పెద్దాయన నన్ను అడిగారు.

ఎదురుచూడని అతని ప్రశ్న నాకు వింతగా తోచింది. మాటవాసికి "హూం, బాగానే ఉన్నాను," అని అన్నాను.

"ఆయన నీ భర్త కాబోలు . . . మీరు ఇక్కడే ఉంటున్నారా?" అని ఇంకొక ప్రశ్న.

"మేం సెలవులకి ఇక్కడ వచ్చాం. చెన్నపట్ణంలో ఉంటున్నాం. ఇప్పుడు . . . "

మరేమనాలో తెలియక నేను తికమకలాడుతుంటే అతను గభీమని "ఏమ్మా, అసలు నేనెవరని నీకు తెలిసిందా?" అని అడిగేసారు.

కొంచెం లజ్జతో "మిమ్మల్ని చూసిన జ్ఞాపకం ఉంది, కాని ఎవరని గుర్తుపట్టలేకున్నాను" అని నేనూ చెప్పేసాను.

"ఓ అలాగా? . . . సరే, ఇక సెలవు తీసుకుంటానమ్మా!" అని అంటూ అతను గబగబమని మమ్మల్ని దాటుకొని వేగంగా నడిచి వెళ్ళిపోయారు. అతని మానసిక బాధ నాకు అతని హీన స్వరంలో అర్థమైంది; అతని చూపు మావారిమీద పడడం గమనించాను. నేను అతన్ని పోల్చుకోలేదన్న బాధని అతను నా భర్తకి చెప్తున్నట్టు తోచింది; నాకూ కొంచెం సిగ్గు కలిగింది.

ఎదురుచూడక, ముఖాముఖిగా మేమిద్దరం కలుసుకున్నతరువాత మామధ్య ఏర్పడిన ఈ అగాధం మెల్లమెల్లగా విశాలమవుతూ పరుగెత్తినట్టు నా మనసుకూడా హుటాహుటిగా ముందుకు సాగింది. త్వరగా వెళ్తున్న రైలుబండిలో కూర్చొని, ఎదుటదిశనుంచి, పక్కవాటుగా వస్తున్న రైలుబండిని చూస్తే ఏర్పడే సంచలనం నాలో ఇప్పుడు చోటుచేసుకుంది.

ఒక క్షణం నేను గాబరాలో పడిపోయాను, కాని నడుస్తూనేవున్నాను. అకస్మాత్తుగా, చెయిలూపుతన్న మావారి చెయి నామీద పడగానే నేను అతన్ని చూసాను; అతనూ ఒక చిరునవ్వు నవ్వారు.

"పాపం, అతను ఏమనుకున్నారో? 'గుర్తుపట్టలేకున్నాను!' అని అనేసాను! కాని తప్పకుండా అతన్ని ఎక్కడో చూసిట్టుంది! అతను ఎంత శ్రద్ధతో నాగురించి అడిగారు! 'తెలియలేదు!' అనగానే అతని మొహం ఎలా ముడుచుకుంది! నేనుగాని 'నాకు గుర్తుంది' అని చెప్పివుంటే . . ."

నా మనసులో ఇలాంటి ఆలోచనలు లేచాయి; నా మొహంలో కూడా ఏమో సూచనలు కనిపించాయేమో?

"మనం కొండమీద కొలువున్న వినాయకుడిని దర్శనం చేసుకున్నాం, ఆహ్లాదించాం. నీకేమో ఇప్పుడు నిజంగానే ఒక బొజ్జ గణపతిని చూసిన తరువాత ఆ ఉత్సాహమంతా మాయమైపోయినట్టుందే?" అని మావారు నన్ను ఎగతాళి చేసారు.

"అతను ఎవరో నాకు సరిగ్గా తెలీదు. కాని ఎక్కడో చూసివున్నాను. తెలీదని ఎందుకు అన్నానని బాధగావుంది" అన్నాను. నల్ల ఛాయలో, పుష్టిగా కనిపించే ఆ పెద్దాయనని బొజ్జ గణపతి అని ఇతను ఎందుకు పిలవాలని నాకు కోపమూ వచ్చింది. నేను ఆయనగురించి అంగలార్చుకుంటుంటే ఎందుకీ ఉడికింపు?

"'నాకు తెలుసు!' అని చెప్పడం సులభం. కాని మన మొహం చూసి కొంతమంది నిజమేమిటో తెలుసుకుంటారు!"

"అతనుగాని 'నేనెవరు, చెప్పు చూద్దాం!' అని అడిగితే మన గతి? ఎంత అవమానం! ఎందుకు అబద్ధం చెప్పాలి? ఇలాంటి సమయాల్లో జనులు తికమకలు పడడం మామూలే. నిజం చెప్పడమే మంచిది!" అని నిదానంగా మావారు చెప్పుతూ వచ్చారు.

అతని మాటలు నన్ను ఓదార్చాయి. నేనిచ్చిన ప్రత్యుత్తరం సరే అని నాకనిపించింది.

"అవును," అని మాత్రం చెప్పి నేను ఊరుకున్నాను. ప్రపంచంలో చాలామందికి ఇటువంటి అనుభవాలు సహజం; ఆ పెద్దాయన నాగురించి పొరబాటు పడరని నాలో చెప్పుకున్నాను.

తిరుచ్చి కొండశిఖరం, ఆ చుట్టుపక్కల ముచ్చటలు చూసి మా పిన్ని ఇంటికి వెళ్ళే మార్గంలో జరిగిన ఈ చిన్న ఘటన పిన్ని ఇల్లు చేరిన తరువాతకూడా నా మనసులో ఒక కొండలాగ స్థిరపడిపోయింది. 'ఎవరా పెద్దాయన?' అనే నా మనోవ్యధ పిన్నికి చెప్పాలనిపించింది; కాని చెప్పడానికి బాధగానూ ఉంది.

పిన్ని ఇంటికి మేం వచ్చి ఒక గంట అయింది; నాలో ఏర్పడిన కలవరం కొంచెం తగ్గినట్టు తోచింది.

"అమ్మా, నాకూ బాలాకీ భక్షణాలు ఇవ్వు; కడుపు ఆకలేస్తుంది!" అని మొరపెడుతూ పిన్ని కూతురు పరుగెత్తుకొని వచ్చింది.

"ఏమే, ఉమా . . . నీ అక్కయ్య వచ్చాను, చూసావా? ఎక్కడకి వెళ్ళావ్? ఇవాళ స్కూలుకూడా లేదే? . . ." అని దాన్ని ఆతురతో అడిగాను; వెంటవచ్చిన ఆ పిల్లని చూసాను.

"ఆకలి అని అంటే చాలదా? కడుపుకే ఆకలి వేస్తుంది, వీపుకి కాదు!" అని పిన్ని కూతురుని ముద్దుగా మందలించింది.

"పిన్నీ, 'అకలి' అనగానే 'ఓ, నీ వీపుకి అకలేస్తుందా? ఇలా రా, రెండు వాయించుతాను!' అని చెప్పే అవ్వలూ, సవతి తల్లులు ఉన్నారు!" అని నవ్వుతూ నేను మా సంభాషణ ఆరంభించాను.

'మరేం అనవద్దు!' అని పిన్ని కన్ను నాకు సైగ చేసింది. నేను ఊరుకున్నాను.

పిన్ని అల్మారా తెరిచి పిల్లలకి తినుబండారాలిచ్చింది. ఇద్దరూ వాకిలికి నడిచి వెళ్ళారు.

"ఆ పిల్ల . . ." అని నేను ఆరంభించాను.

"పిన్నీ, ఆ పిల్ల గురించి అడగాలనుకున్నాను. ఎక్కడో చూసిన మొహంలాగుందే?"

"అదే చెప్పాలనుకున్నాను. ఆ పిల్ల తన నాన్నగారుతో లాల్గుడినుంచి వచ్చింది. అతనెవరో తెలుసా? . . . నువ్వూ చూసివున్నావ్ . . . మూడు సంవత్సరాలముందు నా మరిది పెళ్ళిలో . . . "

పిన్ని ఇంకా చెప్తూనే ఉంది; నేను గభీమని తుళ్ళిపడ్డాను.

“అయ్యయ్యో! పాపం . . . పిన్నీ, అతన్నే నేను ఇవాళ దారిలో చూసాను, ఎవరని గుర్తుపట్టలేక పోయాను!” అని నా మనోవ్యధని పిన్నికి మనసార వివరించి చెప్పాను.

“ఆ పెళ్ళి గొడవలో నేను నుయ్యిదగ్గర జారి పడిపోయాను. ఆ దెబ్బతో నా నుదుట ఉబ్బిపోయింది. ఆ పెద్దాయనే శ్రద్ధతో నన్ను బాగా చూసుకున్నారు. అతన్ని మరచిపోయానే, పిన్ని? పాపం, అందుకే అతను చాలా బాధపడ్డారు!” అని బాహటంగా నేను అంగలార్చుకున్నాను.

“పిన్నీ, నాకు జ్ఞాపకం ఉంది. అప్పుడు ఈ పిల్ల చాలా చిన్నది; వాళ్ళ అమ్మ జబ్బుతో మంచమెక్కింది. ఇతనే కూతుర్ని ఎప్పుడూ చూసుకునేవారు. ఇప్పుడు ఆ తల్లికెలావుంది?” అని అడిగాను.

“అదే నేను చెప్పడానికి వచ్చాను. ఆ తల్లి కన్నుమూసి ఒక సంవత్సరమైంది; అతనికి కొత్త పెళ్ళాం వచ్చి రెండు మాసాలయింది!”

నేను ఉలికిపడ్డాను. “ఓ, అలాగా? పాపం . . . ” అన్నాను. కాని నా మనసులోని ఆందోళన ఎలా వర్ణించడం?

‘ఆహా, ఎటువంటి మనిషి! ఒక స్త్రీ జీవితంని బలితీసుకున్న మనిషి! ఆ రోజు నా గాయం మాన్పడానికి గొప్పగా వచ్చారే, ఇప్పుడు ఒక పడుచు హృదయంలో ఎన్నటికీ మానని దెబ్బ తెచ్చిబెట్టారు! ఎంత ఘోరం! ఇతని మనసుకి బాధకలిగించినందుకు నేను వాపోయాను; ఇప్పుడు ఆ రెండో భార్య మనోవ్యధ ఎలాగుందో ఎవరికి తెలుసు?’ అని నా మనసులో నిరుత్సాహం చోటుచేసుకుంది.

“కొత్త పెళ్ళాం ఇప్పుడేగా వచ్చింది? తన పెత్తనం ఇంకా చెలాయించలేదు! ఈ పిల్లని - బాలాని - ఇంతవరకూ బాగానే చూసుకుంటోంది అని అంటున్నారు. చూడు, ఇంకా కొన్నిరోజుల్లో దాని కష్టాలు ఆరంభమౌతాయి!” అని పిన్ని అన్నప్పుడు నేను ఏకీభవించాను.

“అవును. పిల్లల సౌఖ్యం గురించే ఈ రెండో పెళ్ళి చేసుకోవడం, అందువలనే ఆ పిల్లలకి అన్ని కష్టాలూ!” అని నేనూ పాట పాడాను. నాకు బాలామీద జాలి కలిగింది; అసలు నా కోపమంతా అతనిమీదనే.

ఆ పెద్దాయన పిన్ని ఇంట్లోనే ఉంటున్నారని, రాత్రి భోజనంకి వస్తారని పిన్ని చెప్పింది. ఇంతకుముందు అతన్ని చూస్తే క్షమాపణ కోరాలని నా మనసు తపించిపోయింది. ఇప్పుడో? ‘రానీ, అతన్ని బాగా చీదరగొట్టాలి!’ అనే ఆకాంక్ష నాలో చోటుచేసుకుంది.

మంచి వేళ! అతన్ని మేం చూడనూలేదు, నేను అతనితో మాటాడనూలేదు! అతను ఆ రాత్రి రావడానికి ముందే మేం అక్కడనుంచి బయలుదేరి మా ఆయన మరిదింటికి వచ్చేసాం. ఆ రాత్రి మా మదురై ప్రయాణం. మేం అనుకున్నట్టే పిన్నిని కలుసుకోవాలనే మా ఉద్దేశం నెరవేరిందని సంతోషించాం.

శెలవులు ముగించి చెన్నపట్ణం తిరిగివచ్చిన తరువాత తిరుచ్చిలోని ఆ చిన్న ఘటన వలన ఏర్పడిన ఆందోళన - అదేం అంత గొప్పగా కనిపించకపోయినా - నేను దాన్ని మరిచిపోలేదు. క్రమంగా ఆ పెద్దాయన జ్ఞాపకంతో వచ్చిన కోపం తగ్గుతూ వచ్చింది, కాని అతని రెండవ భార్యమీద నాకున్న జాలి పెరుగుతూనేవుంది. రమణీయమైన మగవాడికి నేను మొదటి భార్యగా వచ్చిచేరాను; అతను మరే ఏ స్త్రీన్ని పొగడినా లేక ఆమెపై కొంచెం అభిమానం చూపినా నాకు అసూయ. ‘రెండో భార్య స్థితిలో వున్న స్త్రీ మనసు తన భర్త మొదటి భార్య సంబంధం గురించి ఎలా బాధపడుతుంది, ఎలా భరించుతుంది?’ అనే పరిశోధనలు నాకు అలవాటే. ‘అవును, అది చాలా శోచనీయం! అది వాళ్ళ ప్రారబ్ధం! ఇతరులకి అదెలా బోధపడుతుంది!’? అని నాలో వేదనపడేదాన్ని.

అలాంటప్పుడు బొజ్జ గణపతి రూపంలో కనిపించే మనిషికి రెండవ భార్యగా వచ్చిచేరిన స్త్రీగురించి నేనెలా ఆలోచించక ఊరుకుంటాను? నా మనసులో సానుభూతి ఆ రెండవ భార్యకే!

మాసాలు గడిచాయి. మేం చెన్నపట్టంనుంచి ఇండోర్ వచ్చేసాం. మేం కొనియాడిన, తమిళ కళలకి, సంస్కృతికి పేరుపోయిన చెన్నపట్టం వదిలిరావడం నాకు బాధగా తోచింది. అందువలనే తమిళ దేశంతో సంబంధం ఉత్తరాల మూలంగా ఎడతెగకుండా సాగించాను.

పిన్ని నాకొక ఉత్తరంలో "ఆ పెద్దాయన బొంబాయి చుట్టుపక్కలకి వెళ్లిపోయారట; అతని కుటుంబం, అతనూ ఇప్పుడెక్కడ ఉన్నారని నాకు తెలియదు!" అని రాసింది.

"ఆ సవతి తల్లి మంచి గుణవతి కాబోలు! ఆ పిల్ల బాలాని ఇక్కడున్నంత కాలమూ బాగానే చూసుకుందని విన్నాను" అని ఆ ఉత్తరంలో చదవగానే నాకా సందేశం ఒక సవాలుగా కనిపించింది; 'ఇదెలా సాధ్యం?' అని ఆశ్చర్యమూ కలిగింది. చాలాసేపు ఆలోచించి అందులో సారాంశం ఏమిటో నిశ్చయించుకున్నాను.

'అవును మరి! ఆమె అతని రెండో భార్యకదా? నోరెత్తక రోజులు గడపాల్సిందే! తన దురదృష్టం గుర్తుచేసుకొని రెండో భార్యగా జీవించాలని ఒప్పుకున్న స్త్రీకి మరేం సాధ్యం? ఏమైనా సరే, నోరు మూసుకొనే ఉంటుంది!' అని నాలో చెప్పుకున్నాను.

నాకున్న కోపమంతా మొదటి భార్య పోయిన ఒక సంవత్సరంలోనే కొత్త ఇల్లాలుని ఎంచుకున్న ఆ అసంతుష్ట భర్తమీదనే!

** ** **

రోజులు గడిచాయి. కాలగతిలో మాసాలు గతించి పోయాయి; నేను మళ్ళీ తమిళదేశంకి రైలుబండిలో ప్రయాణం చేస్తున్నాను. నాకు తోడుగా నాకు తెలిసిన ఇంకొక తమిళ కుటుంబంకూడా వస్తున్నారు. ఆ తరువాత చాలా తమిళ స్త్రీలు మా కంపార్టుమెంటులో నాకు పరిచయమయ్యారు.

ఒక తమిళ పత్రికలో నేనొక కథ చదివాను; నా మనసు కరిగిపోయింది. రెండో భార్యగా ఒక యువతి పడే బాధలని చెప్పే కథ అది. అచేతనమైన బండిరాయికికూడా జాలి పుట్టేటట్టు అదెవరో రాసిపెట్టారు.

నా పక్కన కూర్చున్న స్త్రీకి అది అందించి "ఇది చదివిచూడండి" అని అన్నాను. నేను చదివి శ్లాఘించిన కథ ఇతరులు చదివి ఆనందించాలని నా వాంఛ; అదే కారణం.

"చాలా శోచనీయమైన కథ. ఒక్కొక్క సవతి తల్లి ఇలాగే ఏడుస్తూవుంటుంది!" అని అంటూ దాన్ని చదవమని ప్రోత్సాహించాను.

ఆవిడ శాంతంగా అది చదవడం ఆరంభించారు; చదివినతరువాత శాంతంగానే నా పక్క తిరిగిచూసారు.

"నేనూ ఒక సవతి తల్లే; నాకలాంటి ఉద్దేశం లేదు!" అన్నారు ఆవిడ.

"ఏమంటున్నారు?" ఇని నేను విస్తుబోయాను; నా దిగులు తీర్చే విధంగా ఆవిడ నాకు అన్నీ వివరించారు.

ఆ 'పెద్దాయన' భార్యే ఈ స్త్రీ. ఆ చిన్న పిల్ల – ఆ రోజు పిన్ని ఇంటిలో నన్ను ఆకర్షించిన అదే పిల్ల – ఈవిడనీ ఆకర్షిందట. అతను ఇష్టపడకపోయినా, అతన్నే పెళ్ళి చేసుకోవాలని, అ పిల్లకి తల్లి అనే అంతస్తు తనకి కావాలని ఆవిడ ఆశించింది. ఆ మాటలు వింటూంటే ఆవిడ ఉదాత్త భావాలని నేను నా మనసులో అభినందించాను.

"అతనిలాటి భర్త ఎవరూ ఉండరు!" అని ఆవిడ అనగానే అతన్నికూడా నా మనసు కొనియాడింది.

ఎది ఏమైనా సవతి తల్లి అంటే ఒక స్త్రీకి ఆదొక లోపంగా కనిపించదా? అటువంటి ఒక స్త్రీ భర్తని ఇలా అత్యంతంగా పొగడుతున్నాదంటే అతను నిజంగానే ఎంత శ్రేష్టమైన భర్త అయివుండాలి! అవును, అప్పుడు నాకలాగే తోచింది. కాని 'సవతితల్లి అనే తక్కువపాటు ఆమెలో తప్పక ఉండి తీరాలి!' అని నేను దృఢంగా నమ్మాను.

"జీవితంలోని ఘటనలే కథలుగా మనకి పరిచయమవుతున్నాయి. కథలోలాగే జీవితంలోనూ కొత్తమార్పులూ, అద్భుతాలు సాధ్యమని నాకు తెలిసింది" అని అన్నాను. ఆ తరువాత, మెల్లగా, "తన భర్త ఇంతకుముందు ఇంకొక స్త్రీతో కాపురం చేసాడన్న నిజాన్నిగుర్తించడం అంత సులభమంటారా? నాకది చాలా అశ్చర్యంగా ఉంది" అని నా అనుమానం తెలియజేసాను.

“అత్యంత ప్రేమవలనే ఆ అసూయ! అటువంటి ప్రేమ – దాన్ని పోషించే స్త్రీ మనసు – అతన్నీ మక్కువతో చూస్తుంది. తన భర్త అనే అనురాగంతో తన మనసుని, తన ప్రేమని అతనిపట్ల నిరూపించుకుంటుంది.”

ఆవిడ ప్రత్యుత్తరం – అదొక దేవత ఇచ్చే సందేశంలాగ - నన్ను తాకి పరవశపరిచింది; నేను నా పరవశత్వం ఆవిడకి నిష్కటంగా చెప్పేసాను.

ఆ రాత్రి నేను నిద్రపోయినప్పుడు - అందుకు ముందూ, ఆ తరువాతకూడా – నా ఆలోచనలన్నీ ఆ స్త్రీ, ఆవిడ ఆదర్శ భర్తగురించే.

ఆ మరుదినం చెన్నై చేరుకున్నప్పుడు మేమందరం మా మా పనుల్లో మునిగి ఉన్నాం. ఆ స్త్రీ నా దగ్గరకి వచ్చి ఒక కవరుని నా చెయిలోకి తోసి “దీన్ని జాగ్రత్తంగా ఉంచుకో!” అని అంటూ తన మూటాముల్లెతో రైలుబండినుంచి దిగారు. ఆ తరువాత ఆ పొడపైన సెంట్రల్ స్టేషన్ ప్లాట్ ఫారంలోని జనంతో కలిసి ఆవిడ మాయమైపోయారు.

“నేను దేవతను కాను! ఇంకా చెప్పాలంటే స్త్రీ రూపంలో కనిపించే ఒక దెయ్యం అనవచ్చు! నేనొక వితంతువు!”

నా కళ్ళు గిర్రుమని తిరిగాయి. మరేం చదవడానికి నాకు త్రాణ లేదు. టాక్సీలో వెళ్తున్నప్పుడు దాని వేగంతోపాటు తొందర తొందరగా ఆ ఉత్తరం చదివాను.

‘పాపం, పెళ్ళైన రెండు మాసాల్లో ఆవిడ వితంతువుగా ఐపోయారు! ఆవిడ పెళ్ళికి సమ్మతించినా ఆయన ఏకీభవించాలా? ఇరపై ఏళ్ళ యువతిని పెళ్ళి చేసుకోవాలని అతనికి – ఆ సగం ముసలాడికి – మనసెలా వచ్చిందో?’ ఇలా ఆలోచిస్తూ వితంతువు అనే పేరు వెనుక ఉన్న ఘోరం గురించి నేను ఆలోచించాను.

గభీమని నా ఆలోచన కూలిపోయింది.

ఇది నేను ఎదురుచూడని సంగతి . . . అవును, ఆవిడ ఒక వితంతువు అని నేను నమ్మలేకున్నాను . . .

అసలు ఆవిడని చూస్తే అలాగ అనిపించలేదు; ఎవరికీ ఎటువంటి అనుమానమూ రాదు . . .

అవును, అదే కారణం.

నా మనసు కుదుటపడింది.  ఒక క్షణంలో ఆవిడని వితంతుత్వం తాకనేలేదన తలపే నాకు ఊఅటగావుంది కాబోలు . . . మరేం కారణం ఉందా?

ఉత్తరంలో ఆవిడ ఇంకా ఏమేమో రాసివున్నారని జ్ఞాపకం వచ్చింది; తీసి చదివాను.

"కాని, నేను నీకు నిజం చెప్పలేదు. నువ్వు నాపట్ల చూపిన సానుభూతి, మర్యాద వలన నీదగ్గర ఏదీ దాచడానికి నాకిష్టం లేదు. పక్కనే చాలామంది ఉన్నారనే కారణంవలనే నేను నిజం దాచాను. ఇప్పుడు నీకుమాత్రం చెప్తున్నాను.

ఇప్పుడు నా భర్త లేరు. అతని కూతురూ నా సంరక్షణలో లేదు. ఆమె ఏదో అనాధాశ్రమంలో ఉంది.

నేను అతని రెండో భార్య. కాని అతను నన్ను పెళ్ళిచేసుకొని నాకు మంచిదే చేసారు. నాకు జీవితంలో సౌఖ్యమో, చెయిలో ధనమో లేదని తెలిసే అతను నన్ను ఎంచుకున్నారు. నాపట్ల ఎవరూ జాలి, సానుభూతి చూపకూడదని, నాగురించి ఎవరికీ ఏమీ తెలియకుండా నన్ను కాపాడారు. నేను అతనితో స్వల్పకాలమే కాపురం చేసాను. కాని ఆ తరువాత నేను ఎటువంటి బాధా లేకుండా కాలం గడపాలని నాకన్ని వసతులు చేసిపెట్టారు. చెయిలో డబ్బులేక, అనాధగావున్న నన్ను పెళ్ళిచేసుకొని నా పరువు కాపాడారు. ఇప్పుడు నేను మళ్ళీ వితంతువు, కాని ఈ నడుమనున్నకాలంలో అతనిచ్చిన తాలిబొట్టు, పసుపు, కుంకుమం, నాకిప్పుడు సంపదగా దోహదం చేస్తున్నాయి.

అవును. నేను అతనికి రెండో భార్య. కాని, అతనూ నాకు రెండో భర్త. ఆ సత్యం అతనికి మాత్రం తెలుసు. అది తెలిసే అతను విశాల హృదయంతో నన్ను అంగీకరించారు."

ఈ ముగింపు విని నేను ఉలికిపడ్డాను. నేను వెళ్తున్న టాక్సీ మంచి రహదారిలో ప్రయాణం చేస్తోంది. కాని అది ఏదో కొండ శిఖరంనుంచి దొర్లుతున్నట్టు నాకు హడలెత్తింది.

ఆ రోజు కొండమీద వెలసిన వినాయకుడిని దర్శనం చేసుకొని వచ్చే తోవలో నన్ను చూడగానే సానుభూతితో యోగక్షేమం అడిగిన అతని దృశ్యం నాకు జ్ఞాపకంలో వచ్చింది.

అతని చూపు, ప్రశ్న, మనోవ్యధ, అతని కళ్ళలో నాకు కనిపించిన సంతాపం: ఇవన్నీ అతన్ని పుటం వేసిన బంగారంలాంటి మనిషిగా చూపాయి.

మనకి ఒకరిగురించి వేరే వేరే సందర్భాల్లో వేరే వేరే అభిప్రాయాలు కలుగుతాయి. కాని మొట్టమొదటి అబిప్రాయమే ఆఖరికి స్థిరంగా మనసులో నిలబడుతుంది.

నిలకడలేని పాదరసం పరిశుద్ధమైన బంగారం స్వరూపం మార్చుతుంది; కాని దానికీ పరిహారం ఉందికదా? అలాగే చంచలమైన నా మనసు దృఢమైన, బంగారంలాంటి అభిప్రాయాన్ని మార్చేసింది. మొట్టమొదట ఆ పెద్దాయన నా గాయం స్వస్థపరచడానికి వచ్చినప్పుడు నాకు అతనిపట్లవున్న ఉన్నత అభిప్రాయంలో ఎన్నో మార్పులు వచ్చేసాయి. ఆఖరికి, ఇన్నిరోజులతరువాత నాకూ పరిహారం దొరికింది!

బంగారం పోగొట్టుకోవాలని ఎవరైనా ఇష్టపడతారా? మన ఆదర్శ భావనలు ఎవరైనా పాడుచేస్తే మనం ఊరుకుంటామా? మంచివేళ, నా ఊహ రుజువైంది! బంగారంలాంటి నా అభిప్రాయం నాకు దక్కింది!

********

(మూలం ప్రచురణ సుదేశమిత్రన్, సెప్టెంబర్ 19,1948)

# అపరాధ భావం

"పీప్పింగ్ . . . పీప్పింగ్ . . . పీప్పింగ్ . . ."

పిల్లవాడు రమణి ఎడతెగకుండా ఈల వాయించుతున్నాడు.

"ఏ, రమణి! ఎంత సేపూ ఇదేం గొడవరా? చెవులు ఏమౌతాయి?" అని తల్లి బుద్ధిచెప్పింది. కాని వాడు వింటేనా? ఏమీ లెక్కచేయక, వసారాలో కూర్చొని ఆగకుండా వాడి ఈల వాద్యం సాగుతోంది.

"నాన్నగారు రానీ, నిన్ను బాదుతారు!" అని హెచ్చరికతో ఆమె అన్న మాటలు తండ్రి ఇంట్లోకి ప్రవేశించినప్పుడుకూడా వాడు వినలేదు.

తను వింటూన్న ధ్వనులూ, స్వరాలూ ఎన్ని రకాలు! పిల్లవాడి మనసంతా ఆ కొత్తదనంలో లీనమైపోయింది; అది ఎంత సంతోషంగా ఉంది!

ఆఖరికి "ఒరేయ్, బిగులు కొనేసావన్న మాట! డబ్బు తగలబెట్టడంమంటే ఇదే!" అని సంతానం తిట్టినతరువాతే వాడికి మెలకువ వచ్చింది.

"నేను కొనలేదు నాన్నగారూ! ఆ బలూనులమ్మే అతను ఇచ్చారు!" అని తటపటాయించుతూ జవాబు చెప్పినా నాన్నగారు తన్ను శిక్షించరు అనే నమ్మకమూ రమణికి కలిగింది.

"అలాగా? నువ్వేం డబ్బు పాడుచెయ్యలేదన్నమాట!" అని తృప్తితో మరేం అనక సంతానం ఊరుకున్నాడు; ఆ తరువాత ఆ ఈలగురించో, అది ఇచ్చిన మనిషిగురించో ఆ రోజు అతనేం అడగలేదు.

మరుదినం సంతానం ఇంటికి తిరిగివచ్చినప్పుడు రమణి రెండు పెద్ద రబ్బరు బలూనులు ఊది, వాటిని ఒక తాడుతో కట్టి ఇంట్లో బంతులాట ఆడుతున్నాడు. పెద్ద వీరుడులాగ వాడి ధ్యానమంతా తన ఆటమీదేవుంది. "ఏయ్ రమణి, ఇవికూడా ఆ అంగడివాడే ఇచ్చాడా లేకపోతే నువ్వే కొన్నావా?" అని సంతానం కేకలుపెట్టాడు.

“ఇవీ అతనే ఇచ్చారు, అతనికి నేనంటే చాలా ఇష్టం, నాన్నగారూ! అమ్మకీ రెండు అలుమినియం గెరిటలు ఇచ్చారు!” అని పిల్లవాడు చెప్పాడు; వాడి చూపంతా ఆ బుడగలమీదేనుంది.

“ఏంటి?” అన్నాడు సంతానం. ‘అమ్మకి కూడానా? అతనికి అమ్మంటేకూడా ఇష్టమా?’ అని అడగాలని తోచింది. కాని, మంచివేళ, ఆ మాటలు అతని నోటినుంచి రాలేదు; కాని అలాగ అడగాలనే సూచనలు అతని మొహంలో కనిపించాయి.

అప్పుడే సమయానికి తగినట్టుగా వంటగదినుంచి అతని భార్య సరస్వతి వచ్చింది. నవ్వుతూ,“బాగుంది! నాన్నగారికి అన్ని సంగతులూ చెప్పాలని పిల్లవాడికి ఎంత తొందర!” అని పిల్లవాడిని మందలించి, భర్తను చూసింది.

“చూడండి, ఈ మధ్యాహ్నం ఆ అంగడివాడు వీడిదగ్గర రెండు అలుమినియ గెరిటాలు నాకు పంపిచాడు!” అని ఆమె అంటూంటే సంతానం “నువ్వూ సరే అని వెంటనే వాటిని కాజేసావా?” అని మండిపడ్డాడు.

“అబ్బా! మీరూ అబ్బాయిలాగే తొందరపడుతున్నారు! రమణి గెరిటలు తెచ్చినవెంటనే ‘ధర తెలియలేదు, అతన్ని అడుగు!’ అని వాడ్ని తిరిగి పంపించాను. అందుకు అతను ‘గెరిటలు నల్లబాఱకుండావున్నాయో? అని వాటిని వాడిన తరువాత చెప్పండి, ధర చెప్తాను,’ అని అన్నాడట. నేను నిన్న మన ఇంటిముందు అలుమినియ గెరిటలు బేరంచేసి ఆఖరికి కొనలేదని అతను చూసాడు కాబోలు, అందుకే తనే పంపించాడనుకుంటాను. నిజాయితిగా, గెరిటలు సల్లబాఱకపోతేనే మనం డబ్బిల్లావలని అంటున్నాడు. కాని ఇలా నిజాయితిగా వ్యాపారం చేస్తే వాడికేం లాభం దొరుకుతుంది? రమణికి ఈలా, బుడగలు అన్నీ వెలలేకుండా ఇచ్చాడు; ఎందుకిలా చేస్తున్నాడో నాకు అర్థం కావటంలేదు!” అని చెప్పింది.

సంతానం నోరెత్తలేదు. కాని అతని మనసులో ‘ఇందులో ఏదో రహస్యముంది, కనిపెట్టాలి!’ అనే ఆలోచన మళ్ళీ మళ్ళీ లేచింది.

మరుదినం రమణితో సంతానం వీధి చివరన ఉన్న ఆ కొట్టుకి వెళ్ళాడు. ఆ అంగడివాడిని చూడగానే ఎందుకో అతనొక అమాయకుడు, కపటం ఎరుగనివాడు అని తోచింది. అతను తొడుక్కున్న సామాన్య దుస్తులూ, అతనిలో కనిపించే అణకువ, వినయం చూసినతరువాత సంతానంకి అతనిమీద మంచి అభిప్రాయం కలిగింది.

కాని తన పట్టుదల అంత త్వరంగా వదులుకోడానికి మనసు రాలేదు.

"ఏంవయ్యా, ఆ రెండు గరిటెల ధర ఎంత? బాగున్నాయట, మా ఆవిడ వాడేసింది!" అని కొంచెం అధికార ధ్వనిలో సంతానం అతనికి చెప్పాడు.

"ఇంకా రెండు రోజులు కానీయండి. ఆ తరువాత చెప్పండి," అని అన్నాడు అంగడివాడు.

సంతానం మరేం అనక తిరిగివచ్చేసాడు. కాని ఆ మరుదినం దీపాలకి వత్తులు కొనాలనే నెపంతో ఆ అంగడికి వెళ్ళినప్పుడు గరిటెలకి డబ్బు ఇవ్వాలని నిశ్చయించాడు.

"ఎందుకులెండి?" అని అంగడివాడు తడబడుతూ అడిగిన ప్రశ్న వినగానే సంతానం అతన్ని ఒకసారి రెప్ప వాల్చకుండా చూసాడు.

"ఏమిటయ్యా ఇది? నీకెందుకు డబ్బు తీసుకోడానికి సంకోచం? ఆ గరిటెలు మేం రెండురోజులు వాడేసాం! అవి విరిగిన తరువాతే నువ్వు డబ్బు తీసుకుంటావా? బాగుంది నీ నిజాయితీ! ఆ తరువాత డబ్బు ఇవ్వాలని మాకు మనసు రాదే! అది నీకు తెలుసా?" అని నవ్వుతూనే అడిగాడు.

"అసలు ఆ గరిటెలు అమ్మాలని నేను అబ్బాయిదగ్గర ఇవ్వలేదండి!" అని అంటూ అంగడివాడు నవ్వాడు.

"బాగుందయ్యా నీ వాలకం! ఇలాగేనా నువ్వు అందరితో వ్యాపారం చెయ్యడం?" అని సంతానం అడిగాడు.

"అందరికీ కాదండి. మీకు మాత్రం ఈ ఇనాం వ్యాపారం."

"ఓ, అలాగా?" అని అన్నాడు సంతానం; 'గరిటెలు నేను వాడే వస్తువులు కాదు!' అని చెప్పేయాలని అతను తొందరపడ్డాడు.

ఆ తరువాత రెండు మూడు సార్లు సంతానం ఏదో నెపంమీద ఆ అంగడికి వెళ్లి రావడం జరిగింది. ఆ మూడురోజులూ ఇంటిలో ఆ అంగడివాడిని ఎగతాళి చెయ్యడం, అతన్నిగురించి నిష్ఠూరంగా మాటాడం అతనికి అలవాటైపోయింది.

మూడోరోజు సంతానం అతన్ని చూసినప్పుడు "ఒకసారి మా ఇంటికి రావయ్యా" అని పిలిచాడు.

"తప్పకుండా వస్తానండి . . . ఇదిగో, షాపు మూయే సమయం వచ్చేసింది, వెళ్దాం!" అని అంటూ, ఆ తరువాత అతను సంతానం వెంట నడిచాడు.

ఇల్లు దగ్గరకి రాగానే అంగడివాడు "నేనూ అమ్మగారిని చూడాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను" అని అన్నాడు. కాని పరధ్యానంగా ఏవో మొండి ఆలోచనలలో మునిగితేలుతున్న సంతానం అదేం పట్టించుకోలేదు.

ఇంటి బయటనుంచే "ఏ సరస్వతి, ఇలాగ రా!" అని సంతానం భార్యని పిలిచాడు.

"'A సరస్వతి, B సరస్వతి, C సరస్వతి!'" అని రమణి రాగాలు పాడడం ఆరంభించాడు. "ఒరేయ్, ఊరుకో! నాన్నగారు ఎందుకో పిలుస్తున్నారు!" అని వాడిని మందలిస్తూ సరస్వతి వాకిలికి వచ్చింది.

భర్త పక్కన గోడ సమీపంలో నిలబడియున్న కొత్తమనిషిని చూసి సరస్వతి భర్తని ఏదో అడుగుతున్నట్టు తిరిగి చూసింది.

"ఇతనే ఆ అంగడికి . . . యజమాని!" అని ఈడ్చుతూ సంతానం అతన్ని పరిచయం చేసాడు.

తల వొంచి వినయంతో నిలబడిన మనిషిని సరస్వతి చూసింది. అదే సమయం అతనూ తలయెత్తి "అమ్మగారూ, మీకు నేనెవరని తెలిసిందా? . . . కాట్టుపుత్తూర్ చిన్నసామి . . ." అని అనగానే సరస్వతి ఆతురంగా "నువ్వు నటరాసు కదూ? చిన్నసామి అబ్బాయి?" అని అడిగి, భర్తికి చెప్పింది: "చూసారా? ఆఖరికి ఇతను మా

గ్రామంలోని మనిషి! ఇన్నిరోజులూ ఆ సంగతి తెలియనేలేదు!" అని ఉత్సాహంతో పలికి మళ్ళీ నటరాసుని తిరిగి చూసింది.

"ఏవయ్యా, నీకు నాగురించి ఇంకా గుర్తుందన్న మాట! ఇది నీ దుకాణం అని తెలీదే? నీ భార్యా, తల్లిదండ్రులు, అందరూ బాగున్నారా? వాళ్ళందరినీ వదిలేసి నువ్వు పట్నంకి వచ్చేసావన్నమాట! ఇక్కడ వ్యాపారం ఎలా సాగుతోంది? నాదగ్గర నువ్వు చూపే న్యాయం, నిజాయితీ అందరిదగ్గర చూపితే నువ్వు బతికేదెలాగ? ఈ రోజుల్లో అవన్నీ పనికిరావు! ఇది కలికాలం! మంచిరోజులు కావు!" అని అంది.

"అమ్మగారూ, మీ నాన్నగారు చేసిన ఉపకారంకి మేం చేసేది ఏ మూల? అయ్యగారికి నామీద కోపం - గరిటెలకి నేను డబ్బు తీసుకోలేదని. ఇదికూడా మీకు నేను జ్ఞాపకార్థంగా ఇవ్వకూడదా? నా కళ్ళముందు పెరిగిన పిల్ల మీరు; మీరు నన్ను మరిచిపోవచ్చు, మేం మరిచిపోం! మీకూ మామీద దయ కలగాలని, ఏదో నా మనసు తృప్తి పడాలని ఆ గరిటలు పంపించాను. మీ పెద్దాయన దయవలన మా కుటుంబం నిలదొక్కుకుంది. మాకెటువంటి కొఱతా లేదు!" అని ఆవేశంతో అతను మాటాడాడు.

"సరేలే, అందరికీ ఉపకారం చెయ్యాలనే మనసు భగవంతుడు మా నాన్నగారికి ఇచ్చాడు. ఇప్పుడుకూడా – ఈ ముసలితనంలో - అతను వసారాలో కూర్చొని నలుగురికి మంచిది చేస్తున్నారు. ఏదో చేస్తున్నారు, అదేం గొప్ప లేదులే! . . . కొంచెం కాచుకొని ఉండు, నేను ఇప్పుడే వస్తాను!" అని సరస్వతి ఇంట్లోకి వెళ్ళింది.

"నీకు అమ్మగారిని బాగా తెలుసన్నమాట! నాకది తెలియదు; నువ్వూ చెప్పలేదు!" అన్నాడు సంతానం నటరాసుని చూస్తూ.

"తెలుసునండి. అమ్మగారుకూడా నన్ను గుర్తుపట్టేసారు. నాకు చాలా సంతోషం!" అన్నాడు నటరాసు.

"నేను నిన్ను పోలికపట్టడం ఏం పెద్దపని కాదోయ్. నేను ఆ రోజుల్లో పరికిణి తొడుక్కున్న పిల్ల; ఇప్పుడు అమ్మగారుగా మారిపోయాను! నువ్వు నన్ను గుర్తు పట్టడమే చాలా ఆశ్చర్యం!" అని అంటూ సరస్వతి చెయిలో లోటాలో కాఫీతో వచ్చింది.

దాన్ని అతనికి అందిస్తూ "ముందు ఈ వేడి కాఫీ తాగు. ఆ రోజుల్లో వేసవికాలంలో నువ్వు నాకు చల్లగా తాటిముంజెలు ఇవ్వడం గుర్తుందా? నేను నీకు ఇస్తున్నది ఈ వేడి కాఫీయే!" అని చెప్పి నవ్వింది. ఆమె మాటల్లో తన బాల్యంలో ఆమె అనుభవించిన ముచ్చటలూ, ఆశలూ, వేడుకలూ, వాటిగురించి ఇంపైన జ్ఞాపకాలు చోటుచేసుకున్నాయి.

"అమ్మగారూ, ఎవరు ఎదిచ్చినా మన మనసుకి నచ్చితే చాలు! మీకు తాటిముంజెలు ఇష్టమంటే, మాకు ఈ కాఫీ ఇష్టం! తాటిముంజెలు మంచులాగుండాలంటే, కాఫీ వేడిగానే తాగాలి!" అని అంటూ నటరాసు భయ భక్తితో లోటాని అందుకున్నాడు.

"బాగుందోయ్, నీకన్నీ తెలుసు! పట్ణం వాసన వచ్చేసిందన్నమాట!" అని సరస్వతి నిగనిగమని నవ్వింది.

నటరాసు గోడకి వెనుక వెళ్ళి, కాఫీని చల్లార్చుకొని, తాగి, తిరిగివచ్చాడు. ఆ పాతరోజులగురించి చాలాసేపు జ్ఞాపకం గుర్తుచేసుకుంటూ, మళ్ళీ మళ్ళీ ఏమేమో మాటాలు చెప్పుకున్న తరువాత, అణకువతో దంపతులకి ఒక దండం పెట్టి, సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"మీ నాన్నగారు ఇతని కుటుంబంకి ఏం సహాయం చేసారు?" అని సంతానం సరస్వతిని అడిగాడు.

"అతని తండ్రి జబ్బుగా ఉన్నప్పుడు నాన్నగారు ఫీజు తీసుకోకుండా అతనికి చికిత్స చేసారు; అతనూ తేరుకున్నారు; నటరాసు స్కూల్లో చదవడానికి సాయం చేసారు; ఇంకా ఏవేవో చిల్లర విషయాల్లో చేదోడు చేసారు . . . వాళ్ళది చాలా పేద

కుటుంబం, కాని అందరికీ విశ్వాసం చూపే మనసు; చూడండి, ఇప్పుడుకాడా అతనిలో ఎంత అణకువ, వినయం చూసారా?" అని రాజం నటరాసుని పొగడింది.

వెంటనే ఏదో గుర్తుచేసుకున్నట్టు సరస్వతి "అవును, ఈ నాలుగురోజులుగా మీకెందుకు అతనంటే ద్వేషం? వాడిని చూస్తే అలాగ తిట్టాలనిపిస్తుందా? నేను కూడా 'ఎవడో అంగడివాడు, ఉత్తికే, బలూనులూ, ఈలా ఇస్తున్నాడు, మనం తీసుకోవాలా?' అని ఆలోచించాను; నటరాసు అని తెలియదే! ఐనా పరాయి మనిషిగా కనిపించినా అతన్ని తిట్టాలా?" అని తన్ను తనకే చెప్పుకున్నట్టు, భర్తని అడుగుతున్నట్టు, సరస్వతి మాటాడింది.

"ఇది కలికాలం. 'తనంతట తానే సాయం చెయ్యాలని వచ్చే మనుషులని మనం నమ్మవచ్చా?' అనే భయం నాకు! మంచి సమయం చూసి ఇల్లు కొల్లగొట్టితే మనేం చెయ్యగలం? అనే భయం! ఇక ఆ భయం లేదులే!" అని సంతానం నవ్వాడు.

"బాగుంది! మంచి భయం మీకు!" అని సరస్వతి భర్తని మందలించింది. "నా సంతోషంలో పొయ్యి సంగతే మరిచిపోయాను! రమణి ఏం అల్లరి చేస్తున్నాడో?" అని వంటగదికి పరుగెత్తింది.

'సరస్వతి, నాలోని అపరాధ బావం వలనే నేను నటరాసుని అనుమానించాను, తిట్టిపోసాను!' అని సంతానం తనలో చెప్పుకుంటూ అసలు నిజమేమిటో భార్యకి చెప్పలేనందుకు సిగ్గుపడి, ఏటవాలైన కుర్చీలో వాలాడు.

** ** **

పది సంవత్సరాలముందు, సంతానం ఇరవైయేళ్ళ యువకుడు. ఆ లేత ప్రాయంలో తనకేర్పడిన ఆ అనుభవం అతను మరిచిపోవడం ఎలా సాధ్యం?

అతని స్నేహితులు చాలామంది పెద్దచదువులకని వెళ్లిపోయారు. కాని తగిన ఆర్థిక బలం లేకపోవడంతో సంతానంకి ఆ అదృష్టం దొరకలేదు. ఇప్పుడు అతను ఒక పెద్ద కంపెనీలో సీనియరు గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఆ సమయంలో ఒక చిన్న అంగడిలో అతనికి ఉద్యోగం. కాకితాలూ, కాపీ పుస్తకాలూ, కలాలు, వ్రాత సామగ్రి -

ఇటువంటి సరకులు అమ్మే అంగడిలో అతనే మేనేజరూ, గుమాస్తా, అన్నీ; యజమాని మాత్రం ఇంకొకతను.

ఒకరోజు పదిహేను, పదహారేళ్ళ యువతి అతని అంగడికి వచ్చింది. ఆమెను మొట్టమొదట చూడగానే ఆమె అందం, మనోహరత చూసి సంతానంకి ఆశ్చర్యం కలిగింది. తన మెడవరకూ చేరుకున్న పుస్తకాలతో నొగసుగా నడిచి వస్తూ ఆమె ఇంకా రెండు కాపీ పుస్తకాలు కావాలంది; సంతోషంతో సంతానం ఎంచి ఇచ్చాడు; ఇష్టం లేకుండానే ఆమె ఇచ్చిన డబ్బు తీసుకున్నాడు.

నాలుగైదు రోజుల తరువాత, రెండవసారి, ఆ యువతి వచ్చింది "నాకు రెండు మంచి bound note books, ఒక Number 4 Swan Pen కావాలి. ఇదిగో cash" అని అంటూ డబ్బు అందించింది.

"Pen ఇప్పుడు stock లేదు. మీరు సాయంకాలం రండి. Notebooks, pen - రెండూ మీరు అప్పుడు తీసుకోవచ్చు" అని సంతానం అన్నాడు.

ఆమె వెళ్ళిపోయింది.

ఆ సాయంకాలం సంతానం అంగడినుంచి దిగివచ్చి వీధిలో నిలబడి కుడిపక్క తిరిగి చూసాడు. ఆ ఉనికినుంచి చూస్తే, పాఠశాలనుంచి ఇళ్ళకి తిరిగివెళ్ళే విద్యార్థులు - అబ్బాయిలూ, అమ్మాయిలూ - గుంపులు గుంపులుగా - ఆ పెద్ద వీధిలో కనిపిస్తారు. ఆ యువతి మరవకుండా ఆ పెద్దవీధినుంచి ఈ చిన్న వీధికి రావాలని సంతానంకి బెంగ పట్టుకుంది.

ఆ అమ్మాయి ఆతురతో వచ్చింది; సంతానం కలమూ, పుస్తకాలూ ఆమెకు అందించడానికి సిద్ధంగా లేచి నిలబడ్డాడు.

"ఓ, మీరు రెడిగా ఉన్నారే?" అని ఒక చిరునవ్వు నవ్వి యువతి చెయి చాచింది.

"మీ పేరు చెప్పండి! ఈ పుస్తకంమీద రాసి ఇస్తాను!" అని సంతానం ఒక క్షణం ఆమె మొహం చూసి అడిగాడు.

"వద్దు!, వద్దు!, కొత్త కలంతో నేనే రాసుకుంటాను!" అని ఆమె అనగానే అతని చెయి పుస్తకాలూ, కలమూ మేజామీద ఉంచేసింది.

“ఎన్ని రూపాయలు? Bill ఇవ్వండి!” అని యువతి అడిగింది.

“Bill గురించి ఏం తొందర? ముందు ఇవన్నీ ఎలాగున్నాయని చూడండి. కలం బాగా రాస్తుందా అని పరీక్షచేసి చూడండి. ఇప్పుడు Bill రాయడానికి టైం లేదు, దుకాణం మూడాలి!” అని సంతానం నొక్కి చెప్పగానే యువతి “సరే, రేపే డబ్బు ఇస్తాను” అని అంటూ వెళ్ళిపోయింది. ఆ అందగత్తె రూపం తన కళ్ళనుంచి మాయమయ్యేవరకూ సంతానం రెప్పలార్చకుండా అమెని చూసాడు. ఆ తరువాత ‘సరే, రేపు ఏమౌతోందో?’ అనే ఆలోచనలో పడ్డాడు.

ఏమైంది ఆ మరుదినం?

ఆ యువతి నెమ్మదిగా అంగడికి వచ్చింది. ఆ సమయంలో అక్కడ ఎవరో ఇద్దరు పుస్తకాలు తిరగవేసి చూస్తున్నారు. అది గమనించి యువతి సంతానంతో “సార్, మంచివేళ, నేను డబ్బు తగలబెట్టలేదు. అసలు మీరిచ్చిన కలం useless! పుస్తకాలూ అలాగే ఉన్నాయి! మీ దగా నాకు తెలిసిపోయింది. ఇవి నాకు వద్దు!” అని తిట్లు తిట్టి వాటిని మేజామీద పడగొట్టి, వెళ్ళిపోయింది.

ఆమె ప్రవర్తన చూసి ఆ ఇద్దరిలో ఒకతను సంతానంతో “ఏదీ, ఆ పుస్తకాలేవో ఇవ్వండి, చూద్దాం!” అని అన్నారు.

“అవును సార్, అవి మంచివికావు. కొత్త స్టాకు నిన్నే వచ్చింది; రెండురోజులముందు రాలేదు. అందుకే ఆవిడ అవి వద్దన్నారు. మీరు కొత్త స్టాకు చూడండి!” అని సంతానం అతనికి హామీ ఇచ్చాడు. యువతి నిరాకరించిన సరుకులు తీసుకొని లోపలికి వెళ్ళి, వాటిని అక్కడ వదిలేసి, నోరు మూసుకొని తిరిగి వచ్చాడు.

యువతి వద్దన్న పుస్తకాల పేజీలు పైపైగా తిరగవేసి చూసినప్పుడు అందులో ఒక చీటీ ఉన్నట్టు సంతానంకి తెలిసింది; అది వెంటనే చదవాలని అతను ఆవేశపడ్డాడు. కాని ఆ యువతి అన్న మాటలూ, ఆమె ముఖభావం గుర్తు రాగానే ‘వద్దు! చీటీ చదవకు! చదివితే నీకే అవమానం!’ అనే హెచ్చరిక అతనికి లోలోపల వినిపించింది.

ఆఖరికి తను ఒంటరిగా ఉన్న సమయంలో, ధైర్యం తెచ్చుకొని సంతానం ఆ చీటీ చదివాడు.

"నాకు పెళ్ళైంది. మీ చీటీ, మీ ప్రవర్తన చూసి నాకు అసహ్యంగా ఉంది. స్కూల్లో చదివే అమ్మాయి అనే కారణంతో మీరు నన్ను కన్య అని పొరబాటు పడ్డారనుకుంటాను. కాని ఆ క్షణాన, అంత సాహసంగా నాకు ప్రేమలేఖ రాయాలని మీకు తోచిందంటే మీ మనసు ఎంత తుచ్ఛమైనదని నాకు తెలిసిపోయింది . . .

మీరు ఆ కలం నాకు బహుమానంగా, మరే విధంగా ఇవ్వవద్దు! నేను ఆ కలం వెలకి తీసుకున్నా మీకు దానితో ప్రేమలేఖ రాయనేరాయను! నా బావ, భర్త ఐన ఇంకొకతనికి రాయడానికి వాడుతాను. మా ఇద్దరిమధ్యా పవిత్ర ప్రేమని పోషించడానికి, మీ దుకాణంలో మీ మూలాన వచ్చే ఏ కలమూ నాకు వద్దు!"

చీటీ చదివి సంతానం ఒక నిట్టూర్పు వదిలాడు. ఆ నిట్టూర్పుతో తన బ్రతుకు అంతమైనట్టు అతనికి తోచింది. కాని వెంటనే మరో ఆలోచన లేచింది: 'నా సరసమైన బ్రతుకు ముగిసింది, కాని మిగిలివున్నదంతా చిన్నబోయినట్టే!' అని ఊహించాడు. ఆ నిట్టూర్పుతోనే 'ఈ క్షణం నా ప్రాణం పోతే ఎంతబాగున్ను!' అని అతనికి తోచింది.

"ఈ కలంకి డబ్బు తీసుకోవాలనే ఉద్దేశం నాకు లేదు. ఇది నేను మీకు ప్రేమ కానుకగా అందిస్తున్నాను. పెళ్ళి చేసుకొని మనం దంపతులుగా జీవించాలి. మనమిద్దరమధ్యా ఉత్తరప్రత్యుత్తరాలు మొదలుబెట్టడానికి ఈ కలం దోహదం చెయ్యబోతుందని నాకు చాలో సంతోషంగా ఉంది. నువ్వూ అలాగే సంతోషిస్తావని ఆశించుతున్న,

సంతానం

ఇదే సంతానం ఆ చీటీలో రాసాడు. ఈ వాక్యాలని ఆ యువతి హాలాహల విషంగా తన మనసులో బాగా పీల్చుకొని, అతనిమీద కక్కేసి, తలవంపు చేసేసింది. సంతానం యౌవనంలో మునిగి తేలుతున్నాడు. ఆ వయసులో అతనిలో అనివార్యంగా చోటు చేసుకున్న గుణాలకి -ముక్కోపితనం, జీవ కళ, ఉత్కంఠత - అదొక పెద్ద దెబ్బగా అతని మనసులో నాటుకుపోయింది.

ద్రౌపది చంచలమైన కళ్ళు చూసిన యువకులందరూ 'ఆమె నన్ను ప్రేమిస్తోంది', 'ఆమెకి నేనంటే చాలా ఇష్టం!' అని ఆలోచించేవారట. సంతానమూ అటువంటి భ్రమలో చిక్కుకొని ఒక పొరబాటు చేసేసాడు. అతను చేసిన తప్పు బాహటంగా అతనికి

తెలియజేయగానే, అవమానంతో, పురుగులాగ తికమకలాడిపోయాడు. తను యువకుల తరంకి విరుద్ధంగాను, స్త్రీల సమాజంకి శత్రువుగా మెలుగుతున్నట్టు అతని మనసూ, దేహమూ తహతహలాడాయి.

కాలగమనంలో చాలా మార్పులు చోటుచేసుకున్నా ఆ అగాధమైన గాయపు మచ్చ అతని మనసులో స్థిరపడిపోయింది. ఆ అపరాధ భావంతో నటరాసుని ఒక గూఢచారిలాగ పరీక్ష చెయ్యాలని అతను పూనుకున్నాడు; విపరీత ఆలోచనలు లేచి అతని మనసుని పీడించాయి.

నటరాసుతోబాటు ఇంటికి వచ్చినప్పుడు శోభనం రాత్రి వధూవరులని గదిలోకి పంపించి చిర్రెత్తించే పిచ్చితనమే సంతానం మనసులో చోటుచేసుకుంది. కాని నటరాసులోని గుణాల ప్రభావం తెలిసిన తరువాత, ఆ అంధకారం మాయమైంది.

********

**(మూలం:ప్రచురణ/ స్వదేశమిత్రన్, అక్టోబర్ 5,1947**

# అంతర్బుద్ధి

నేను పదే పదే చెప్తున్నాను, శాంతి ఒప్పుకోదు; నేను మళ్ళీ చెప్పాను:

"విను. డాక్టర్లకి ఈ శరీరం ఒక యంత్రంలాగ. వాళ్ళ దృష్టిలో ఎది చూసినా అది వైద్యసంబంధమైన తీరులోనే ఉంటుంది . . . ఒక పేషంటుని పరీక్షించినప్పుడు అతనిలో మరేం చింతన ఉండదు."

మేం ఇంటినుంచి బయలుదేరినప్పుడు శాంతి సరే అని ఒప్పుకున్నా డాక్టరుగారి డిస్పెంసరీకి వచ్చే దారిలో మళ్ళీ పాత ప్రశ్నలు అడగడం ఆరంభించింది. ప్రారంభంలో ఆమె తాపత్రయం, చిరచిరలాడడం నాకు ఉల్లాసంగానే కనిపించింది. నేను ఆమె మాటలని ఒక మధురమైన షెర్బత్తుని కొంచెం కొంచెం కొంచెంగా తాగుతున్నట్టు, నవ్వుతూ విన్నాను; కాని త్వరలో ఆ మాధుర్యం తగ్గిపోయింది. నేను తాళలేకపోయాను.

మాకు పెళ్ళయి మా దాంపత్య జీవితం ఆరంభించడానికి నేను శాంతితో వచ్చిన ఈ ఊరు చాలా విచిత్రమైన ప్రదేశమే అని అనాలి. ఎంతమందిని అడిగి, ఆలోచించి, ఆఖరికి నేను రెండు మంచి డాక్టర్లని కనిపెట్టాను! ఒకతను డాక్టరు రంజన్ - వయసులో చిన్నవాడే; మొహంలో ఎప్పుడూ చిరునవ్వు; అతనిది అచ్చివచ్చిన చెయి అని అందరూ అన్నారు. ఇంకొకతను డాక్టరు రామదాసు - మంచి పేరు, వయసులో పెద్ద, అనుభవశాలి, హాస్యంగా మాటాడతుంటారు. ఊరులో ఉన్న తక్కిన డాక్టర్లులలో ఇద్దరికి తమ వృత్తిలో పట్టింపు లేదు. ఇంకొకతనికి ఆరోగ్యం బాగులేదు. మరొకతనికి చికిత్సకంటే డబ్బే ప్రధానం. ఆఖరికి ఒక డాక్టరు మిగిలేడు - అతని దగ్గఱ ఎవరూ వెళ్ళరట! అతనికి పేరు యమదాజు!

నేను మొట్టమొదట శాంతితో డాక్టర్లగురించి మాటాడినప్పుడు డాక్టర్ రంజన్ని చూద్దామని అన్నాను; అతని ఆసుపత్రి మా ఇంటికి దగ్గఱగా ఉంది. కాని శాంతి మాకు చాలా దూరంలో ఉన్న రామదాసుని ఎంచుకుంది.

"అతనికి అనుభవం ఎక్కువ, కాదా మరి?" అని వాదించింది. నాకు తెలుసు ఆమె మనసులో ఏముందని: రంజన్ వయసులో చిన్నవాడు - చిలిపికొయ్య - వద్దు!

సరే, ఎలాగో, ఆఖరికి మేం డాక్టరుని చూడడానికి వెళ్తున్నాం. కాని శాంతిలో మళ్ళీ మళ్ళీ అదే ఆరాటం; నేను భరించలేకున్నాను. నాకు పట్టరాని కోపం వచ్చింది.

" . . . అవును, పేషంటుని పరీక్ష చేసేటప్పుడు డాక్టరు పేషంటుని తాకకుండా ఉండగలరా? లేకపోతే నువ్వు ఇంటిలో ఒక మూల కూర్చొని బాధ పడవలసిందే! . . . ఇలాగైతే నేనేమీ చెయ్యలేను . . . నువ్వు మీ ఇంటికి వెళ్ళి అక్కడ దొరికే లేహ్యామో, చూర్ణమో మింగు!"

నాకు నా స్వల్ప అనుభవంతో తెలుసు - నాకు కోపం వస్తే శాంతి నన్ను మెల్లగా ఉల్లాస మనోభావానికి తీసుకొస్తుంది. నేను ఆశించినట్లే గొంతుకమ్మిన స్వరంతో, "మీకేం - అలాగ మాటాడతారు! . . . ఐతే ఒక లేడీ డాక్టరు మీ షర్టుని లాగి పారేసి, మీ వీపుమీద బాది, దెయ్యంలాగ మీ నోరు తెరిచి చూపమంటే మీకెలా ఉంటుంది?" అని అడిగింది.

"అలాగైతే నేను తప్పకుండా ఆనందిస్తాను!" అను దుడుకుగా జవాబు చెప్పాను.

శాంతి మరేం అనక ఊరుకుంది. పాపం, దానికి డాక్టరు దగ్గఱ వెళ్ళడం ఇదే మొదటిసారి, అందుకే ఇలా వెనుకాడుతోంది. ఐతే మరి ఒళ్ళు కుదరకపోయినప్పుడు సిగ్గు పడితే ఎలాగ? డాక్టరంటే సమ్రక్షుడు; అతని దగ్గఱ ఎందుకు మొహమాటం?

నేరస్తులలాగ ఇద్దరూ మాట్లాడకుండా నడిచాం. నేను మళ్ళీ చెప్పాను: "శాంతి, నా మాట విను. అతనుగాని డాక్టరు కాకపోతే నా భార్య దగ్గఱ అతను రావడానికి నేను ఒప్పుకుంటానా?" అబ్బా, ఆఖరికి ఆమె సరే అని సమ్మతించింది. అల్లి పూల మొగ్గలు నీళ్ళను తాకిన వెంటనే వెల్లివిరిసినట్టు ఆమె బుగ్గలో కాంతి కనిపించింది.

డాక్టరు రామదాసు మాకు నవ్వుతూ స్వాగతమిచ్చారు. శాంతి నాడిని పరీక్షించి మందులు రాసి ఇచ్చారు. నొప్పి వస్తే మేం తిరిగిరావాలి. అంతే . . . మరేం కావాలి? శాంతి ఆనందం నిండిన హృదయంతో ఇంటికి తిరిగి వచ్చేసింది.

కాని రెండు మూడు వారాల్లో ఆ నొప్పి - ఆమె ఛాతీలో ఎడంపక్క - మళ్ళీ రావడంతో మేం డాక్టరు రామదాసుని చూడడానికి వెళ్ళాం. ఈ సారి శాంతి భయాలు

నిజమే అని ఋజువయ్యాయి. ఒక మృదంగ విద్వాంసుడులాగ డాక్టరు శాంతి వీపుమీద మెల్లగా - కిందా, మీదా -బాదారు. ఆమెను ఒక మంచంమీద పడుకోబెట్టి ఆమె పొత్తి కడుపు, శ్వాసకోశం, హృదయం, అన్నీ పరీక్షించారు. శాంతి ఊరటకోసం నేనుకూడా ఆమెపక్కనే ఉన్నాను; కాని అక్కడనుంచి మేం ఇంటికి తిరిగివచ్చినప్పుడు శాంతి ఆయాసపడి ఫిర్యాదు చేసింది: "ఇదేం గొడవ? దేహంలోని నొప్పిని నిర్ణయించడానికి ఇన్ని తడబిడలా?"

ఆమె మాటలు ఎంత నిజం! మేం మూడు సార్లు డాక్టరు రామదాసు దగ్గఱ వెళ్ళాం, శాంతిలో ఎటువంటి అభివృద్ధీ కనిపించలేదు. ఆసుపత్రికి వెళ్ళినప్పుడూ, తిరిగివచ్చినప్పుడూ, ఆ మధ్యా. శాంతి నాకు తన అనుమానాలూ, ఇబ్బందులూ, చెప్తూనేవుంది.

డాక్టరు ఆజ్ఞ ప్రకారం ఉదయం, సాయంకాలం, శాంతి దేహంలో టెంపరేచర్ నామోదు చేసాం. ఆ చార్టు చూసి డాక్టరు నాకు చెప్పారు: "ఇది చూస్తే మీ భార్య దేహంలో ఎప్పుడూ జ్వరం ఉన్నట్టు కనిపిస్తోంది; ఇదేదో మనం చూడాల్సిందే . . . "

శాంతికి ఇవేం నచ్చలేదు. "ఇక ఈ నొప్పి వస్తే నేనేం చెప్పకుండా ఊరుకుంటాను. రెండు రోజుల్లో సర్దైపోతుంది; ఏ మందూ, డాక్టరూ వద్దు!" అని వీరాంగనలాగ మాటాడింది.

కాని ఆ నొప్పి మళ్ళీ రాగానే, ఒకరోజు మాత్రమే దాన్ని భరించింది. ఆ తరువాత ఆమె మొండితనం, ధైర్యం, నిశ్చలత, మాయమైపోయాయి; నొప్పి ఆగనేలేదు. శాంతికి ఒళ్ళంతా సలుపు. ఎంత గింజుకున్నా లాభం లేదు; ఉత్తికే కూర్చోవాలన్నా, నిద్రపోవాలన్నా, చేతకాదు. కలవరపడి నేను డాక్టరుకోసం పరుగెత్తాను. అతను ఊరులో లేరు. ఐతే అందువలన నేను పెర్రివాడులాగ ఉత్తి చేతులతో ఇంటికి తిరిగివస్తానా? ఎందుకు డాక్టరు రంజన్ని పిలవకూడదు?

దీపం వెలుతురులో నా పక్కన నిలుచున్న యువకుడుని చూసి - అతనొక డాక్టరని అతని చెయిలో ఉన్న హేండ్బేగ్ చెప్తోంది - శాంతికి ఒకటే విడ్డూరం! కాని బాధలో అవస్థ పడుతుంటే ఆమె మొహంలో ఎలా అనిష్టత కనిపిస్తుంది?

ఆమె నాడిని పరీక్షించిన ఒక నిమిషంలోనే శాంతి ఆరోగ్యం గురించి డాక్టర్ రంజనికి అంతా బోధపడినట్లుంది. ఆమె వీపు, నోరు, శ్వాసకోశం, పరిశోధన చేసారు. నాకు ఒక తైలం పేరు రాసి ఇచ్చారు. నొప్పివున్న జాగాలో అది మర్దనం చెయ్యమన్నారు; రేపు మళ్ళీ వచ్చి చూస్తానన్నారు.

"డాక్టరుగారూ, ఈ నొప్పి తగ్గడానికి ఏమైనా మందు ఇస్తారా? నేను రాత్రి నెమ్మదిగా నిద్రపోవాలి," అని శాంతి అతన్ని బతిమాలింది.

"తప్పకుండా! ఇప్పుడే మూర్తిగారికి పంపిస్తాను, మీకేం కష్టం ఉండదు," అని అతను ఇంపుగా జవాబు చెప్పారు. నేను అతన్ని సాగనంపాను.

ఆ తరువాత రెండు మూడు రోజుల్లో శాంతి ఆరోగ్యంలో అభివృద్ధి కనిపించింది. కాని ముందు అనుభవించిన జ్వరం, పీకు వల్ల ఆమెలో ఉన్న అలసట, బలహీనత తగ్గలేదు.

"డాక్టరు రామదాసు తిరిగి వచ్చేసారని విన్నాను. అతన్ని పిలవమంటావా? అతను ఊరిలో లేనప్పుడు నువ్వు ఎలాగ కష్టపడ్డావని అతనికి తెలియవద్దూ?" అని శాంతిని ఒకరోజు అడిగాను.

"ఎందుకండీ? ఇవాళ పొద్దుటేగా ఇంకొక డాక్టరు వచ్చిచూసారు?" అని శాంతి గొణుక్కుంది. అవును, ఆమె చెప్పినది నిజమే. రంజన్ కూడా తన వృత్తిలో రామదాసుకి ఏమీ తగ్గిపోలేదు. ఒకే చికిత్సకి రెండు డాక్టర్లు ఎందుకు?

కాని కొన్ని వారాల్లో ఆ ఉపద్రవం మళ్ళీ శాంతిని పీడించింది; ఆమెకి సహించలేని బాధ. "ఇదిగో, డాక్టరుని పిలుస్తాను!" అని అంటూ షర్టుమీద అంగవస్త్రం వేసుకున్నాను.

"ఏ డాక్టరు?" అని శాంతి పెదిమలు బిగించి, కన్నులు తెరిచి, అడిగింది.

"నేనేం మరిచపోలేదు; కొంచెం ఎక్కువ దూరం నడవాలన్నా పరవాలేదు. నేను డాక్టరు రామదాసుని తీసుకొని వస్తాను."

"అతని దగ్గఱ ఫీజు ఎక్కువ. డాక్టర్ రంజన్ని పిలవండి . . . " అని శాంతి అనగానే నేను నమ్మలేకపోయాను: 'ఇవి శాంతి చెప్పే మాటలేనా?'

"శాంతీ, డాక్టరు రామదాసు మనగురించి ఏమనుకుంటారు? అతనిప్పుడు ఊరులో ఉన్నారు కూడా! ఒకే డాక్టరైతే నీ ఆరోగ్యంలో చిక్కు ఏమిటని మనకి తెలుస్తుందికదా?"

"సరే, మీ ఇష్టం," అని శాంతి ముక్తసరిగా చెప్పింది.

డాక్టరు రామదాసు ఆసుపత్రికి వెళ్తున్నప్పుడు నేను శాంతి ప్రవర్తన గురించి ఆలోచించాను: 'డాక్టరు రామదాసు వద్దు' అని ఆమె చెప్పడానికి అతని ఫీజే ముఖ్యకారణమా? 'సరే, మీ ఇష్టం!' అని అన్నప్పుడు ఆమె స్వరంలో ఒక విధమైన అతృప్తి గూఢంగా కనిపించలేదూ? ఆమె ఎందుకు తన ఇష్టమేమిటో వక్కాణించి చెప్పలేదు? మరేం లాభం లేదనే రాజీ పడిందా? నాకు తెలుసు నేను చేసేది సరైన పనే - మా మొదటి ఇష్టం రామదాసు కదా?

ఇంతకుముందు డాక్టరు రామదాసు ఊరులో లేరని తెలియగానే నేను బాధపడేవాడిని; 'ఇక ఏంచెయ్యాలి?' అని ఆలోచించేవాడిని. కాని ఇప్పుడో? నాకు ఒళ్ళంతా ఒకటే మంట! గత్యంతరం లేక ఈ గడ్డంలేని యువకుడిని పిలవాలి; అతని లక్షణమైన, అందమైన మొహం నాకిప్పుడు అసహ్యంగా కనిపిస్తోంది . . .

డాక్టరు రంజన్ని మళ్ళీ చూడగానే శాంతికి ఆశ్చర్యమే! పెదిమలలో చిరునవ్వు . . . అదేం డాక్టరుకి తన కృతజ్ఞత చూపే చిహ్నమా లేక నాతో, 'నేను చెప్పినది మీ ఇష్టం అని - కాని ఆఖరికి మీరు చేసినది నా తృప్తికోసం. మీరు నా బానిస!' అనే సందేశమా? ఇప్పుడు ఆమె నొప్పితో బాధపడుతున్నట్టు ఏ గుర్తూ కనిపించలేదు.

కాని నా దిగ్భ్రమ ఎంతసేపో లేదు. శాంతి మూతి ముడుచుకొని ఉన్న తీరు, డాక్టర్ రంజన్ నిదానంగా, పద్ధతి ప్రకారం ఆమెను పరీక్షించిన వాటం చూసి మా మనసులోని ఆవేదన మెల్ల మెల్లగా అణగిపోయిది.

మరునాడు పొద్దున్నే డాక్టర్ రంజన్ వచ్చి తన అభిప్రాయం చెప్పేసారు: "మీ భార్య జ్వర లక్షణాలు చూస్తే ప్లూరసీ వ్యాధి అనవాలు కనిపిస్తోంది. కాని ఏం భయం వద్దు. తగిన ఆహారం, ఆరోగ్యమైన ఆచారాలతో ఆమెకు తప్పక స్వస్థత కలుగుతుంది," అని చెప్పి ఇక కావలసిన మందులూ, వాటి మోతాదులూ, ఆహార నియమాలూ - అన్నీ రాసి నాకు అందించారు.

మూడు మాసాలుగా మా ఇంట్లో వంటకని ఒక అబ్బాయి ఉన్నాడు;అందువలన నేను వంటగురించి కంగారు పడలేదు. నా ఆదుర్ద అంతా శాంతి డాక్టరు రామదాసుగారి మాట వింటుందా లేదా అనే.

“డాక్టరు రామదాసు వారాలకొద్దీ పరీక్షచేసి ఏమీ తెలియక తికమకలు పడుతూంటే ఈ డాక్టరు రంజన్ కొన్ని రోజుల్లో తనకి నీ ఆరోగ్యంగురించి అంతా తెలిసిపోయిందని అంటున్నారు. మందులుకూడా రాసి ఇచ్చారు. మరి ఇతని మాటే విందామా?” అని శాంతిని అడిగాను.

“మరి రామదాసులాగ ఇతనుకూడా temperature chart, జ్వర లక్షణాలు చూసే నా ఆరోగ్యస్థితి తెలుసుకున్నారు; ఇందులో ఎటువంటి ఇంద్ర జాలమూ లేదు. ఇంతకీ ఇద్దరు డాక్టర్లు చెప్పిన మందులూ, మోతాదులూ, ఒకేలాగ ఉన్నాయిగా? . . . ” అని శాంతి చమత్కారంగా బదులు చెప్పింది - తనకి డాక్టర్ రంజన్ మీద ఫక్షపాతం లేదు అని నిరూపిస్తున్నట్లు. ఆఖరికి తనే మళ్ళీ చెప్పింది: “మనకి డాక్టరు రంజన్ చాలు!”

‘ఇదేం మాట శాంతి? అవాళ మనం డాక్టరు రామదాసుని చూడడానికి వెళ్ళినప్పుడు నువ్వు ఎన్ని ప్రశ్నలడిగావో గుర్తుందా? మరి ఇప్పుడు డాక్టరు రంజన్ ఎది చెప్పినా అది వేదవాక్కు అంటున్నావ్! . . . ” అని నేను ఆమెను అడగాలని అనుకున్నా నానోటినుంచి మాటలు రాలేదు; అలాగ అడిగివుంటే ఆ తరువాత నేనే దానికోసం సిగ్గుపడి ఉంటాను.

మేం డాక్టరు రంజన్ చెప్పినట్టే చేసాం. నేను ప్రతిదినం శాంతితో అతని ఆసుపత్రికి సూదిమందుకోసం వెళ్ళాను. క్రమంగా శాంతి బుగ్గలు లావుగా, గులాబీ రంగుతో కనిపించాయి. నాకుమాత్రం హృదయంలో ఒక ముళ్ళు గీకుతున్నట్లు అనిపించింది.

నేను ఆలోచించాను: నేనేకదా మొట్టమొదట డాక్టరు రంజన్ దగ్గర వెళ్ళాలని అన్నాను? కాని శాంతి అనుభవశాలైన రామదాసు కావాలంది. ఇక సంఘటనలు సమగ్రంగా కొనసాగివుంటే నేనిలాగ, అసూయతో, సిగ్గుమాలిన ఆలోచనలతో బాధపడతానా?

ఒక రోజు - తలా తోక లేకుండా - శాంతి చెప్పిన విమర్శ నేను విన్నాను.

"డాక్టర్లు ఈ సమాజంకి తప్పనిసరిగా కావాలి! రాత్రీ పగలూ పాటుబడి మనుషుల బాధలు తీర్చడానికి వాళ్ళు ఎంత కష్టపడుతున్నారు! అదే వారి సాధన!"

ఆ మాటలు నాకు వినోదంగానూ, మితిమీరిన పొగడ్తగానూ అనిపించాయి.

ఒక రోజు డాక్టర్ రంజన్ని చూసి ఇంటికి వచ్చినప్పుడు నేను అన్నాను: "నిన్న బజారులో డాక్టరు రామదాసుని చూసాను; నాకు ఒకటే కంగారు - అతను నన్ను ఏమైనా అడుగుతారోమో అని."

"అతనేం అడుగుతారు మిమ్మల్ని? మనం ఎందుకు అతన్ని మళ్ళీ పిలవలేదనా? పోనీ, అలా అడిగితే రంజన్ మీ పాత కాలేజీ స్నేహితుడని చెప్పేయండి!" అని శాంతి చల్లగా చెప్పింది.

స్నేహితుడా? బాగుంది! ఇంకా చెప్పాలంటే నా విరోధి! కాలేజీ స్వేహితుడని నేను అబద్ధం చెప్పాలట!

శాంతి పైఖరి నాకు బోధపడటం లేదు. సరే, వేరే కుయుక్తి ప్రయోగించాను: "శాంతి, ముందు ఇదే డాక్టరు రంజన్ని చూద్దామని నేను అన్నప్పుడు నీకు ఎలా ఉండేది? ఎంత ఆగ్రహం! ఎంత ఉక్రోషం! అవన్నీ ఇప్పుడు ఏమయ్యాయి? దేవుడా, ఆడవారి మనసంటే ఇంత చంచలమా?" ఎలాగైనా - మెల్లిగా, కటువుగా, చమత్కారంగా, లేక కొంటెగా - మాటాడి ఆమె అంతరాత్మలో ఏముందో తెలుసుకోవాలని నా కోరిక. కాని ఆమె చేసేదంతా - మళ్ళీ, మళ్ళీ, ఇంపుగా నవ్వడమే!

బరువు తాళలేక అల్లాడే కాగితంలాగ నా హృదయం గడగడమని వొణికింది. శాంతికీ నావంటి ప్రశ్నేనా? ఆమెకి నన్ను వదలి పారిపోవాలని తలపా?

ఒకరోజు శాంతి కనుసైగ చేస్తూ "నేను డాక్టర్లగురించి ఒక పరిశోధన చేసాను . . . " అని ఆరంభించింది.

"భలే, భలే, డాక్టర్లు మందులూ, వ్యాధులూ పరిశోధన చేస్తారు; నువ్వేమో - వాళ్ళు చెప్పే మందులు తీసుకొనే పేషంటు - వాళ్ళనే పరిశోధన చేసావన్నమాట! సరే, చెప్పు, నీవేం కనిపెట్టావ్?"

"నేను మాటాడుతున్నది ఒక పరిశోధక వ్యాసం. దాన్ని ఉత్తికే ఆశుకవిత్వంలాగ చెప్పమంటే ఎలాగ? ఇదిగో, నేనేం రాసానో చదివిచూడండి . . . " అని అంటూ శాంతి నా చేతికి ఒక పత్రం అందించింది.

నేను చదివాను:

"డాక్టర్లలో రెండు రకాలు. ఒక రకం భ్రష్టులు, దుష్టులు. ఇంకొక రకం ప్రశాంత హృదయులు, తమ భావాలని అదుపులో ఉంచుకొనే వ్యక్తులు. కాని ఆ రెండు రకాలూ - ప్రారంభంలో - ఒకరితో ఒకరు సులభంగా కలిసిపోతారు. ఐతే ఈ రెండు తరాల్లో ఎక్కువ భేదం లేదు. మొదటి గుంపులోవారికి మానవ శరీరం ఒక బొమ్మలాగ; అది ఆట వస్తువు. మరొకరికి అది ప్రతిఛ్ఛాయ, నీడ. ఐతే ఇద్దరికీ ఈ దేహమూ, రక్తమూ ఉత్తి యంత్రమే . . . "

దాన్ని - ఒక రెండు సార్లు - చదవగానే శాంతి సృష్టించిన ఆ వికారమైన పత్రంతో ఆమెకున్న కల్పనాశక్తి నాకు బాగా బోధపడింది. "శాంతి, పెద్ద పెద్ద ప్రొఫెసరులు రాసే గూఢమైన సిద్ధంత వ్యాసాలలాగ ఇదీ వినోదంగా ఉంది," అని అన్న వెంటనే, నాలో ఒక ఆశ లేచింది: 'ఈ రెండు రకాల్లో రంజన్, రామదాసు ఎలా పోల్చుకోడం?'

"శాంతి, నేనుకూడా పరిశోధన చేసి ఒకటి కనిపెట్టాను," అన్నాను. శాంతి కళ్ళు తెరిచి నన్ను ఆశ్చర్యంతో చూసింది.

"ఏమంటున్నారు మీరు, చెప్పండి" అని చికాకుతో అడిగింది.

"నీకు నళాయిణీ కధ తెలుసుకదా? ఆమె తను ప్రేమించే రోగి భర్తని ఒక గంపలో అన్ని చోట్లా మోసుకొని వెళ్ళిందట; నేనుకూడా అలాగే నిన్ను ఈ డాక్టర్ల దగ్గఱ తీసుకొని వెళ్తున్నాను . . . "

శాంతికి పట్టరాని కోపం వచ్చింది. "ఏమిటా మాటలు? మీరేమంటున్నారు? నా వ్యాధిని నళాయణీ భర్త వ్యాధితో ఎలా సరిపోల్చడం? రెండూ ఒకటేనా? డాక్టర్కీ, రంకుముండకీ భేదం లేదా? అని ఆవేశంతో ఆమె నోటినుంచి మాటలు వెలుపడ్డాయి.

"మంచి పోలికే! . . . " నాలోని కడుపు మంట అలాగే ఉంది. కసి తీర్చుకోవాలని అనేసాను.

"ఓ? . . . అలాగా?" శాంతి దేహం ఆవేశంతో వొణికింది. తొందర తొందరగా తను దువ్వుకున్న జుత్తుని ఒక జడముడిగా కట్టి నా పక్కకి వచ్చింది.

"మీకు రంజన్ అంటే అసహ్యం; నాకు రామదాసంటే అసహ్యం; ఇదెలాగ మీకు చెప్పడమనేది నాకొక పెద్ద ప్రశ్న! ఈ మధ్య మీరు మొహం ముడుచుకోడం, చిరచిరలాడడం నాకు తెలియదనుకున్నారా? ఇక ఆలస్యం వద్దు, నేనే అంతా చెప్పేస్తాను . . . !"

ఇదేం అంటోంది? ఇప్పుడు ఏం కొంప మునిగిందని? మేమేం పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నామా - లేక అఘాతంలో పడిపోయామా?

శాంతి తన కంఠధ్వని కొంచెం తగ్గించి మాటాడింది:

"వయసుకీ, మనిషి గుణంకీ ఎటువంటి పొత్తూ లేదు. రామదాసు పెద్దవారే; అతనొక సీనియర్ డాక్టరు. రంజన్ యువకుడు, ఒక జూనియర్ డాక్టరు - కాని అతనికి పెద్దమనసు. అతను యోగ్యుడు. ఇక ఆ సీనియర్ డాక్టరుకి మనసు చిన్నది; అతనొక సిగ్గుమాలిన మనిషి!"

ఇదేం పొడుపుకథ వింటున్నాను నేను? నాలుగు సార్లు చూడగానే దీనికి రామదాసు వ్యక్తిత్వం పూర్తిగా తెలిసిపోయిందా? నా కళ్ళకి ఇద్దరు డాక్టర్లు ఒకేలాగ కనిపిస్తున్నారే!

శాంతి మాటలు మెరుపులాగ గాలిని చీల్చుకొని వినిపించాయి. "నాకు మొదటినుంచే రామదాసు మొహం నచ్చలేదు - కాని అక్కడ వెళ్ళిన తరువాత నా అనిష్టత దాచుకున్నాను. డాక్టర్ రంజన్ని చూడగానే ఎందుకు 'ఇతనికి ఏమీ తెలియదు, అనుభవం లేని డాక్టరు!' అని తొందరపడ్డాను?' అని నొచ్చుకున్నాను."

ఇప్పుడే నేను నన్ను సముదాయించుకొని, నవ్వుతూ, అడిగాను:

"డాక్టరు రామదాసు నిన్నేం చేసారు? కన్ను కొట్టారా లేక కామ దృష్టితో? . . . "

"అవన్నీ నన్ను అడక్కండి. కాని ఒక క్షణంలో నేను డాక్టరు రామదాసుని తెలుసుకున్నాను. మీకు రంజన్ ఇష్టం లేకపోతే నేను మా ఊరికి వెళ్ళి రంజన్ చెప్పిన సూదిమందులు వేసుకొని వస్తాను . . . అబ్బా, ఈ మగవాళ్ళు! పెళ్ళానికి ఆరోగ్యం

బాగా లేదంటే అసలే చికాకు పడతారు; ఇక అసూయ, అనుమానం వస్తే ఆ తికమకలో వాళ్ళ దాంపత్యం ఎంత గందరగోళమౌతుందో ఎవరు చెప్పగలరు?"

నా మనసులో శాంతి; నా అంతరాత్మలో జ్వరం తగ్గింది. సంతోషంతో నా దేహమంతా చెమట - మలేరియా వ్యాధినుంచి విముక్తి లభించినప్పుడు చెమట కార్చుతున్నట్టు . . .

"సరే, నువ్వు నీకు కావలసినది pack చేసుకొని సోమవారం ప్రయాణంకి రెడీ అవు!" అని అంటూ నేనూ నవ్వేసాను.

శాంతికూడా - కళ్ళలో కాంతి, బుగ్గలలో చిరునవ్వు- తెలియజేస్తూ, గబగబమని తన జుత్తుముడిని వదులుకొని - మళ్ళీ దాన్ని దువ్వుకొని - జడగా వేసుకుంది; నాకది ఇష్టమని దానికి తెలుసు.

మేమిద్దరం రాజీపడుతున్నట్టు ఏదైనా చెప్పాలనే భావనతో నా పెదిమలవరకూ మాటలు వచ్చేసాయి: 'శాంతీ, అసలు ఆ వెధవ నిన్ను ఎలా అవమర్యాదతో చూసాడు?' అని. కాని శాంతి నాకు జవాబు చెప్తుందా? 'నాకెలాగో తెలుసు!' అని చెప్పి ఊరుకుంటుంది.

ఇప్పుడే నాకు బోధపడింది. ఇన్నిరోజులూ శాంతి అంతర్బుద్ధి ఆమెకి తోడుగా నిలబడింది: అదే అంతర్బుద్ధి నన్ను కాపాడింది. శాంతి నిజ స్వరూపాన్ని, నిష్కళంక మనసును నేను చూడకలిగాను. డాక్టర్ రంజన్ని మొట్టమొదట చూసినప్పుడు తనకి అతనిమీద మోజు కలిగిందని శాంతి నాకు చెప్పింది, కాని నా అంతర్బుద్ధి నాకు చెప్తోంది: శాంతిలో ఏ కళంకమూ, దోషమూ లేదు.

పుస్తకాలన్నీ చదివి, జీర్ణం చేసుకొని వ్యాధులని తీర్చే డాక్టరుకంటే అంతర్బుద్ధితో సరిగ్గా వ్యాధి నిర్ణయించేవారు ఈ సమాజంకి రక్షకులు. నా అంతర్బుద్ధి నాకు రహస్యంగా చెప్పింది: 'మా ఇద్దరి మనసులు మధురమైవ ప్రేమతో ఏకమై - ఒకే స్వరంతో - మ్రోగుతున్నాయి,' అని.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, మార్చ్ 25, 1951)**

# పుట్టుమచ్చ సందేశం

బయట వెన్నెల ధారగా కురుస్తోంది. విశాలమైన వీధికి రెండుపక్కలూ వరుసవరుసగా ఇళ్ళు; అసలు వీధి అనికూడా అనలేం. మామూలుగా జనుల రాకపోకలు లేకపోవడంతో అక్కడున్న ఇరవై ఇళ్ళ నివాసులు ఆ నడవని తరచుగా ఒక పెద్ద వసారాగా వాడుకుంటున్నారు.

బయటకి వచ్చి నిలబడిన రుక్మిణి తన కంటి చూపుని పొడుగాటి వీధిమీద విసిరింది. పూర్ణచంద్రుని ప్రకాశం, వెన్నల రాత్రిలో ఆ పరిసరాల ప్రభావం, ఆహ్లాదకరమైన పిల్లగాలి - ఇవన్నీ చూసి - మురిసిపోయింది. వట్టిగా వున్న మంచంని దగ్గరకి లాగింది; మంచి అలసటలో ఉండటంతో, వెంటనే వాలింది.

"రుక్కూ, ఇంటిపనులన్నీ ఐపోయాయా?" అని పొరుగింటి ముత్తైదువ అడిగారు.

"అవునండీ."

"మీ అమ్మగారూ వచ్చేసారు, ఇక నీకు కొంచెం విశ్రాంతి దొరుకుతుంది. పాపం! ఎనిమిది మాసాలు గడిచిపోయాయి . . . ఇంకా ఒక నెల బాకీ . . . "

ముత్తైదువ మాటాడుతంటే తను నిద్రపోవడం అమర్యాద అనే తలపుతో రుక్మణి లేవడానికి ప్రయత్నించింది.

"బాగుంది, ఇప్పుడే వాలావ్, ఎందుకు తొందరగా లేవాలి? ఆ అబ్బాయి ఇంట్లో నిద్రపోతున్నాడుకదా?" అని ఆవిడ అనగానే రుక్కు సంతోషంతో మళ్ళీ నిద్రపోవడానికి సిద్ధమైంది.

'మామీకి అన్నీ తెలుసు!' అని ఆవిడని మనసార మెచ్చుకొని రుక్కు కళ్ళు మూసుకుంది. చాలామంది స్త్రీలు, ఈ పంచలో నిద్రపోతున్నారు. కాని తనుమాత్రం, అన్నిరోజులూ, ఇంటిలోనే నిద్రపోవాలి; ఆ అబ్బాయి మణికి సాయంగా అది ఆమె చేసి తీరాలి!

'ఇవాళ నిండు పౌర్ణమి; నేను నిండు సూలాలు. ఇది నా ఆకాంక్ష: నేను ఈ రాత్రి ఇక్కడే నిద్రపోవాలి. నాకెవరూ అడ్డు చెప్పకూడదు!' అనే మొండి ఆలోచన ఆమెలో లేచింది; ఆ ఇంపైన తీర్పుతోనే కళ్ళు మూసుకుంది.

"రుక్కు . . . ఇదేంటి? . . . లే . . .లే. . . లోపలికి వెళ్ళి పడుక్కో . . . "

ఈ మాటలు విన్నప్పుడే రుక్కు నిద్రనుంచి లేచింది; భర్త ఈశ్వరన్ లేపుతున్నాడు.

"ఇక్కడ నిద్రపోతే ఎలాగ? విను, ఈ వెన్నెల పాపకి మంచిది కాదు! పదిగంటలవబోతుంది . . మరేం ఆలస్యం చెయ్యకు, లోపలికి వెళ్ళు . . . "

రుక్మణి కళ్ళు తెరిచి పక్కకు తిరిగింది; అదేం తను ప్రసవించిన బిడ్డేమో అని వింతగా చూసింది. కాదు, అది మణి! నిద్రనుంచి లేవగానే ఆ పిల్లవాడు తల్లిని వెదుక్కుంటూ ఇక్కడికి వచ్చి ఆమె పక్కన ఆశ్రయం తీసుకున్నాడు!

రుక్కు అభిమానంతో పిల్లవాడిని చూసింది. భర్త ఇంటి బయట మంచంమీద పడక, దోమతెర సర్దుతూ కనిపించాడు. కాని ఆమెని ఎక్కువగా ఆకర్షించిన దృశ్యం ఆ నిద్రపోతున్న పిల్లవాడే. పిల్లవాడిని భుజంమీద మోసుకొని గబగబమని ఇంట్లోకి నడిచింది. తను కన్న పిల్లవాడు కాకపోయినా, ఆమె భుజం, పొట్ట బరువుగా కనిపించాయి. దేహంలో ఆయాసం లేదు, మనసులో మాత్రం బాధ: 'నాకు వెన్నెల విందు వద్దు; కాని నిండు వెన్నెలలో నిద్రపోవాలనే ఆకాంక్ష మాత్రం ఉంది. అది నా భర్తకి బోధపడదేం?' అనే నిరాశ మిగిలింది.

ఇంటిలో విశాలంగా పరిచియున్న పడకమీద రుక్కు మణిని పడుకోబెట్టింది; తనూ పక్కనే వాలింది. "వాడెంత సేపు బయట నిద్రపోయాడో? పిల్లవాడి బొందెలో బలం లేదని తెలియవద్దూ?" అని అంటున్న భర్త మాటలు ఏదో కలలో వింటున్నట్లు అనిపించాయి; ఇంటిబయటనున్న మంచాలు, ఆకాశంలోని వెన్నెల కూడా తన కలలో కనిపించే దృశ్యాలేమో అని రుక్కు ఆశ్చర్యపడింది. 'నువ్వూ, నేనూ ఈ నాలుగు గోడల మధ్యనే నిద్రపోవాలి!' అని మణికి సానుభూతి చూపుతున్నట్లు వాడిమీద చేతులు జోడించుకొని తనూ మంచి నిద్రలో కలిసిపోయింది.

ఆమె భర్తకి ఎందుకీ మొండితనం? గర్భవతి భార్య బయట నిద్రకి ఎందుకు ఈశ్వరన్ వద్దన్నాడు?

ఆ ఆక్షేపణ రుక్కుకే, కారణం మణి. పిల్లవాడి దుర్బల దేహంకి ఈ వెన్నెల రాత్రిలో నిద్ర మంచిదికాదు అని ఆమె భర్త భయం. అది రుక్మిణికి తెలియదా? తెలుసు, కాని దాని గురించి ఆమె లెక్క చెయ్యదేం? అదే అతనికి బాధగావుంది. కావాలంటే రెండు రోజులు ఈశ్వరన్ మణికి సాయంగా ఇంటిలో నిద్రపోవచ్చు అని రుక్కు చెప్పివుంటే ఎంత బాగున్ను? కాని ఆమె అలా ఏమీ అనలేదే?

రుక్మిణి మణికి సవతితల్లి; మణిని కన్న తల్లి పోయింది. మణిని తన బిడ్డలాగ పెంచవలసిన బాధ్యతని రుక్మిణి దుర్భావం లేకుండా నిరవేర్చినా, ఆమె భర్త మనసులో ఒక విధమైన చిరాకు, అనుమానం నిలిచిపోయాయన్నది నిజం; ఆ భావన న్యాయమని, అది ఎన్నడూ మారదనే చింత రుక్కు మనసులోనూ ఉంది. కాని మణి తనదగ్గఱ ఎటువంటి ఎడబాటు లేకుండా, అనురాగంతో మెలుగుతున్నాడని తెలుసుకొని ఆమెకి తృప్తి కలిగింది.

ఆ రోజు పొద్దుట లేవగానే రుక్కు శరీరంలో నొప్పి, అలసట కనిపించాయి. మనసుని దుఃఖం, వేదన ఆవరించుకున్నాయి. ఇటీవల ఆమె భర్త కొంచెం ఎక్కువగానే ఆమెతో చిరచిరలాడుతున్నట్టు కనిపిస్తున్నాడు.

'ఇంకా కొన్ని రోజుల్లోపాప పుట్టిన తరువాత నేనుకూడా మణితో . . . '

ఆమె ఏదో ఆలోచిస్తోంది, ఇంతలో మణి "అయ్యయ్యో . . . అమ్మా! . . . అమ్మా!" అని కేకలు పెట్టాడు.

"ఏంట్రా? ఏమైంది నీకు?" అని రుక్కు లేవడానికి ప్రయత్నించింది.

"నిప్పు . . . నిప్పు . . . " అని ఏడ్చుకుంటూ తల్లి దగ్గరకి పిల్లవాడు వచ్చేసాడు; మణికట్టులో కాలిన గాయపు మచ్చ పెద్దదిగా కనిపించింది.

"ఎందుకురా ఆ పొయ్యిదగ్గరకి వెళ్ళావ్? నీకెన్నిసార్లు చెప్పాలి? వింటేనా మరి? రా ఇక్కడికి!" అని అదమాయించుతూ గాయంమీద రుక్కు కొబ్బరినూనె మెల్లగా ఒత్తింది.

అదే ఆమెకి తెలిసిన ప్రథమ చికిత్స; చేతులూపుతూ అవస్థ పడుతున్న పిల్లవాడిని ఒడిలో పెట్టుకొని ఊరడించింది.

"వంటగదిలో ఏంచేసావ్? చూడు, కుంపటిలోని కట్టె తగులుకుంది. అల్లరి చేస్తే ఇలాగే అవుతుంది."

"అల్లరి చెయ్యలేదమ్మా, నిప్పుతో ఆటాడాను!" అని నవ్వుతూ ముచ్చటలాడే పిల్లవాడిని చూసి రుక్కు కూడా నవ్వింది.

"నీకసలు అల్లరి, ఆటా అంతా ఒకటేకదా? చూస్తే నాన్నగారుకి కోపం వస్తుంది . . . "

తల్లి అలా అంటూంటే ఇంటి అరుగున చెప్పుల సందడి వినిపించింది; ఈశ్వరన్ వార్తాపత్రికతో గడప దాటి వచ్చాడు.

"ఏమైంది? నాన్నగారికి ఎందుకు కోపం రావాలి?"

రుక్మిణి వివరించి చెప్పింది; మణి తన మణికట్టు చూపించాడు. ఆ గాయంకి కారణమైన కొఅవినికూడా ఈశ్వరన్ చూసాడు. "హూం! ఈ చిన్న ఇంటిలో మన కళ్ళకెదురుగా పిల్లవాడు మెలుగుతుంటేనే మన కావలి ఇలాగుంది; దానికి బదులు ఒక పెద్ద బంగళాలో అసలు ఏంజరిగిందో మనకి తెలియదనుకో, అదెలా ఉంటుందో?" అని తను అన్న నిష్ఠుర మాటలు రుక్కు మనసుని నొప్పించాయని తెలిసినా ఏమీ లెక్క చెయ్యక ఈశ్వరన్ అక్కడనుంచి నిష్క్రమించాడు.

రుక్మిణి మరేం అనక చేదుని మింగింది; అడగాలని తోచిన ప్రశ్నలన్నీ అణగదొక్కుకుంది; కళ్ళు తడిచేసుకోలేదు. 'అమ్మ ఏడ్చింది!' అని మణి ఎవరితోనైనా చెప్తే ఏంకాను?

అసలు ఆమె పడుతున్న బాధ ఆ పిల్లవాడికి తెలియదే? నాన్నగారి ఉగ్రమైన మాటలూ, తల్లి మనసులో చెలరేగుతున్నభావనలూ వాడికి ఒకేలాగ అనిపించాయి. రెండు రోజుల్లో మానుకునే గాయం వాడి అల్లరి, తుంటరి చేష్టలతో బాగవలేదు: గాయకట్టుని విప్పేసి మణి పరుగులు తీస్తున్నాడు; సుళువుగా మన్నూ, నీరూ గాయంని మలినపరిచినా వాడు లెక్క చెయ్యటంలేదు. ఒక రోజు పొక్కులున్న గాయంమీద వెదురుకొమ్మ తగిలి, బాధ తాళలేక ఏడ్చాడు. ఇంకొక రోజు వంటగదిలో పనిముట్టు పాత్రలున్న బల్లని విసనకట్టితో ఆడించడంతో ఆ గిన్నెలన్నీ నేలమీద రాలాయి; కుంపటినుంచి ఏదో ఒకటి  మణి తలమీద పడింది. అదేమో పనికిరాని వస్తువే, కాని ఈశ్వరన్ రుక్మిణిని ఈసడించడానికి అది వాటంగా దొరికింది.

"మంచి వేళ! అందులో నిప్పు లేదు! అది మన మంచికే!" అని ఈశ్వరన్ అన్నాడు; ఆ మాటల్లో పొంచివున్న కటూక్తి విని రుక్కుకి పట్టరాని కోపం వచ్చింది.

"నాకేం మతి పోయిందా ఆ బల్లమీద కుంపటీ, నిప్పూ పెట్టాలని? అది మణి తలమీద పడాలి, వాడిని కాల్చి చంపాలి అనే కసి నాకు లేదు! ఇక ఇలాంటి మాటలేవీ అనవద్దు!" అని భర్తని బతిమాలింది; కళ్ళు బాగా తడిసిపోయాయి. ఇన్ని రోజులూ ఎన్నో ప్రశ్నలని తన గుండెలో అణచుకొని ఊరుకున్న రుక్కు ఇక ఇవాళ తాళలేక అడిగేసింది.

ఐతే, ముఖ్యంగా ఆ ప్రశ్న అడిగినది ఆమె చేసిన పెద్ద పొరబాటు; ఈశ్వరన్ ఇంకా కఠినంగా భార్యని నిందించాడు.

"ఓ, అలాగా? ఆ దుర్బుద్ధి లేదని నీకు బాధగా ఉందా?"

కానుపు తేది దగ్గరకి రానూ రానూ రుక్కుని అర్థంకాని భయం ఆవరించుకుంది. కానుపుకి తను పుట్టినిల్లు వెళ్ళడానికి భర్తకి ఇష్టం లేదు; అక్కడకి వెళ్తే మణిని ఎవరు చూసుకుంటారు? "ప్రసవంకి ఒక నెల ముందు మీ అమ్మ వస్తే సరిపోతుంది!" అని ఈశ్వరన్ భార్యకి చెప్పేసాడు.

తల్లి బతికి ఉన్నా రుక్కుకి తగిన సమయంలో సహాయం, ఆదరణ దొరకలేదు. నొప్పులు వచ్చి ఆమె ఆసుపత్రి చేరుకున్న తరువాత వచ్చిన టెలిగ్రామే ఆ తల్లిని ఆమె దగ్గఱకి లాగ్గొని వచ్చింది.

తల్లి కొత్త బిడ్డని కూతురుకి చూపించింది: "ఇదిగో చూడు, నీ అబ్బాయి!" అని తనకి దొరికిన అమ్మమ్మ అనే స్థానంకి గర్వపడుతూ మాటాడింది.

"హూం, చూసాను . . . పాప కాళ్లూ, చేతులూ, కళ్ళూ, ముక్కూ - అన్నీ సరిగ్గానే ఉన్నాయికదూ?"

"అవేం మాటలు? నీ కొడుకు పూర్ణచంద్రుడులాగ ఉన్నాడు . . . మీ ఆయన వచ్చి చూడనీ, అలాగే మురిసిపోతారు!" అని అంటూ తల్లి చిరునవ్వు నవ్వింది.

రుక్కుకి మాట్లాడానికి అలసటగా ఉంది; మరేం అనక తన శిశువుని తలనుంచి జాగ్రత్తగా చూస్తూ వచ్చింది.

అదేంటి? ఆ చిన్ని చేతుల్లో ఒకటి . . .

"అమ్మా!" అని రుక్కు తల్లిని పిలిచింది.

"ఏమిటమ్మా రుక్కూ? ఏం కావాలి?"

"ఈ కుడి చెయి చూసావా? నల్లగా, ఎంత పెద్దగా కనిపిస్తోంది! ఇదేం మచ్చ . . . "

"అవునే! చాలా పెద్ద మచ్చ! కుడి చెయిలో . . . మగ పిల్లవాడికి అది ఆదృష్ట మచ్చ! నేను చూడలేదే?" అని తల్లి ఆశ్చర్యపడింది. ఆ తరువాత ఆవిడ శిశువు దేహమంతా పరిశీలించి చూసింది; మరేం మచ్చ కనిపించలేదు.

అప్పుడే ఈశ్వరన్, మణి వచ్చిచేరారు.

"ఏమైంది చెయికి? దెబ్బ తగిలిందా?" అని జంకుతూ ఈశ్వరన్ బిడ్డ చెయి చూసాడు. అది చూసి రుక్కు చిరునవ్వుతో "అది పుట్టు మచ్చ . . . మణి చెయిలో ఉన్నట్టు . . . " అని చెప్పింది.

"మణి చెయిలో ఉండేది పుట్టు మచ్చ కాదు, గాయపు మచ్చ! రా రా మణి, మనం వెళ్దాం!" అని ఈశ్వరన్ బయలుదేరాడు.

మణికి అక్కడే ఉండాలని ఆశ; తండ్రి చెయి పట్టుకొని లాగినప్పుడు "అబ్బా . . . " అని ముఖం చిట్లించుకున్నాడు.

"ఏంరా, నీకింకా నొప్పి పోలేదా?" అని అడుగుతూ, రుక్మిణిని చూస్తూ, ఈశ్వరన్ కొడుకుతో నిష్క్రమించాడు.

రుక్కు నిట్టూర్పు విడిచింది.

మరెవరూ చూడని సమయంలో రుక్కు తన శిశువు చేతులు తీసుకొని ముద్దు పెట్టుకుంది; ఒక చిన్న గడియారంలాగ ఆ బిడ్డ మణికట్టులో పుట్టుమచ్చ ఉందని, దాన్ని తల్లి 'అదృష్ట మచ్చ!' అని వర్ణించినది రుక్కు మరిచిపోలేదు.

'ఓర్పుతో అన్నీ భరించు! పరిస్థితులు మంచిగా మారుతాయని ఆశించు!'

ఇదేనా ఆ మచ్చ తనకి చెప్పే సందేశం?

భార్యని చూడడానికి, పాపని చూసి మణి ఆనందించాలని, ఈశ్వరన్, మణి ఇంకొకసారి వచ్చారు. ఆ సమయంలో ఆసుపత్రి ప్రసూతి భాగంలో డాక్టరు వాడుకగా రోగులని పరిశీలన చేస్తున్నారు. తల్లీ, శిశువుగా ఉంటున్న రుక్కు మంచం దగ్గర

రాగానే, పక్కనే నిలబడివున్న తండ్రిని, కొడుకుని చూసి అతను తన అభివందనలు తెలియజేసారు; మణిని, వాడి చెయిని ఉత్సుకతో చూసారు.

గభీమని "చాలా వింతగా ఉందే!" అన్నారు అతను. చెయిని చాటి అలవాటుగా బొబ్బని అందరికీ చూపే మణి "పాపకి ఇలాగే ఉంది!" అని చెప్పాడు.

"నేను కూడా చూసాను సార్; నాకూ ఆశ్చర్యంగా ఉంది . . . ఇదేం మచ్చా లేక దెబ్బ . . ."

భర్తకి ముందే జోక్యం చేసుకొని రుక్కు డాక్టరుకి వివరించి చెప్పింది:

"అవునండీ, మణి చెయి కాల్చుకున్నాడు: అది చాలా రోజుల ముందు; అది ఇంకా మానలేదు. ఇంతలో ఆ గాయం మళ్ళీ గుచ్చుకున్నాడు . . . మీరు వాడికి కొంచెం చెప్పండి . . . "

"రుక్కూ . . . డాక్టరుగారు ఏమంటున్నారో విను . . . "

డాక్టరు వాత్సల్యంతో, స్వాభిమానంతో రుక్కుని చూసారు; కొత్తిగా మెరసిన తలని వంచి ఆ చిన్నిచెయిలోని మచ్చ చూసారు.

"అవును . . . నాకు బోధపడింది . . . తల్లి ప్రేమంటే, ఇదే. ఈ పిల్లవాడి గాయం మానలేదని బాధ పడుతూ మీరు దాన్నే రోజూ చూస్తూ ఉండిపోయారు; ఆ జ్ఞాపకమే, అలాగే, మీ కడుపులోవున్న శిశువుకి ముద్ర వేసేసింది! అదే జాగా! అదే ఆకృతి! ఇది దేవుని సృష్టిలో మనకి కనిపించే ఒక విచిత్రం - తల్లి ప్రేమ ఘనత! మీరేమంటారు సార్?"

డాక్టరు ఆవేశంతో మాటాడుతున్నప్పుడు అతని 'అజ్ఞానం' బట్టబయలు చెయ్యాలని ఈశ్వరన్ తొందరపడ్డాడు.

"సార్, నేను చెప్తే మీకు కోపం రావచ్చు. మణి దాని సొంత కొడుకు కాదు, సవతి కొడుకు! మీరు తల్లి ప్రేమ అనేసారు! మణి అమ్మ పోయి మూడు సంవత్సరాలైపోయాయి!" అని చెప్పి ఒక చిలిపి నవ్వు నవ్వాడు.

ఒక క్షణం నిర్ఘాంతపోయి, డాక్టరు వెంటనే నిదానించుకున్నారు. రుక్మిణిని చూసారు. ఆమె మనసులోని బాధ అతనికి బోధపడింది. మణి భుజాలమీద తన రెండు చేతులూ ఆనుకున్నారు. మానవ సేవకి ఉపయోగించే చేతులవి. అతని

ధోరణిలో సేవ, భంగిమలో అనురాగం, మాటల్లో సహానుభూతి కనిపించాయి. “ఓ, అలాగా? మీ అబ్బాయి చాలా అదృష్టవంతుడు సార్! కన్నతల్లిని మించి తన్ను ప్రేమించే తల్లి అతనికి దొరికింది! ఈ శిశువుకూడా ఏం సామాన్యమైన బిడ్డ అని అనలేం! తల్లి ఘనత నిరూపించడానికి వచ్చిన బాలుడు! ఆ చెయిలోని మచ్చ చాలు, అది దేవుడు మీ కుటుంబానికి ఇచ్చిన రక్ష! నా అనుభవంలో నేను చాలా అద్భుతాలు చూసివున్నాను; ఇదీ నాకు ఒక మంచి అనుభవం!” అని అంటూ అతను నిష్క్రమించారు.

********

**(మూలం, ప్రచురణ: కుముదం, సెప్టెంబరు 9, 1953)**

# పదం తప్పింది[1]

పశుపతికి సుదీర్ఘ జీవితం. ఐతే అందువల్ల ఆయనకి జీవితంమీద విరక్తి కలగాలా? చాలాసార్లు ఆయన చపలమనస్కుడైపోతూకూడా మరల మనస్సుని స్వాధీనపర్చుకుంటూ ఉండేవాడు. కారుణ్యం, దయ, అప్యాయతలు విసర్జిస్తూ కొన్ని సమయాల్లో అతను ఒక మునివంటి జీవితం కొనసాగినప్పటికీ, జీవితంమీద ఆశని కోల్పవలసిన అగత్యం లేదు. నిర్లిప్తతో ఆయన జీవితాన్ని ఇంకా కొంచెం తేలిగ్గా తీసుకోవచ్చుకదా అని ఎవరికైనా అనిపించవచ్చు. పవిత్ర కాశీకి వెళ్ళాలనేది అతని గాఢమైన కోరిక. దానికి కారణం విరక్తి కాదు; అదొక తీవ్ర వాంఛ!

గతంలో ఒకసారి కాశీ వెళ్ళి పవిత్ర గంగాస్నానం చేసి ఉన్నందుకు అతను ఎంతగానో తృప్తిపడ్డారు. ఐతే ఆ పట్టణం, దాని ప్రాశస్త్యం ఆయన ఇప్పుడు పూర్తిగా మరిచిపోయారు. సముద్రతీరాన అవసరమైనవారికి మార్గదర్శకంగా కనిపించే దీపస్తంభంలాగ తన కుటుంబంతో కలిసివుండాలన్నదే ప్రస్తుతం అతని లక్ష్యం. ఆ విధంగా అతను తనువు చాచించేవరకు బౌతిక బాధ్యతలు నెరవార్చాలన్నదే ఆయన కోరిక. ఇప్పుడు ఆయన మనవడు పశుపతీశ్వరన్ కాశీ విశ్వవిద్యాశాలలో రెండేళ్ళ చదువుకోసం వెళ్ళడంవలన ఆయనకి కాశీ వెళ్ళాలనే వాంఛ మళ్ళీ మొలకెత్తింది.

ఆ అబ్బాయికి ఇదే మొదటిసారి వేలమైళ్ళ దూరంలోవున్న ఒక మహానగరానికి చేసే ప్రయాణం. అంత దూరంలోవున్న కాలేజిగురించి తనాలోచిస్తూ "ఏంరా, కాశీకి వెళ్ళాలనిపించే అంత వయసా నీకు?" అని పశుపతి మనవడిని ఆటపట్టించేవారు. ఆ అబ్బాయి తల్లికి ఎంతమాత్రం

---

[1] ఇది కే.వి. శేషారావుగారు అనువాదం

ఇష్టంలేదు ఈ ప్రతిపాధన. "వాడెప్పుడూ ఉత్తరదేశానికి వెళ్ళి ఉండేలేదు!" అని ఆవిడ అందరికీ చెప్తూండేది. ప్రముఖమైన కళాశాలలో మాస్టర్ డిగ్రీకి చదవడానికి ఆ ప్రయాణం అన్న ఒకే విషయానికి ఈశ్వరన్ ఉబ్బి తబ్బి పోయాడు. "తాతయ్యా మీరుకూడా నాతో వస్తారా?" అని గేలించాడు.

"నువ్వు నన్ను అడుగుతున్నావా? అది మర్చిపో!" అని నవ్వుతూ పశుపతి సమాధానమిచ్చారు. ఈ లోగా ఇతర కుటుంబ సభ్యులు ఈశ్వరన్ ప్రయాణంకి కావలసిన ఏర్పాట్లలో కలుసుకున్నారు. ఇంటి వాకిట్లో ఒక ఎద్దుబండి నిలబడి ఉంది.

"ఈశ్వరా, అక్కడ నువ్వు హాస్టల్లో ఉంటావు; ఏదో ఒకరోజు అకస్మాత్తుగా నేను ప్రత్యక్షమవుతాను అనుకో. నేనుకూడా నీతో ఉండవచ్చనుకుంటాను, సరేనా? కొంచెం వాకబు చేసి కనుక్కో. నేను నాలుగు నెలలపాటు అక్కడ ఉండేందుకు జాగా దొరుకుతుందేమో చూడు. నేను వస్తాను, నాకా పవిత్ర స్థలానికి రావాలనిపిస్తోంది," అన్నారు పశుపతి మనవడితో.

"ఓ, తప్పకుండా తాతయ్యా," అని మాట ఇచ్చాడు ఈశ్వరన్. "అమ్మా, నాన్నకూడా మీతోబాటే రావాలని ఉంది నాకు."

"సెలవల్లో మాతో గడపడానికి రా అన్నయ్యా," అని అడిగింది ఈశ్వరన్ చెల్లెళ్ళలో ఒకామె, ఆతృతతో.

"నువ్వు రాకపోతే తాతయ్యే మమ్మల్ని నీ దగ్గరకి తీసుకువస్తారు!" అన్నది ఇంకొక చెల్లెలు. తాతయ్య సహకారం ఎప్పుడూ ఉంటుందన్న నమ్మకం ఆమెకి ఉన్నాకూడా ఇప్పుడు అన్నయ్యని అర్థిస్తున్నట్టు అతని చెయిపట్టుకొని వేడుకుంది.

ఇక్కడేమో జరుగుతోంది, అన్నయ్య సరదాగా దూరదేశ ప్రయాణం చేస్తున్నాడు అని చిన్న తమ్ముళ్ళు వలయవస్తూ, ఆనందంగా గెంతులేస్తున్నారు.

ఎలాగైతేనేం, ఈశ్వరన్ అందరి చేతులు విడిపించుకొని ఎద్దుబండిమీద సామానులు సర్దుకొని కూర్చున్నాడు. రైలు స్టేషన్ లో వీడ్కోలు చెప్పడానికి తండ్రి వెంటవెళ్ళారు.

"అన్నయ్య ఎప్పుడు కాశీ చేరుకుంటాడు? కాశీ ఎలా ఉంటుంది?" అని పిల్లల లక్ష ప్రశ్నలకి సమాధానం చెప్పారు తాతయ్య; అవన్నీ గుర్తుండే వయసు ఆయనకి దాటిపోయింది. "నేను వాటిగురించి ఎందుకు మాటాడుతున్నాను?" అని తనని తనే ప్రశ్నించుకున్నారు అతను. కాని ఆతృతతో వినేవాళ్ళు ఉన్నంతవరకూ ఆయన తన సహజ హాస్య ధోరణిలో, ఓపికతో వాళ్ళకి సమాధానం చెప్పారు.

** ** **

ఇప్పటివరకు ఈశ్వరన్ కుటుంబ సభ్యులు అతనితో ఎడబాటు ఎరుగరు. అందువలనే చాలా దూరదేశానికి అతను వెళ్ళుతున్నాడని వాళ్ళు కొంచెం ఆందోళణ, అలసటతోబాటు పడుతున్నారు. ఇటీవల వార్తాపత్రికలలోని కొన్ని సంఘటనలు వారి ఆరాటంకి మరికొంత ఎగదోసాయి. ఉత్తరాదిన వర్షకాలంలో అక్కడి జనులు ఎదురుకొనే వరదలు ఇతి బాధలు సర్వసామాన్యం. ఇప్పుడు ఈశ్వరన్ ఉత్తరాదిలో ఉండడం వలన వార్తల్లో వచ్చే అక్కడి సంఘటనలపట్ల ఆ కుటుంబ సభ్యులు మరింత ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ సంవత్సరం వరదలు మునపటికన్నా తీవ్రస్థాయిలో ఉండడమే కాకుండా వాటివలన ఎక్కువ నష్టం వాటిల్లిందని చదివి, గాబరా పడిపోయి, "అక్కడ ప్రమాదభరితంగా ఉండడం వలన వెంటనే బయలుదేరి తిరిగి వచ్చేయ్!" అని ఈశ్వరన్ కి టెలిగ్రాం ఇచ్చారు.

ఈశ్వరన్ తన సొంత ధోరణిలో టెలిగ్రాం ద్వారా స్పందిచ్చాడు: "రోడు ప్రయాణికులకే పరిస్థితి ప్రమాదకరం. రైలు రాకపోకలు పాక్షికంగానే దెబ్బ తిన్నాయి. నేను ఇంటికి రావలసిన అవసరం లేదు. నా గురించి ఆందోళన

చెందడం మానుకోండి." ఏదైనా టెలిగ్రాం అని వస్తే చాలు - అందులో ఏముందో తెలియకుండానే - వాళ్లమ్మ భయపడిపోయింది. ఒక వేళ అబ్బాయికి ఏదైనా అపాయం లేక - ఇంకా భయంకరంగా- చనిపోయాడని వార్త వస్తే? ఆవిడ కంగారుకి ఇంకా బలం చేర్చేలాగ ఆ టెలిగ్రాం చేతిరాతిలో ఒకటి రెండు పదాలు స్పష్టంగా లేకపోవడం వలన చదువుతున్న అతను తడబడుతూ, ఆగుతూ చదివాడు. ఈ గందరగోళమంతా కొద్దిక్షణాలే అయినా, అదే ఆ తల్లి భరించలేకపోయింది. ఈశ్వరన్ సరైన సందేశమే ఇచ్చాడు. కాని అతని పదాలు ఎవరో తప్పుగా మార్చేసారు.

ఎలాగైతేనేం, ఆ కుటుంబ సభ్యులు మెల్లగా మూడు మాసాలు గడిపేసారు. ఇంతలో దశరా సెలవులు వచ్చాయి. నిజానికి జరిగినవి కొన్ని నెలలే ఐనా, ఆ కుటుంబ సభ్యులకి అదే ఎంతో కాలం జరిగిపోయిన భావన కలిగింది. "సెలవులకి నేనింటికి వస్తాను," అని అనడానికి ఈశ్వరన్ మొగమాటం పడ్డాడు. ఐనా తల్లిదండ్రులు తిరిగి జవాబు రాసారు: "అవును, అది బడలికతో కూడిన ప్రయాణమే. ఐనా నీకు రాగలుగతే రావచ్చుగా?" అని. ఖర్చులు ఈశ్వరన్ అనుకున్న ప్రయాణం ఆపగలుగుతాయా? అందువలన ఒక ఉదయాన్న ఈశ్వరన్ ఇంటికి చేరుకున్నాడు. కుటుంబంలో సభ్యులందరికీ ఏదో ఒక బహుమతి తీసుకువచ్చాడు.

ఇంతకుముందెప్పుడూ కాశీ వెళ్ళివుండనట్టు పశుపతి ఆ నగరంగురించి ఏవేవో ప్రశ్నలు అడిగారు. ఒక చిరునవ్వుతో ఈశ్వరన్ సమాధానం చెప్పాడు: "తాతయ్యా, బెనారస్ లో ప్రతి ఒక్కరూ చూడవలసిన స్థలం మా విశ్వవిద్యాలయం."

"అది నేను చూడలేదే? ఈ సారి నీతో తప్పకుండా వస్తాను," అని దృఢంగా పశుపతి అన్నారు. కొంచెం ఆగి, చూడు ఈశ్వరా, మీ అమ్మా, నాన్నలు నీ గురించి బెంగపెట్టుకున్నారు. అస్తమానం నీ గురించే మాటాడుతున్నారు -

నువ్వేం తింటున్నావో, ఏం చేస్తున్నావో, అని. మరి నీ గురించి నేనెందుకు బాధ పడనో నీకు తెలుసుకోవాలని ఉందా? నీకు తెలుసుకదా నేను బెనారస్ వెళ్దామనుకుంటున్నానని? అందుకనే నీ గురించి నేనేమీ బాధపడను. అంతేకాదు. సంవత్సరాలు తరబడి నాకు కావలసిన వాళ్ళకు దూరంగా ఉండే అలవాటుంది నాకు. ఇంటి గురించి, కుటుంబం గురించి ఆలోచనలు లేకుండా ఇక కాశీలో నాలుగు మాసాలు గడపాలని నా ఆశ," అన్నారు పశుపతి; ఇప్పుడు అతని తలపంతా బెనారస్ మీదనే.

"తాతయ్యా, మీరు ఇంటిదగ్గర ఉన్నారు కాబట్టి బెనారస్ గురించే ఆలోచిస్తున్నారు; కాని మీరొకసారి బెనారస్ చేరుకుంటే అప్పుడు మళ్ళీ ఈ ఇంటిగురించి, చిరపరిచితమైన ఈ పరిసరాలు గురించే ఆలోచిస్తారు," అన్నాడు ఈశ్వరన్, నవ్వకుండానే. అతను స్వానుభవంతో చెప్తున్నాడు ఆ మాటలు. ఇంటినుంచి దూరం వెళ్ళిపోయిన తరువాతనే ఈశ్వరన్ స్వగ్రామంలో ఉన్నప్పటి ఆనంద ఘడియలు, తాను తనకి నచ్చిన స్థలాలోనే, తోటల వెంబడి పెరటి నూతి గట్టున ఉన్న చెట్లూ, చేమలూ, నడవలోవున్న ఉయ్యాల - మొదలైనవి గుర్తుచేసుకొని ఆనందించేవాడు.

"అది నిజమే బాబు," అన్నారు పశుపతి. అక్కడితో ఆ సంభాషణ ముగిసింది. తన కొడుకుతో మాటాడాలని వంటింటిలోవున్న తన కోడలు - అదే ఈశ్వరన్ తల్లి - ఎదురుచూస్తున్న సంగతి ఆయనకి ఎరుకే. ఆ అబ్బాయి తండ్రి తీరే వేరు. తానేమిటి, తన వృత్తేమిటి తప్ప తనకి సంబంధంలేని విషయం పట్టించుకోనట్లు కనిపిస్తాడు; అబ్బాయి రాగానే యధాలాపంగా కుశలప్రశ్నలతోనే అతనికి తృప్తి కలుగుతుంది; కాని ఆ తల్లి సంగతి అలా కాదు.

ఆ పదిహేను రోజుల శెలవులు ఈశ్వరన్ బాగా ఆస్వాదించాడు. తనకిష్టమైన కలకండ మళ్ళీ తిన్నట్టు, శెలవల తరువాత కళాశాలకి తిరిగవెళ్ళే ఏర్పాట్లు చేసుకుంటూంటే పశుపతి మళ్ళీ మనవడితో హాస్యాలాడారు:

"ఏంరా బాబు, కనీసం మాటవరుసకైనా కాశీకి రమ్మని నన్నుపిలవకూడదా? నువ్వే ఒకసారి ఆ కుతూహలం నాలో రెచ్చగొట్టావు కాబట్టి నా మనసంతా దానిమీదే ఉంది!"

"మొట్టమొదటిసారికూడా మీరలాగే మనసుపడ్డారుకదా?" అని ఈశ్వరన్ తాతయ్యకి గుర్తుచేసాడు. ఇప్పుడు నేనే హాస్యానికి అన్నట్టు అడిగితే ఏం ప్రయోజనం? మీరు ఇంతకుముందే అన్నట్లు నాతోబాటు ఎన్నరోజులు హాస్టల్లో ఉండగలరు?"

"ఊళ్ళో ఏదైనా బస ఏర్పాటు చూడమని చెప్పలేదా నేను? ఏదైనా లాడ్జి లేక ధర్మసత్రమైనా పరవాలేదు. ముసలాణ్ణి నేను, హాస్టల్లో ఎలాగ ఉండగలను చెప్పు!"

"ఓ, తప్పకుండా, తాతయ్యా! ఈ సారి ఎలాగైనా ఏర్పాటు చేసేస్తాను; మీరు మాత్రం తప్పక రావాలి. ఇప్పుడు నాకు తెరియవచ్చింది కాబట్టి నేను ఇప్పుడు తప్పక చూడగలననే నమ్మకం కలిగింది."

"అంత మాటలన్నావే, అదే పదివెలు నాకు. తొందరలేదులే; తీరుబాటుగా చూడు. అందుకోసం నువ్వేం ఎక్కువ శ్రమ పడవద్దు నాయనా?" అన్నారు పశుపతి. ఈశ్వరన్ తాతయ్యని కృతజ్ఞతతో చూసాడు. తనిచ్చిన మాట తప్పకుండా అమలు చెయ్యమని ఆ గొప్ప వ్యక్తి వత్తిడి చెయ్యలేదు. ఒక చిన్న మాట ఇస్తే చాలు. పాపం పశుపతి! మరి ఆయన ఇతర కొడుకులూ, అప్యాయమైన కోడళ్ళూ, మనవలూ ఎందుకని అతనిమీద మొరబెట్టుకున్నారు? ఆ ఇంటిలో అందరూ అతన్ని అక్షరాలా ఆరాధిస్తున్నారే? బహూశా ఈశ్వరన్ తండ్రి ఆయన సంతానంలో ఆఖరివాడైనందువల్లనేమో?

కుటుంబ సభ్యుల దగ్గర  శెలవు తీసుకొని ఈశ్వరన్ కాశీకి బయలుదేరాడు. మునపటిలాగ భయం, ఆందోళణ, ఉత్కృతలు లేకుండా  పూర్తి సంతోషంతో కనిపించాడు.  శెలవులు బహుకొద్ది రోజులే  ఐనా, అదే ఒక విధంగా మెరుగే అయింది; తనవాళ్ళని విడిచిపెట్టినందుకు బాధనిపించలేదు. బెనారస్ లో తన్నుకూడా స్వాగతం పలిక మిత్రులున్నారు. క్లాసులుంటాయి. వాళ్ల వాళ్ళ పాఠాలని చెప్పించుకోడానికి సహాధ్యాయి అమ్మాయిలుంటారు.

"ఈ అమ్మాయలూ చదువులో చురుకైనవారే!" అని ఈశ్వరన్ తనలో తనే అనుకున్నాడు. "వాళ్ళు ఒకింత ఓపికతో కలుపుగోలుతనం తగ్గించుకుంటే బాగున్ను!"

ఆ అమ్మాయిలే రేపు తనకుమించిన పెద్ద చదువులు చదువుకొని పెద్ద పెద్ద పదవుళ్ళో ఉండే భర్తలని ఆశించినప్పుడు తప్పక ఓర్మి, చనువు తగ్గించుకుంటారు. ఐతే వాళ్ళగురించి ఇంకా లోతుగా అధ్యయనం చెయ్యడానికి ఈశ్వరన్ కి అంత తీరుబాటు లేదు.

ఒక సంగతి మాత్రం యదార్థం; ఇప్పుడు అమ్మాయిలపట్ల కొంత శ్రద్ధ వహిస్తున్నమాట నిజం; భవిష్యత్తులో తనకు కాబోయే భార్యగురించి మరీను: ఆమె ఇప్పుడు ఎక్కడుందో? ఆమె పేరేమిటో? ఆమె భరతనాట్యం ఇష్టంగా అభ్యసిస్తుందో  లేక నీడపట్ట ఆటలు ఆడుతుందో? ఇప్పుడు కంటికి కనిపించకపోయినా అలాంటి యువతి ఎక్కడో ఉండితీరాలి!

ఇప్పుడు ఈశ్వరన్ ఆలోచనలు ఇంటివద్ద ఉన్న చెల్లెళ్ళమీదకి వెళ్ళాయి. గత మూడు నెలలో, ఆ ముగ్గురిలో పెద్దది ఈడేరింది.

రాబోయే నాలుగేళ్ళలో తన జీవితం ఎలా వెళ్ళబోతుందో అనే ఆలోచన పట్టుకుంది. తన చదువు పూర్తి ఐతేనే ఉద్యోగం; అదెక్కడ తన్ను తీసుకువెళ్తుందో? అప్పుడు తన చెల్లెలికి సరైన పెళ్ళికొడుకుని

పెదుకుతాడు.అంత ముఖ్య పాత్ర పోషింపబోతానన ఆలోచనే అతన్ని తబ్బిబ్బచేసింది.

అబ్బా! ఇంకా నాలుగేళ్ళు! బహూశా తాతగారు మరో రెండేళ్ళలో తన చెల్లెళ్ల పెళ్ళి చెసేయాలని పట్టుపడతారేమో?

వయసొచ్చిన అందమైన ఆడపిల్లలకి అవి తరిగిపోకముందే పెళ్ళిళ్లు చేసెయ్యాలని తాతయ్య అభిప్రాయం. “ఆడపిల్ల అందచందం స్కూలులోనే ఎందుకు అంకితం ఐపోవాలి?” అని అతను అడుగుతారు. “అందచందాలతో కూడిన ఆడపిల్లని పెళ్ళి చేసుకొని ఆ భర్త ఆనందించవద్దా? జీవితంలో ప్రతీదీ ఏ వయస్సులో జరగవలసిన కార్యక్రమమో, ఆ వయస్సులోనే జరగాలి!” అని అతని వాదం.

తన భావాలే సరైనవి, ఆచరించతగ్గవి అని తాతయ్య నొక్కి వక్కాణిస్తారు; ఆయన భావాన్ని బలపరిచే కొన్ని ఉదాహరణలుకూడా చెప్తారు. ఆ పరిసరాల్లోవుండే ఒక అమ్మాయిగురించి ప్రస్తావిస్తూ “ఆమెను నాలుగు సంవత్సరాలముందు చూసినది గుర్తుందా?” అని అడుగుతారు. “ఈ రోజు ఆమె పెళ్ళిలో చూసినవారికి వికృతంగా కనిపిస్తోంది!” ఇప్పుడు తన చిన్న చెల్లెలు పెళ్ళి ఎప్పుడు జరిపినా ఈశ్వరన్ కి ఆభ్యంతరం లేదు. ‘తాతయ్య చెప్పేది నిజమే!’ అని సమాధానం చెప్పుకున్నాడు; అతనెప్పుడూ తప్పుచెడు సలహా ఇవ్వరు!

తన ప్రయాణంలో ఈశ్వరన్ మనస్సు అనేక విషయాలపై వెళ్ళింది: తాతయ్య, ఆ తరువాత తన చిన్న చెల్లి పెళ్ళి విషయం, ఇలా ఏవేవో. ఐనా కాలేజీ చేరుకున్నాక ఈశ్వరన్ చదువులో మునిగిపోయాడు. రోజులు తొందరగా దొర్లిపోయాయి.

** ** **

ఇంటినుంచి ఈశ్వరన్ కి తరచూగా ఉత్తరాలు వస్తూండేవి. ఒకటి, రెండు తాతయ్య రాసినవికూడా ఉంటుండేవి; కాని ఒకసారికూడా తనకి ఈశ్వరన్ మకాం సరకూర్చేడా అన్న విషయ ప్రస్తావన ఉండేదికాదు. తాతయ్యకి ఈశ్వరన్ దగ్గరకి రావాలనే కోరిక ఉందనికానీ, బెనారసులో తాతయ్య విడిదికి ఏమైనా ఏర్పాట్లు జరుగుతున్నాయా అనిగాని ఇంటినుంచి ఏ ఒక్కరూ ఎప్పుడూ వాళ్ళ ఉత్తరాళ్ళో ప్రస్తావించలేదు. "నాతో వస్తారా, తాతయ్యా?" అని తను అడిగినప్పుడు తాతయ్య హాస్యమాడారేమో అని ఈశ్వరన్ ఆశ్చర్యపోయాడు.

ఒక రోజున స్నానఘట్టంలో ఈశ్వరన్ ఒక బంధువుని చూడడం జరిగింది. ఆనాడు సూర్యగ్రహణం అయివుండడంవలన, తన జన్మనక్షత్రం ప్రకారం ఆ రోజు తను శాస్త్రోక్తంగా స్నానం చెయ్యవలసివుంటుందని పశుపతి ఊశ్వరన్ కి రాసారు. ఆ బంధువు తను మరునాడే మద్రాసుకి వెళ్ళిపోతున్నానని ఉవ్విళ్ళూరింది. ఒక ఆలోచన మెరసింది: అదే రోజున తానింటికి బయలుదేరితే రెండు రోజుల్లో ఇంటిలో వాల్తాడు. ఆ మరుసటి ఉదయాన్నే ఇంటి భోజనం తినగల్గుతాడు. ఎంత చక్కగా ఆనందించవచ్చు! అలాగ కొంతసేపు ఆనంద డోలికలో ఊగీసలాడిన తరువాత మనసు సర్దుకొని తేలికపడింది. బహుశా, తాతయ్యకూడా ఇప్పుడు తనలాగే బెనారసు యాత్రగురించి ఆలోచిస్తుంటారేమో అని ఈశ్వరన్ కి అనిపించింది. ఈశ్వరన్ చదువుమీద శ్రద్ధపెట్టాడు; పరీక్షలు రాసి, ఎండాకాలం శెలవులకి ఇంటికి చేరుకున్నాడు.

కనురెప్పకూడా వెయ్యకుండా పశుపతి పూర్తి విశ్వాసంతో ఆడిగారు:

"ఈశ్వరా, నాకు విడిది ఏర్పాటు చేసేవుకదా, ఈ సారి నీతోకూడా నేను రావచ్చా?"

"లేదు తాతయ్యా! నాతో కలిసి బెనారస్ రావాలని మీకు నిజంగానే కోరిక ఉందా?"

"ఏమిట్రా అలాగ అడుగుతున్నావ్? నువ్వేం హాస్యమాడుతున్నావా లేక నిజంగానే అలా అడుగుతున్నావో చెప్పు!"

మనసు పనిచేసేది ఇలాగే. అది ఎడతెగకుండా నిగూఢమైన విరుద్ధాలతో పెనుగులాడుతుంది. ఆ వేదనలో ఉద్భవించే భావాలు బాహటంగానో లేక చాటుగానో కనిపిస్తాయి; కొన్ని లోతుగా పాతుకుపోతాయి.

తాతయ్యలో కనిపించిన ప్రతిస్పందనకి ఈశ్వరన్ కుంపించిపోయాడు; ఆ ముడుచుకున్న మొహం, ఆందోళణ, నిరాశ, అపనమ్మకంతో స్పష్టంగా కానవస్తున్న తీరు తాను క్షమించతగని పాపం చేసిన భావంతో అతని హృదయం వణికింది.

ఈశ్వరన్ తల్లితో "తాతయ్య చాలా తీవ్రంగా నిరాశపొందినట్లు కనిపిస్తోంది," అని అన్నాడు. "ఎవరైనా ఒకరు నాకు ఈ సంగతి రాసివుండవలసింది."

"ఏమిటో, అదెలాగో మా దృష్టిలో పడలేదే?" అంది ఆవిడ. "నీ చదువు మరొక ఏడాది ఉందికదా అనే సంతోషంతో మరింక నిన్ను ఈ విషయంలో వత్తిడి చెయ్యకూడాదనుకున్నాం. నీ నాన్న ఈ విషయాలు అసలు పట్టించుకోరు; మీ తాతయ్యకూడా ఆయన ఆలోచన ఏమిటో మాతో పంచుకోరు. పాపం, ముసలాయన! అతనికి నిజంగానే కొత్త వాతావరణంలో నాలుగు సెలలు గడపాలని ఉందేమో? ఈ సారి నువ్వు కాలేజీకి తిరిగివెళ్ళగానే ఆయన విడిదికి ఏర్పాటు చెయ్. మేంకూడా అతని కాశీ యాత్రకి తగిన ఏర్పాట్లు చేస్తాం. ఆయన వెంట వాంజీని తోడుగా పంపాలనుకుంటున్నాం. వాంజీ ఐతేనే తాతయ్యకి భోజన సదుపాయాలు చేస్తారు; అతన్ని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉంటారు. తాతగారు కాశీయాత్రకి నిజంగానే తహతహలాడుతున్నారనిపిస్తోంది; కాని మాతో ప్రస్తావించడానికి మొగమాటు పడుతున్నారు. ఈ విషయం నేను ఇప్పుడే గ్రహించాను."

వాళ్ళమ్మ వెళ్ళబుచ్చిన యదార్థం ఈశ్వరన్ని విస్మయపరచింది; ఆ విస్మయంకి బలం కూర్చారు వాంజీ.

“మీ తాతగారు సర్వ వేళలా కాశీయాత్ర గురించే ఆలోచిస్తుంటారు,” అన్నారు వాంజీ. “ఒకటి రెండు సార్లు నువ్వు అతన్ని ఆహ్వానిస్తూ ఉత్తరం రాసావని ఉత్తుత్తినే నాతో హాస్యమాడతారు.”

సరే, యదార్థమేమిటి? పశుపతి తన అంతరంగాన్ని వాంజీతోనే పంచుకుంటారు. ఇతరమాటలకొచ్చేసరికి తన కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉన్నప్పటికీ కాశీయాత్ర విషయంలో మాత్రం వాళ్ళతో ప్రస్తావన చెయ్యడానికి మనసొచ్చేదికాదు. “పురాణ చరిత్ర కలిగివుండడమూ, పుణ్యస్థలం కావడమూ అన్న మాట తప్ప, బెనారస్ కి గల ప్రాముఖ్యత ఏమిటి?” అని తనలో తనే అతను సమాధానపడేవారు. “అయినా నేనప్పుడే ఒక్కసారి వెళ్ళివచ్చానుకదా?” అని వాంజీతో హాస్యంగా అన్నట్టు అనేవారు. ఒకసారి పశుపతి “నా మనవడు నన్ను రమ్మని పిలుస్తున్నాడు, నావెంట రావడానికి సిద్ధమేనా?” అని వాంజీని అడగ్గానే, అతను “అయ్యో రామ, ఇంతకన్నా దురదృష్టమైన సమయం వేరొకటి ఉంటుందా? ఈ నెలలోనే మా ఆవిడ పురిటికి వెళ్తోంది!” అని అన్నారు. “సరేలే, మర్చిపో, నువ్వెప్పుడూ బెనారస్ వెళ్ళలేవు!” అని అన్నారు పశుపతి నవ్వుతూ.

పశుపతికి తోడునీడుగా ఉంటూ, కాస్త వార్చిపెడుతూ ఉండొచ్చు కాబట్టి అతనికి తోడుగా కాశీ వెళ్ళాలనే గాఢమైన కోరిక వాంజీ మనసులో ఉండేది. అది బలే చౌక బేరం కూడాను; తన జేబునుంచి ఏ ఖర్చూ లేకుండా కాశీయాత్ర చేసేయవచ్చు. తను కేవలం చిన్న గుమాస్తావే, ఐనా ఉద్యోగ రీత్యా, ఎవరికైనా తోడునీడుగా వెళ్ళడమో లేక వారి పనుల తరపున చేసిపెట్టడానికో వాంజీ సర్వసిద్ధంగా ఉండేవారు.

** ** **

ఈ సారి పూర్తిగా ఈశ్వరన్ ఎండాకాల శెలవులు ఇంటిదగ్గరే గడపాలని నిశ్చయించుకున్నాడు; తన చిన్ననాటి జీవితాన్ని మళ్ళీ అనుభవించాలని పూనుకున్నాడు. తనే స్వయంగా యెద్దులబండి తోలుకొని వెళ్ళి తోటలో సువాసనతో ఉన్న తాటిముంజెలు ఒక చోట నీడపట్టున కూర్చొని తిన్నాడు, లేత కొబ్బరి నీళ్ళు తాగాడు; ఎత్తైన మామిడిచెట్లెక్కి వెదలి బుట్టల్లో మామిడికాయలు నింపాడు. జీవితంలో ఇటువంటి చిన్న చిన్న అనుభవాలు మళ్ళీ మళ్ళీ అనుభవించాడు. తనకి ఈ అనుభవాలు మళ్ళీ ఎప్పుడు కలుగుతాయని ఎవరికి తెలుసు? 'శెలవులంతా ఇంటిలోనే గడపాలి!' అని నిర్ణయించుకున్నాడు.

కాని మనం అనుకున్నవన్నీ జరగవుకదా? తానొకటి తలుస్తే దేవుడు మరొకటి తలుస్తాడు.

పశుపతికి అకస్మాత్తుగా సుస్తీ చేసింది. "మరి నాకు వయసు మళ్లిపోతుందికదా, ఎవరికెరుక? ఆ పైవాడినుంచి పిలుపు వస్తోంది కాబోలు," అని అంటూ పశుపతి మనవడితో చలోక్తిగా అన్నప్పుడు ఈశ్వరన్ తన శరీరంలోని శక్తి పూర్తిగా వట్టిపోయిన భావంతో కలత చెందేవాడు; ఎంత త్వరగా ఈ శెలవులు పోతాయి, ఎంత తొందరగా తాను మళ్ళీ బెనారస్ కి తిరిగివెళ్ళి తాతయ్యకి అనుకూలమైన వసది ఏర్పాటు చేద్దామా అని ఈశ్వరన్ నిస్సహాయంగా యోచిస్తుండేవాడు; రోజులు దొర్లిపోవాలని ఆరాటం పడేవాడు. అందుకనే ఇప్పుడు స్నేహితుల ఆహ్వానాన్ని అందుకొని ఇతర పట్టణాలకీ, ఊళ్ళకీ వెళ్తుండేవాడు. ఈ క్రమంలో కొన్ని కుటీర పరిశ్రమల్ని చూడడం తటస్థించి తనలో ఏదో మార్పు రావడానికి దొహదపడింది. ఈ కొత్త అనుభవాలని ఆరాధిస్తూ చివరకి ఈశ్వరన్ బెనారస్ తిరుగు ప్రయాణంకి సిద్ధమయ్యాడు.

"తాతయ్యా, ఇప్పుడు మీరు నాతో రాకూడదా? మనం అక్కడికి చేరుకోగానే తప్పకుండా మీకు జాగా ఏర్పాటు చేస్తాను. ఇంకెందుకు ఆలశ్యం?"

తాతయ్య ఇప్పుడే తనవెంట రమ్మని ఈశ్వరన్ ఆహ్వానించాడు.

"ఎందుకో నాకది నచ్చలేదురా!" అన్నారు పశుపతి. "ఈ వయస్సులో అలా చెయ్యడం నాకిష్టంలేదు. నువ్వే ముందుగా ఏర్పాటు చేసి నాకు తెలియవచ్చుకదా? వాంజీని నాతో రమ్మంటాను. బెనారస్ లో రెండు మాసాలుంటే నాకు చాలు; బెనారస్ లో ఆఖరి ఊపిరి వదలానుకొనేవాళ్ళలాంటి వాడిని కాను నేను. నా ఆఖరి క్షణాలు ఈ కావేరీ తీరంలోనే గడపాలి. ఇప్పుడు నీతో రాలేకపోతున్నానని విచారం వద్దు; నేను తప్పకుండా వస్తాను! విడిది ఏర్పాటు చేసి నాకు తెలియజెయ్. అప్పడికి నేను సిద్ధంగా ఉంటాను!" అని అంటూ పశుపతి ఆ విషయాన్ని సానుకూలంగా పరిష్కరించారు.

తాతయ్యగారు శారీరకంగా బలహీనంగా కానవస్తున్నారేతప్ప ఈశ్వరన్ పట్ల ప్రేమ, ఉత్సాహంలో ఏమాత్రం క్రమించిపోలేదు. తాతయ్య సలహాని ఈశ్వరన్ అక్షరాలా కృతజ్ఞతతో స్వీకరించి ఆయన ఆశీస్సులు ఆకాంక్షిస్తూ ఆయన ముందు సాష్టాంగపడ్డాడు.

బెనారస్ చేరుకున్న వెంటనే ఈశ్వరన్ వాంజీతో కలిసి తాతయ్య సుఖంగా రెండు మూడు నెలలు విడిది చెయ్యడానికి అనువైన వసతి గృహం వెదకనారంభించాడు; వెంటనే ఏదీ కుదరలేదు. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణంకూడా ఆ వెదుకుబాటు త్వరపరచడానికి అనుకూలంగా లేదు. కలకత్తాపక్క వెళ్ళే రైలు పట్టాలు ఇటీవలి విపరీత వర్షాలకు బాగా దెబ్బ తినియుండడం వలన రాకపోకలకి చాలా ఇబ్బంది కలిగింది. ప్రయాణంకి రక్షణ లేకుండా పోవడమేకాక తపాలా బాగా దెబ్బ తినడమో లేక చాలా ఆలశ్యమవడమో జరుగుతుంది. ఉత్తర భారతంకి కొత్తవాడైన వాంజీ తోడ్పాటుతో దూరభారమైన ప్రయాణం చెయ్యమని తాతయ్యకి సలహా ఇచ్చే

సమయమా ఇది? ఒక వేళ రైలు పట్టాలు బాగుపడినాకూడా ఈ వాతావరణ పరిస్థితిలో అకస్మాత్తుగా అనుచితమైన మార్పులు వాతావరణంలో రావొచ్చు; తాతయ్యని ఎలాగైనా బెనారస్ కి తీసుకురావాలన్న కోరిక ఎంత నిరాశజనకమైనా ఈ పరిస్థితుల్లో అటువంటి సాహసం చెయ్యడానికి ఈశ్వరన్ ఏమాత్రం ఇష్టపడలేదు.

"మరి కొన్ని రోజులు చూద్దాంలే!" అని తనలో అనుకున్నాడు. "ఇంత త్వరలో నా ఆహ్వానంకోసం తాతయ్య ఎదురుచూడరు; అసలు ఆ సంగతి నేను మరిచిపోయానేమో అనికూడా అతను భావిస్తుండవచ్చు!" ఇలా ఆలోచిస్తుండగా ఉన్నట్టుండి ఒక రోజు "తాతయ్యా, వచ్చేయండి!" ఆని ఆహ్వానం పంపి పశుపతిని ఆశ్చర్యచకితుణ్ణి చేస్తే ఎంత బాగుంటుంది అనే ఆలోచన ఈశ్వరన్ కి వచ్చింది.

మన ఈశ్వరన్ ఈ విధమైన ఆలోచనలతో తపతపలాడుతుండగా ఆ ఈశ్వరుని ప్రణాలికలు వేరే విధంగా ఉన్నాయి. మనవడి దగ్గరనుంచి రాబోయే ఆహ్వానంకోసం ఆతృతగా ఎదురుచూస్తున్న పశుపతి మనవడు పశుపతీశ్వరన్ ఆలోచనల్ని అధిగమించాడు.

వాళ్ళ నాన్నగారిదగ్గరనుంచి ఈశ్వరున్ కి ఒక టెలిగ్రాం వచ్చింది: "వాంజీ వస్తున్నారు తాతగారితో; రైలుస్టేషన్ లో కలుసుకో!"

త్వరితంగా సంభవిస్తున్న ఘటనలతో ఈశ్వరన్ కొంచెం నిరుత్సాహపడ్డాడు; ప్రస్తుతం తను చేపట్చిన చర్యలవలన వస్తున్న జోడీకోసం ఐదారు రోజులు పోతేకాని మకాం ఏర్పాటుకాదు. అంతగా కాకపోతే తాత్కాలికంగా ఏ సత్రంలోనో లేక మఠంలోనో వాళ్ళ ఉనికి ఏర్పాటు చెయ్యవచ్చు. బహూశా తాతయ్యతో మరికొందరు యాత్రికలుకూడా ప్రయాణం చేస్తుంటారు. వారి ప్రోత్బలంతోనే ఆయన ఈ ప్రయాణం తలబెట్టివుంటారు. వాంజీ తనకి తోడుగా ఉన్నాడు. ఇక

మనవడు బెనారస్ లో తన్ను ఆహ్వానించడానికి అక్కడ ఊడగా ఉన్నాడు. 'అతనికి మరేం కావాలి?' అని ఈశ్వరన్ ఆలోచనలో పడ్డాడు.

తన గ్రామంనుంచి తాతయ్య ఇంత దూరంలోవున్న తన దగ్గరికివస్తున్నారన్న ఊహతో ఈశ్వరన్ ఊగిసలాడిపోయాడు. పళ్ళూ, పాలూ కొన్నాడు; ఈ వార్త తన స్నేహితులకి చెప్పాడు.

"నువ్వు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉన్నావే!" అన్నాడొక మిత్రుడు. "నా తాతయ్యే నన్ను చూడడానికి వస్తున్నారన్న విషయం తెలిస్తే ఆ అదురుకు నేనేమయ్యావాడినో నాకు తెలియదు; వనపిట్టలాగ ఆయన ఉపదేశాలు చెప్తుంటాడు."

"నిజంగా ఏదో ఒక రోజు మా తాతయ్య వస్తే బాగుంటుందనిపిస్తుంది నాకు," అన్నాడు మరొక మిత్రుడు. "ఇంటినుంచి ఎవరో ఒకరు వస్తున్నారన్న మాటతోనే నేను ఆహ్లాదపడిపోతాను."

"ఇంట్లో చేసిన పిండివంటలు ఏమైనా మీ తాతగారు తెస్తారనుకుంటున్నావా? వాటిని అతను తినరనుకో; ఐనా నీకోసం తీసుకురావచ్చుకదా? మాకు కొంచెం రుచి చూపిస్తావా?" అని అడిగాడు ఇంకొక స్నేహితుడు.

ఆ మిత్రుల్లో ఒకడు మరో మిత్రుడితో అన్నాడు: "మీ తాతయ్య ఒక పెద్ద పెట్టెలో అరటి ఒరుగులు తీసుకువచ్చినట్టు నాకు గుర్తు!" అని అంటూ అపనమ్మకంగా తలాడించాడు. "నిజం చెప్పాలంటే అవి నాకు నచ్చనేలేదు!"

ఈశ్వరన్ కొంచెం జంకాడు: ఆ స్నేహితులందరూ తాతయ్యని చూస్తే ఏమవుతుందో. తాతయ్య తన్ను అమితంగా ప్రేమిస్తున్న విషయం తనకి తెలుసు. కాని ఆ ప్రేమ ప్రభావంవలనే అతను తన స్నేహితులలో లోపాలు గమనించి, "వీడు ఒక వాగుడుతకాయ!", "ఇతను మొసగాడు!", "ఈ అబ్బాయి ఒక జిత్తులమారి!" అంటూ ఆరంభిస్తే ఏమవుతుందో? అదే ధోరణిలో

తన స్నేహితులుకూడా తాతయ్యపట్ల గౌరవం చూపించకపోతే? అతన్ని 'ఈ ముసలాడు!' అని ఎగతాళి చేస్తారేమో?ఈశ్వరన్.

"పెద్దవాళ్ళని తృప్తిపరచడం చాలా సులభం, తెలుసా? వాళ్ళముందు ఒక సాష్టాంగం పడిపోయి గౌరవం చూపించావనుకో, వాళ్ళు ఆశీస్సులతో నిన్ను ముంచేస్తారు; నువ్వు వాళ్ళతో ఎంత వాదించినా వాళ్ళు కోప్పడరు!" అన్నాడు ఈశ్వరన్. తన తాతయ్యగురించి తన స్నేహితులతో గొప్పగా చెప్పుకోడానికి ఈశ్వరన్ ప్రయత్నిస్తున్నాడు; పశుపతి నిత్యం తన బట్టలు తనే ఎలా ఉతుక్కుంటారనీ, ఒకప్పుడు ప్రతిష్టాకరమైన బిరుదలతోకూడిన ఒక గొప్ప పదవిలో ఉండేవారని వాళ్ళకి గుర్తుచేసాడు. ఏమైనా తన భయం వాంజీ గురించే; అర్థం లేని పనులతో వాంజీ తన స్నేహితులముందు తనకి తలవంపులు తెస్తాడేమో అనే ఆతురత. అంతలోనే మళ్ళీ తనకు తానే సంబాలించుకున్నాడు: వాంజీ తన బంధువు కాదుకదా?

ఆ మరుసటి ఉదయాన్నే, పడకమీదనుంచి లేస్తూనే ఈశ్వరన్ కి విభూతి గుర్తుకొచ్చింది; తాతయ్య తనకొకసారి ఆ పవిత్ర భస్మం ఇవ్వగా తను దాన్ని భద్రంగా దాచిపెట్టిన విషయం ఇప్పుడు జ్ఞాపకంలో వచ్చింది. పంచె కట్టుకున్నాడు; నుదుట విభూతి రేఖలు దిద్దుకున్నాడు; రైలు స్టేషన్ కి బయలుదేరాడు. మిత్రులు "ఏమయ్యా, మీ తాతయ్యని తైరకొట్టాలనుకుంటున్నావా?" అని వేళాకోళం చేసారు.

"నిజం చెప్పాలంటే ఇది నాకు ఒక ప్రత్యేకమైన అవకాశం," అని నవ్వుతూ వాళ్ళకి ఈశ్వరన్ బదులు చెప్పాడు; తొందరనే స్టేషన్ చేరుకున్నాడు. రైలుపెట్టెలు ఒకదానివెంట ఒకటి పరుగులు తీస్తుండగా నవ్వుకుంటూ ప్లేట్ ఫారం మీద నిలబడి గమనించాడు. బండి ఆగగానే రెండవ తరగతి పెట్టెవైపు - వయసు మళ్ళిన తాతయ్య అందులో ప్రయాణం చేస్తూండవచ్చనే ఉద్దేశంతో -

పరుగు తీసాడు. పశుపతి ఒక సారి యధాలాపంగా ఆ విషయం చెప్పినది గుర్తుకొచ్చింది.

ఈశ్వరన్ ఇంకా వెదుకుతూనే ఉన్నాడు; అంతేకాదు. తాతయ్య మూడో తరగతిలో ప్రయాణం చేస్తున్నాడనే ఊహతో కొంచెం మనసు నొచ్చుకున్నాడు. అడుగులు వెనక్కి తీసాడు. "నువ్వేనా ఈశ్వరన్?" అని అడిగారు వాంజీ తనముందు నిలుచొని. "మంచిది. నువ్వు వచ్చావన్న మాట."

"మీరు ఇక్కడికి వచ్చి చేరేరా అంకుల్?" అని ఈశ్వరన్ అప్యాయంగా ఆయన చెయి పట్టుకొని పలకరించాడు.

"నాకొక సూట్ కేసూ, సంచి మాత్రం ఉన్నాయి. ఏం బరువంటూ ఏది లేదు; మనకి కూలీ అవసరం ఉండదనుకుంటాను," అన్నారు వాంజీ. "దీన్ని మాత్రం కొంచెం జాగ్రత్తగా పట్టుకోవాలి," అని తన చేతిలోవున్న ఒక చిన్న పెట్టెని ఈశ్వరన్ కి అందించారు.

వాళ్ళకోసం ఒక కూలీ ఎదురుచూస్తున్నాడు. సామానులు తీసుకోమని వాడికి చెప్పి ఈశ్వరన్ కుడి ఎడమలకి చూస్తూ ఏదో వెదుకుతున్నట్టు కనిపించాడు: "తాతయ్యగారేరీ?" అని అడిగాడు.

"తాతయ్యగారా? . . . "

"అవును. తాతయ్యగారే; ఏం అతను రాలేదా? వసతికోసం ఏర్పాట్లు ముందుగా చేసి రమ్మని మిమ్మల్ని పంపారా?"

"ఈశ్వరా, నీకు టెలిగ్రాం అందిందా?"

"అందింది. లేకపోతే నేనేం జ్యోతిష్కుడనా మీరు వస్తున్నారని తెలుసుకోడానికి?" ఈశ్వరన్ తన చేతి సంచిలోనుంచి ఆ టెలిగ్రాం బయటకి తీసాడు.

టెలిగ్రాం చదవకుండానే వాంజీ బదులు చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారేకాని మాటలు పలకరించలేదు. గొంతెత్తడానికి విఫల ప్రయత్నం

చేస్తున్నారు. నీళ్ళునిండిన కళ్ళతో అతను టెలిగ్రాం చదివారు. అందులో ఒక ముఖ్య పదం తప్పింది. ఆ టెలిగ్రాం వాంజీయే స్వయంగా పంపాడు. కాని ఇక్కడ రాసినవారెవరో ఆ సమాచారం తిరిగి రాయడంలో పొరబాటు చేసారు. అది తన తప్పు కాదు, ఐనా వాంజీ కన్నీరు కారుస్తూనే నిలబడ్డారు: "ఈశ్వరా, ఈ చిన్నపెట్టెలో మీ తాతగారి అస్థికలున్నాయి. వాటిని గంగా నదిలో నిమజ్జనం చెయ్యడానికి నేనిప్పుడు ఇక్కడకి వచ్చాను."

తన శరీరమంతా అకస్మాత్తుగా జలసమాధిలో ఊడ్చిపెట్టినట్టు ఈశ్వరన్ కి అనిపించింది; వొంగి, చేతిలోవున్న ఆ చిన్నపెట్టెపైపు మతి పోయినవాడిలా చూస్తూ నిలబడ్డాడు.

"మీ నాన్నగారు రాసిన ఉత్తరం నీకు అందనేలేదా?"

ఒక వెక్కుతోనే సమాధానం చెప్పాడు ఈశ్వరన్; వొంగి, ఆ చిన్న పెట్టెని అందుకొని నడవడం ఆరంభించాడు.

ఇప్పుడు నేలకీ, గగనానికి వారధిగా మారిపోయిన తన తాతగారి రూపాన్ని ఒక క్షణం ఊహించుకుందామని అతనేం అనుకుంటున్నాడా? కాకపోతే ప్లేట్ ఫారంమీద గబ గబ నడుస్తూ కిందకీ మీదకీ ఎందుకలా ఆలోచిస్తున్నట్టు?

విచారింపవలసిన అగత్యం లేకుండా చివరికి ఒక దివ్యమైన ముగింపుకి చేరుకున్న తాతగార్ని గురించి ఇప్పుడు ఈశ్వరన్ని ఓదార్చేవారెవరు? తాతగారి అంత్యక్రియలు  కావేరీ తీరాన్న జరుగుతాయి; ఇప్పుడు అతని అస్థికలు పవిత్ర గంగానదిలో నిమజ్జనమవడానికి సిద్ధంగా ఉన్నాయి; పశుపతి స్వయ సాయుజ్యం పొంది ఈ భూత బంధాలనుంచి విముక్తులవుతారు.

కాలం చెప్తుంది, ఈశ్వరన్ సత్యాన్ని గుర్తిస్తాడు. ప్రస్తుతం విధి తనతో వికృతంగా ఆడుతోంది. ఒక ఇత్తడి కుండలో పవిత్రమైన గంగాజలం సీలుచేసి ఉన్నట్టే తాతగారి అస్థికలతో కూడిన ఒక కలశం తన చేతిలో ఉంది. ఐనాకూడా చివరి పరిశీలన వచ్చేసరికి విధికి ఓటమి తప్పదు; త్వరలోనే తన తాతగారి

అస్తికలు నిత్యమైన ఆ పవిత్ర గంగలో మిళితమైపోయి, అతని ప్రేమాభిమానాలు విశ్వ వ్యాప్తం చెందుతాయి.

ఇంతలో వడి వడిగా వెళ్తూన్న ఈశ్వరన్ తో శృతికల్పడానికి వాంజీ అతనివెంట పరుగులు తీసారు. "అతని మనవడివి నువ్వు ఇక్కడిక్కడే ఉన్నావు కాబట్టి ఆయన అంతక్రియలు జరిపించడానికి నువ్వే సరైనవాడివి," అని నచ్చచెప్పాలనుకొని అతను ఆరాటం చెందడానికి ఆస్కారం లేదనిపించింది.

********

**(మూలం ప్రచురణ: ఆనంద వికటన్, మే 3, 1959)**

# అనువాదకుల పరిచయాలు

**కే.వి.శేషారావు, జననం 19 . .**

(Sesha Rao Garu, please feel free to fill in the details below and expand! Need at least five or six more lines!)

జన్మస్థలం , చదువు . . . . .. ఉద్యోగం . ఇప్పుడు విజయనగరంలో ఉంటున్నారు. యాభై సంవత్సరాలకి పైగా తెలుగు సాహిత్యంకి, నాటక కళకి కృషి చేసారు. రాజాజీ ఆంగ్లంలో రాసిన రామాయణం, మహా భారతం, ఉపనిషత్తులు, తెలుగులో అనువాదం చేసారు . . . .

**ఏండి సుందరేశన్, జననం 1939**

జన్మస్థలం బరంపురం, ఒడిషాలోని గంజాం జిల్లాలో. ఇంజనీయరుగా ఇండియాలో 14 సంవత్సరాలు ఉద్యోగం చేసి, ఆ తరువాత అమెరికాలో M.B.A. చదవడానికి వచ్చి, 1977లో అమెరికాలోనే స్థిరపడిపోయారు. ఉద్యోగ విరమణ తరువాత, పదిహేను సంవత్సరాలుగా తమిళ కథలు, నవలలు ఆంగ్ల, తెలుగులో బాషల్లోకి అనువాదం చేస్తున్నారు. 2013 లో ఇతను అనువదించిన నీల పద్మనాభన్ తమిళ నవలని Autumn Reveries అనే పేరుతో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. దానికి 2016 లో **నల్లి చెన్నై దిశై ఎట్టుమ్** సంస్థ బిరుదు లభించింది.



ISBN 978-0-578-11805-5
90000 >
9 780578 118055